హరిద్వార్ మానసాదేవి
ఆలయంలో తొక్కిసలాట
ఆరుగురి మృతి.. 28 మందికి గాయాలు
విద్యుత్తు వైరు తెగిపడిందన్న వదంతులతోనే..
విచారణకు ఆదేశించిన ఉత్తరాఖండ్ సర్కారు
మృతులకు రూ.2 లక్షల పరిహారం: సీఎం ధామి
తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం
12

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

టీసీఎస్‌లో 12,000 ఉద్యోగాల కోత!
2025-26 ఆర్థిక సంవత్సరంలో 2% సిబ్బందిని
తొలగించనున్నట్లు ప్రకటించిన సంస్థ
మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ప్రభావం
12

సోమవారం | 28-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 103 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: చవితి రా.11.25 తదుపరి పంచమి, నక్షత్రం: పుబ్బ సా.5.36 తదుపరి ఉత్తర, వర్జ్యం: రా.1.21-3.05, దుర్ముహూర్తం: మ.12.47-1.38, మ.3.21-4.12, అమృతఘడియలు: ఉ.10.52-12.33, రాహుకాలం: ఉ. 7.30-9.00, సూర్యోదయం: 5.56, సూర్యాస్తమయం: 6.46 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జన్మభూమిని మరవొద్దు
తెలుగుజాతి ఎక్కడైనా వెలుగుజాతే: చంద్రబాబు

కర్మభూమిలో ఎదగండి.. జన్మభూమి కోసమూ నిలవండి!
సింగపూర్ గడ్డపై ప్రవాసులకు సీఎం పిలుపు
5 రోజుల పర్యటన కోసం సింగపూర్ చేరిక
సంప్రదాయబద్ధంగా తెలుగువారి స్వాగతం
ఆయనకు, లోకేశ్‌కు మహిళల హారతులు
నీతి, నిజాయితీలతో ఎదిగిన దేశం సింగపూర్
అందుకే అమరావతిలో భాగస్వామిని చేశా
గత ప్రభుత్వ తప్పులను సరిదిద్దడం నా బాధ్యత
ఈ విషయాన్ని ఆ దేశ ప్రభుత్వానికీ చెబుతాను
పీ4కు సహకరించండి.. పెట్టుబడులతో రండి
'ప్రవాస' పరిశ్రమలకు ప్రోత్సాహం
'గ్లోబల్ ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ సెల్' ఏర్పాటుకు యోచన: ముఖ్యమంత్రి
మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, థాయ్ నుంచీ సమావేశానికి వచ్చిన ప్రవాసులు

ఎన్ఆర్ఐలే బ్రాండ్ అంబాసిడర్లు
రాష్ట్రాభివృద్ధిలో వీరంతా భాగస్వాములు కావాలి
ఏపీలో సింగపూర్ ఎఫ్‌డీఐలకు సహకరించండి
తెలుగు డయాస్పోరా సమావేశంలో లోకేశ్


తెలుగు డయాస్పోరా సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. (ఇన్‌సెట్) సీఎంకు హారతిచ్చి స్వాగతం పలుకుతున్న సింగపూర్ ప్రవాస మహిళలు

తెలుగువాళ్లు స్థిరపడిన దేశం వారికి కర్మభూమి. అవకాశాలు కల్పించిన ఆ దేశాభివృద్ధి కోసం పనిచేయాలి. అదే సమయంలో పుట్టిన గడ్డను మరువకూడదు. ఆంధ్రప్రదేశ్ వారి జన్మభూమి. దాని అభివృద్ధి కోసమూ పనిచేయాలి. పెట్టుబడులు పెట్టాలి.
- సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లో స్థిరపడి.. సంపద సృష్టిస్తున్న తెలుగు వాళ్లు జన్మభూమిని మర్చిపోకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. ఐదు రోజుల సింగపూర్ పర్యటనలో భాగంగా ఆదివారం అక్కడి వన్ వరల్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ (ఓవిస్) డిజిటల్ క్యాంపస్‌లో జరిగిన 'తెలుగు డయాస్పోరా ఫ్రం సౌత్ ఈస్ట్ ఏషియా కార్యక్రమంలో సీఎం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ నాన్-రెసిడెంట్ తెలుగు సొసైటీ (ఏపీఎన్నార్టీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సింగపూర్‌తో పాటు
మిగతా 13వ పేజీలో...

పెట్టుబడులతో వస్తాం!
రాష్ట్రంలో గృహనిర్మాణంపై సుర్బానా జురాంగ్ ఆసక్తి
సీఎం చంద్రబాబుతో సంస్థ సీఈవో చెర్ ఎక్లో భేటీ
సింగపూర్ మోడల్ హౌసింగ్ విధానంపై చర్చ
అమరావతి మాస్టర్‌ప్లాన్ మెరుగుదలపైనా
ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎవర్సెండాయ్ ప్రతిపాదన.. విశాఖ లేదా కృష్ణపట్నంలో ఏర్పాటు!



గనుల ఆదాయం పెంచాలి
రెండేళ్లలో రెండింతలు కావాలి
ఎండీసీపై 9 వేల కోట్ల బాండ్ల భారం.. తట్టుకోవాలంటే ఏటా 2 వేలకోట్లు కావాలి
ప్రస్తుత ఆదాయం 923 కోట్లే.. వృద్ధి మార్గాలపై సర్కారు దృష్టి
గనుల శాఖ నుంచి ప్రతిపాదనలు.. ఎండీసీకి ప్రభుత్వ బకాయిలే 1444 కోట్లు
జేపీ వెంచర్స్ నుంచి 167 కోట్లు.. మరో 6 ప్రైవేటు కంపెనీలు 242 కోట్లు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
నూతన ఖనిజ తవ్వకాల ప్రాజెక్టులు తీసుకొచ్చి ఆదాయం పెంచాలనుకున్న సర్కారుకు కొత్త సమస్య వచ్చిపడింది. రాష్ట్రంలోని ఖనిజ నిక్షేపాలు, లీజులను ఆదాయ వనరుగా చూపించి 9 వేల కోట్ల బాండ్లు సేకరించిన ప్రభుత్వం.. తిరిగి అసలు, వడ్డీ చెల్లింపుల విషయంలో చిక్కులను ఎదుర్కొనే ప్రమాదం కనిపిస్తోంది. 9 వేల కోట్ల బాండ్లతో కొత్త ఖనిజ ప్రాజెక్టులను చేపడతామని సర్కారు చెబుతున్నా.. అవి కార్యరూపంలోకి వచ్చి ఆదాయం తీసుకొచ్చేదెప్పుడు అన్నదానిపై స్పష్టత లేదు. కానీ 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి బాండ్లకు అసలు, వడ్డీ కలిపి ఏటా 1800 కోట్ల రూపాయల చొప్పున తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఇది సజావుగా సాగాలంటే ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) ఆదాయం 2026-27 నాటికి రెండింతలు కావాల్సి ఉంది. ఇది ఎవరో చెబుతున్న మాటకాదు. స్వయంగా రాష్ట్ర గనుల శాఖే సర్కారు ముందు ఉంచిన ఓ నివేదిక సారాంశం. ప్రస్తుతం ఎండీసీకి వివిధ ప్రాజెక్టుల ద్వారా వస్తున్న ఆదాయం నగదు రూపంలో లెక్కిస్తే
మిగతా 14వ పేజీలో...


12
విజయవాడలో నీటి నిర్వహణ
పద్ధతులు భేష్
స్వచ్ఛ భారత్ మిషన్ ఒక సామూహిక ఉద్యమం
స్పేస్ డేపై నమో యాప్‌లో సందేశాలు పంపండి
'మన్ కీ బాత్'లో దేశ ప్రజలకు మోదీ పిలుపు


14
తగ్గిన వాన.. పెరిగిన ఎండ
కావలిలో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రత

ఎస్పీపై రౌడీషీట్ తెరుస్తారా?
అంబటి వ్యాఖ్యలు దారుణం
ఇది పోలీసులను బెదిరించడమే
పోలీసు సంక్షేమ సంఘం ఆగ్రహం
రిమాండ్‌లో ఉన్న మిథున్‌రెడ్డికి
పెద్దిరెడ్డి పీఎస్‌వో సపర్యలు నేరమే
పూర్తి స్థాయి విచారణ తర్వాతే సస్పెన్షన్
3

మహిళా స్కీమ్ సొమ్ము తినేస్తున్న మగాళ్లు!
మహారాష్ట్రలో 'లడ్కీ బహిన్' కుంభకోణం
లబ్ధిదారులుగా 14,298 మంది
పురుషులు.. రిజిస్ట్రేషన్‌లో అక్రమాలు
మహిళలుగా నమోదు చేసుకున్న వైనం
ఇంకా లక్షలాదిగా 'అనర్హ' లబ్ధిదారులు
12

'ఉపాధి'లో దోచేశారు!

అనుమతి లేని జగనన్న కాలనీల చదును పనులు
యథేచ్ఛగా తప్పుడు మస్టర్లు.. నిధుల స్వాహా
రికార్డులు లేకుండా పనుల అప్పగింత.. జీఎస్టీ ఎగవేత
జగన్ ప్రభుత్వ హయాంలో పథకం దుర్వినియోగం
జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం తనిఖీల్లో వెల్లడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని భ్రష్టు పట్టించారు. జగన్ సర్కార్ నిబంధనలను తుంగలో తొక్కి 'ఉపాధి' నిధులను వైసీపీ కార్యకర్తలకు ఫలహారంగా పంచిపెట్టినట్లు జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం తనిఖీల్లో తేలింది. అనుమతి లేని జగనన్న కాలనీల చదును పనులు చేశారని, తప్పుడు మస్టర్ల ద్వారా నిధులు స్వాహా చేశారని, రికార్డులు లేకుండా పనులు అప్పగించారని వెల్లడైంది. రాష్ట్రంలో ఉపాధి పథకం తప్పుదారి పట్టిందని 'ఆంధ్రజ్యోతి' గతంలో పలు కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే. జగనన్న కాలనీల చదును పేరిట రూ.1,500 కోట్ల ఉపాధి నిధులు
మిగతా 14వ పేజీలో...

కుక్క, పిల్ల, సబ్బు బిళ్ల, అగ్గి పుల్ల.. కవితకు కాదేదీ అనర్హం అన్నట్టుగా.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి, అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్లుగా వ్యవహరించారు. పలు మార్గాల్లో పై స్థాయి నుంచి కింది స్థాయి నేతల వరకు ప్రభుత్వ సొమ్ము దోచుకొని.. దాచుకున్నారు. ఈ కోవలోనే గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైన 'ఉపాధి' హామీ పథకంలోనూ మెక్కేసిన విషయం, నిధులను దుర్వినియోగం చేసిన వైనం జాతీయ స్థాయి మానిటరింగ్ బృందం తనిఖీల్లో తేటతెల్లమైంది. మరో వైపు కొవిడ్ కోసం కేంద్రం ఇచ్చిన నిధులను దారిమళ్లించినట్లు తేలింది.
వైసీపీ పాపాలు



'కరోనా' సొమ్మూ పక్కదారి!
కేంద్రం ఇచ్చిన రూ. 208 కోట్లను ఇతర పథకాలకు మళ్లించిన జగన్
రాష్ట్ర వాటా రూ.139 కోట్లు గాలికి.. రూపాయి కూడా కేటాయించని వైనం
తామిచ్చిన సొమ్ముపై కేంద్రం ఆరా
గ్రాంట్ ఇవ్వకపోవడంపై ఆగ్రహం
208 కోట్లు వడ్డీతో తిరిగిచ్చేయాలని ఆరోగ్య శాఖకు కేంద్రం ఘాటు లేఖ
కొవిడ్ రోగుల వైద్యంపై వైసీపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం.. భారీగా మృతులు
మందులు సరఫరా చేసిన వారికీ బిల్లులు చెల్లించని జగన్ ప్రభుత్వం
ఇరకాటంలో పడ్డ ప్రస్తుత సర్కారు

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం చేసిన పాపాలు రాష్ట్రాన్ని ఇప్పటికీ వెంటాడుతూనే ఉన్నాయి. వైసీపీ హయాంలో జరిగిన ఆర్థిక అవకతవకలు ప్రస్తుత ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా కేంద్రం ఇచ్చిన నిధులను నిర్దేశిత పనులకు వెచ్చించకుండా ఇతర పథకాలకు మళ్లించడంతో ఆయా నిధులను తిరిగి వెనక్కి ఇచ్చేయాలంటూ కేంద్రం ఒత్తిడి చేస్తోంది. జగన్ జమానాలో జరిగిన తప్పులకు ప్రస్తుత ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కొవిడ్-19 నియంత్రణ కోసం నిధులు విడుదల చేసింది. కేంద్రం ఏ కార్యక్రమానికి
మిగతా 14వ పేజీలో...

సీమ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక
ప్రోత్సాహకాలు
ప్యాకేజీ ప్రకటించిన ప్రభుత్వం
ఎకరా రూ.5 లక్షల చొప్పున 1,100 ఎకరాల కేటాయింపు
టౌన్‌షిప్ కోసం మరో 200 ఎకరాలు
268 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు జమ్మలమడుగు నుంచి లైన్
గండికోట నుంచి ఏటా 2 టీఎంసీలు
ఎన్‌హెచ్-69తో అనుసంధానిస్తూ 12 కిలోమీటర్ల యాక్సెస్ రోడ్డు
ముద్దనూరు నుంచి ప్లాంట్ వరకు 12 కిలోమీటర్ల రైల్వేలైన్
పదేళ్లు విద్యుత్ సుంకం రాయితీ
రూ.16,350 కోట్ల పెట్టుబడి
2,500 మందికి ఉపాధి
2029కల్లా తొలి దశ పూర్తి


అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): దశాబ్దాల క్రితం కడప జిల్లాలో ప్రతిపాదించిన రాయలసీమ స్టీల్ ప్లాంట్ త్వరలోనే పట్టాలెక్కనుంది. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన ఈ భారీ ప్రాజెక్టు ఇప్పటిదాకా శంకుస్థాపనలకే పరిమితమైంది. గత ఏడాది టీడీపీ కూటమి
మిగతా 3వ పేజీలో...

రాష్ట్రంలో విద్యారంగం తీరు మారుతోంది. ఓ వైపు ఏటా వేల సంఖ్యలో సీట్లు మిగిలిపోతున్నా కొత్త కాలేజీలు పుట్టుకొస్తున్నాయి. ఉన్న కాలేజీలు సీట్లు పెంచుకుంటున్నాయి. ఫలితంగా సీట్లున్నా.. విద్యార్థులు లేక కాలేజీలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే డిగ్రీ కాలేజీల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పుడు ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలు కూడా అదే దారి పడుతున్నాయి.

సీట్లు ఫుల్.. అడ్మిషన్లు డల్!
పాలిటెక్నిక్, ఇంజనీరింగ్‌లో భారీగా మిగిలిపోతున్న సీట్లు
డిప్లొమాలో మిగిలింది 34 వేలు.. ఇంజనీరింగ్‌లో భర్తీకానివి 34 వేలు.. డిగ్రీలో భర్తీ 35 శాతంలోపే
అయినా సీట్లు పెంచుకుంటున్న కాలేజీలు
అదనంగా అందుబాటులో మేనేజ్‌మెంట్ కోటా

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కాలేజీలు ఒకప్పుడు కళకళలాడుతుండేవి. కానీ, రానురాను మారుతున్న విద్యావ్యవస్థ, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిరుచుల కారణంగా పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ చదివేవారి సంఖ్య తగ్గుముఖం పడుతోంది. దీంతో ఆయా కాలేజీల్లో సీట్లు మిగిలిపోతున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఇంజనీరింగ్ తొలివిడత కౌన్సెలింగ్‌లో దాదాపు 34 వేల సీట్లు మిగలగా, తాజాగా పూర్తయిన పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లోనూ 34 వేల సీట్లు భర్తీకాకుండా పోయాయి. ఇంజనీరింగ్‌లో మరో విడత కౌన్సెలింగ్
మిగతా 3వ పేజీలో...

'మార్గదర్శకులు'గా
టీచర్లా?
హెచ్‌ఎంలు, ఎస్‌ఏలను ఈ జాబితాలో చేర్చాలని ఒత్తిడి
ఏలూరు డీఈవో ఆదేశాలు.. మండిపడుతున్న ఉపాధ్యాయులు
తమనే దత్తత తీసుకోవాలని ఆక్రోశం


అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పేదలను పైకి తీసుకురావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రారంభించిన 'పీ-4' పథకం అమలులో కొందరు అధికారులు వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రధానోపాధ్యాయులు(హెచ్‌ఎం), స్కూల్ అసిస్టెంట్ల(ఎస్‌ఏ)ను మార్గదర్శులుగా నమోదు చేయాలని తాజాగా ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) జారీ చేసిన ఆదేశాలపై విమర్శలు వస్తున్నాయి. జిల్లాలో 190 మంది టీచర్లను మార్గదర్శులుగా నమోదు చేయించాలని డీఈవో ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ ఆదేశాల
మిగతా 14వ పేజీలో...

స్వదేశానికి 12 మంది గోదావరి యువకులు

» దుబాయిలో యాజమానితో పని వివాదం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

దుబాయిలో భవనాలకు రంగులు వేసే ఒక సంస్థలో పెయింటర్లుగా పని చేయడానికి వచ్చి పని విషయమై యాజమానితో ఏర్పడిన వివాదంలో.. 14 మంది పశ్చిమ గోదావరి జిల్లా యువకులు ఆదివారం స్వదేశానికి వెళ్లారు. దుబాయిలోని వీధుల్లో పని ప్రదేశాల వద్ద తీవ్ర ఎండల కారణంగా ఈ యువకులు నానా అవస్థలు పడ్డారు. అయినా యజమాని వీరిపట్ల కఠినంగా వ్యవహరించడంతో తాము వెనక్కి వెళ్లిపోతామని మొరపెట్టుకున్నారు. అయినా యజమాని స్పందించలేదు. దీంతో వీరి అవస్థలపై 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించగా, ఏపీ ఎన్నార్టీ అధికారులు స్పందించి వీరికి అండగా నిలిచారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చేసిన సూచనతో వీరిని దుబాయికి పంపించిన దళారీ.. వీరిని వెనక్కి రప్పించారు. రాస్ అల్ ఖైమా నుంచి ముంబాయి మీదుగా హైద్రాబాద్‌కు వీరు చేరుకున్నారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం అనంతరం దుబాయిలోని వాసవీ క్లబ్‌తో పాటు అనేక మంది దాతలు వీరికి సహాయం చేయడానికి ముందుకొచ్చారు. దుబాయిలోని సామాజిక కార్యకర్త తరపట్ల మోహన్ అటు దుబాయి అధికారులు, కంపెనీ యాజమాన్యం, ఇటు ఏపీ ఎన్నార్టీ అధికారులతో సంప్రదింపులు జరిపి వీరిని స్వదేశానికి పంపించడంలో కీలక పాత్ర వహించారు.

త్వరలో వ్యవసాయ యంత్రాల సమగ్ర సర్వే

» ఆగస్టు 31లోగా పూర్తి: అగ్రికల్చర్ డైరెక్టర్ డిల్లీరావు

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా గ్రామ వ్యవసాయ యంత్రాల సమగ్ర సర్వేను త్వరలో ప్రారంభించనున్నట్టు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. ఆగస్టు 31లోగా ఈ సర్వే పూర్తి చేయనున్నట్లు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సహాయకులు ఈ సర్వే నిర్వహిస్తారని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలు, ప్రైవేట్ సంస్థల వద్ద ఉన్న యంత్రాలను గుర్తించి రాయితీ, వ్యక్తిగత కొనుగోలు వంటి అంశాలను నమోదు చేస్తారని వెల్లడించారు. ఈ సర్వే ద్వారా పంట విస్తీర్ణం, సాగుకు అవసరమైన పరికరం, యంత్రాల లభ్యత, పరికరం వాడకపు స్థితి వంటి వివరాలు తేలితే, గ్రామ అవసరాన్ని బట్టి ప్రత్యేక బడ్జెట్ ప్రణాళికలు రూపొందించడానికి వీలవుతుందని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్, పిచికారి, కోత అనంతర పరికరాల వివరాలను సేకరిస్తామన్నారు. ఈ సర్వే వివరాలను ఏపీ అగ్రికల్చర్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఏపీ ఎయిమ్2.0), కృత్రిమ మేధ, ఈ-సీహెచ్‌సీ ప్లాట్‌ఫామ్, కస్టమ్ హైరింగ్ సెంటర్స్, వ్యవసాయ యాంత్రీకరణ సబ్ మిషన్ పథకం, పీఎం కిసాన్ వంటి రైతు సంబంధ పోర్టల్స్‌కు అనుసంధానిస్తామని తెలిపారు. వ్యక్తిగత, సంస్థాగత, రైతుసేవా కేంద్రాల స్థాయిలో యంత్రాల డిజిటల్ జాబితాను రూపొందిస్తామని చెప్పారు. దీనివల్ల వాస్తవ లబ్ధిదారు, వాస్తవ వినియోగం, బుకింగ్, చెల్లింపు వంటి ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పడుతుందని, డ్రోన్ ఆధారిత స్ప్రేయింగ్ యంత్రాల విస్తరణకు ఈ సర్వే సమాచారం దోహదపడుతుందని తెలిపారు.

సీట్లు ఫుల్.. అడ్మిషన్లు డల్!

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించాల్సి ఉంది. కానీ, పాలిటెక్నిక్ తుదివిడత కౌన్సెలింగ్ పూర్తయినా మరో 34 వేల సీట్లు మిగిలిపోవడం గమనార్హం.

ఇంజనీరింగ్‌లో 33,721 మిగులు

ఇంజనీరింగ్ అడ్మిషన్ల తొలి విడత కౌన్సెలింగ్ ఇటీవల పూర్తయింది. కన్వీనర్ కోటాలో 1,52,246 సీట్లు ఉంటే వాటిలో 1,18,525 భర్తీ అయ్యాయి. 33,721 సీట్లు మిగిలిపోయాయి. యూనివర్సిటీ కాలేజీల్లో 848, ప్రైవేటు యూనివర్సిటీల్లో 1,111 సీట్లు మిగిలాయి. ప్రైవేటు కాలేజీల్లో ఏకంగా 31,762 సీట్లు భర్తీ కాలేదు. ఈ సంవత్సరం రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీలకు ఏఐసీటీఈ 2 లక్షలకు పైగా సీట్లు మంజూరు చేసింది. వీటిలో మేనేజ్‌మెంట్ కోటాలో దాదాపు 50 వేల సీట్లు ఉన్నాయి. కన్వీనర్ కోటాలో అన్ని విడతల్లోనూ సీట్లు భర్తీ ప్రక్రియ పూర్తయిన తర్వాత మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుంది. అయితే అందులోనూ కంప్యూటర్ సైన్స్ సీట్లు మినహా ఇతర కోర్ గ్రూపుల్లో సీట్లు అలాగే ఉండిపోతున్నాయి. అయితే ఎక్కువ కాలేజీల్లో అసలు మేనేజ్‌మెంట్ కోటా అవసరమే ఉండడం లేదు. మారుమూల ప్రాంతాల్లో, పెద్దగా పేరు లేని కాలేజీల్లో కన్వీనర్ కోటా సీట్లు భర్తీ కావడమే గగనమైంది. దీంతో కన్వీనర్ కోటా అయినా పూర్తిగా భర్తీ చేసుకోవాలని ఆయా కాలేజీలు నానా పాట్లు పడుతున్నాయి.

గత కొద్ది సంవత్సరాలుగా రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీలు పెరుగుతున్నాయి. అనేక మంది విద్యార్థులు తొలుత ప్రైవేటు యూనివర్సిటీల్లో ప్రయత్నించి అక్కడ సీటు రాకపోతే ప్రైవేటు కాలేజీల్లో చేరుతున్నారు. టాప్ ర్యాంకర్లు ఎవరూ ప్రైవేటు కాలేజీల్లో చేరట్లేదు. రాష్ట్రంలో కొత్తగా కొన్ని కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడంతో ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లను ప్రభావితం చేస్తోందని తెలుస్తోంది.

ఇంజనీరింగ్ కోసమే డిప్లొమా

ఒకప్పుడు డిప్లొమా కోర్సులకు విపరీతమైన డిమాండ్ ఉండేది. కానీ, ఇప్పుడు డిప్లొమా అంటే ఇంజనీరింగ్‌లో చేరేందుకు ఒక మార్గంగానే విద్యార్థులు భావిస్తున్నారు. 90శాతం పాలిటెక్నిక్ విద్యార్థులు కోర్సు పూర్తవగానే ఈసెట్ ద్వారా ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో చేరుతున్నారు. డిప్లొమాతో ఉపాధి అవకాశాలు మెరుగ్గానే ఉన్నా వాటివైపు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. సాఫ్ట్‌వేర్ రంగంపై ఉత్సాహంతో దాదాపు అందరూ ఇంజనీరింగ్ బాట పడుతున్నారు. దీంతో పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. దాదాపు సగం సీట్లు మిగిలిపోతున్నాయి. 2025-26లో రాష్ట్రవ్యాప్తంగా 79,367 సీట్లు అందుబాటులో ఉంటే వీటిలో 45,283(57శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. 34,084 సీట్లు మిగిలిపోయాయి. వీటిలోనూ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో అడ్మిషన్లు కొంత మెరుగ్గానే ఉన్నా, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 46శాతం సీట్లు మిగిలిపోయాయి.

డిగ్రీ.. మరీ దారుణం

ఇంజనీరింగ్ విద్య పెరిగిన తర్వాత సాధారణ డిగ్రీ కోర్సుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇంజనీరింగ్‌లో సీటు రానివారు, ఊర్లోనే ఉంటూ చదువుకోవాలనుకునేవారు, డిగ్రీలో బీసీఏ, బీబీఏ, డేటా సైన్స్‌లాంటి కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో 1,200 డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వాటిలో 4.5 లక్షల సీట్లు ఉండగా, గత మూడేళ్ల నుంచి లక్షన్నర సీట్లు దాటి భర్తీ కావడం లేదు. అంటే సగటున 33శాతం సీట్లు మాత్రమే నిండుతున్నాయి. కొన్ని కాలేజీల్లో 5-10 శాతం సీట్లు కూడా భర్తీ కావట్లేదు. ఇక, డిగ్రీ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ కోటాను చాలా కాలేజీలు ఎప్పుడో తీసేశాయి. పట్టణ ప్రాంతాల్లో ఉండే ప్రముఖ కాలేజీల్లో కొన్ని కోర్సుల్లో మాత్రమే మేనేజ్‌మెంట్ కోటా సీట్లు నిండుతున్నాయి. 270 కాలేజీల్లో గత మూడేళ్లలో 25శాతం సీట్లు కూడా భర్తీ కాలేదు. దీంతో అసలు మేనేజ్‌మెంట్ కోటానే రద్దుచేయాలని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. మేనేజ్‌మెంట్ కోటా రద్దుచేస్తే కొన్ని కోర్సుల సీట్లయినా వంద శాతం భర్తీ అవుతాయని యాజమాన్యాలు భావిస్తున్నాయి.

విద్యార్థుల్లోనూ మూస ధోరణి

విద్యార్థులు, తల్లిదండ్రుల్లోనూ మూస ధోరణి పెరుగుతోంది. ఎక్కువ మంది ఏం చదివితే అదే చదవాలి అనే ఆలోచనా విధానమే ఎక్కువగా కనిపిస్తోంది. ఒకప్పుడు విద్యార్థి సామర్థ్యానికి అనుగుణంగా ఏం చదవాలనేది నిర్ణయించేవారు. కానీ ఇప్పుడు పదో తరగతి, ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులను కూడా ఇంజనీరింగ్ చదివించాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. దీనికి తగ్గట్టుగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంజనీరింగ్ కాలేజీలు అందుబాటులోకి రావడంతో ఏదో ఒక కోర్సు అయినా ఇంజనీరింగ్‌లోనే చేర్పిస్తున్నారు. ఐటీఐ, ఇతర వృత్తి విద్య కోర్సుల్లో అడ్మిషన్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది.

డిప్లొమా అడ్మిషన్ల కౌన్సెలింగ్ పూర్తి

రాష్ట్రంలో 88 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 17,943 సీట్లు అందుబాటులో ఉంటే 11,954(67శాతం) భర్తీ అయ్యాయి. 5,987 మిగిలిపోయాయి. 165 ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 61,424 సీట్లు ఉండగా వాటిలో 33,329(54శాతం) మాత్రమే భర్తీ అయ్యాయి. తుది విడత కౌన్సెలింగ్‌లో 4,628 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించారు. పాలీసెట్‌లో మొత్తం 1,33,359 మంది అర్హత సాధించారు. వారిలో 49,707 మంది కౌన్సెలింగ్‌లో రిజిస్టర్ చేసుకున్నారు. కాగా, ఈ నెల 14 నుంచే డిప్లొమా తరగతులు ప్రారంభమయ్యాయి. తుదిదశలో సీట్లు పొందినవారు సోమవారం నుంచి ఈ నెల 30లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సాంకేతిక విద్యాశాఖ తెలిపింది.

ఎస్పీపై రౌడీషీట్ తెరుస్తారా? | అంబటి వ్యాఖ్యలు దారుణం

» ఇది పోలీసులను బెదిరించడమే
» పోలీసు సంక్షేమ సంఘం ఆగ్రహం
» రిమాండ్‌లో ఉన్న మిథున్‌రెడ్డికి పెద్దిరెడ్డి పీఎస్‌వో సపర్యలు నేరమే
» పూర్తి విచారణ తర్వాతే సస్పెన్షన్
» పోలీసు సంఘం నేతల స్పష్టీకరణ


ఉదయ్‌కుమార్

చిత్తూరు అర్బన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖ ఇచ్చిన ఉత్తర్వులను పాటించకుండా.. తమ ప్రభుత్వం వస్తే చిత్తూరు ఎస్పీపైనే రౌడీషీట్ తెరుస్తామని మాజీ మంత్రి అంబటి రాంబాబు అనడం దారుణమని ఉమ్మడి చిత్తూరు జిల్లా పోలీసు సంక్షేమ సంఘం నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది పోలీసులను బెదిరించడమేనన్నారు. ఆదివారం చిత్తూరులో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, కోశాధికారి ఎం.పరంధామనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఖాదర్ బాషా, ఈసీ సభ్యుడు శరవణ తదితరులు విలేకరులతో మాట్లాడారు. 'పోలీసు యంత్రాంగం చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా పనిచేస్తోంది. తప్పుడు ప్రకటనలతో పోలీసు వ్యవస్థ మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించడం మానుకోవాలి. బంగారుపాళ్యంలో మాజీ సీఎం జగన్ పర్యటనకు 500 మందికి అనుమతిస్తే వేల మంది వైసీపీ కార్యకర్తలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతోనే పోలీసులు కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రభుత్వం కేటాయించిన పీఎస్‌వో ఆయన భద్రతను గాలికొదిలి.. రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో రిమాండ్‌లో ఉన్న ఎంపీ మిథున్‌రెడ్డికి అవసరమైన వస్తువులను తీసుకెళ్లడం, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే ఎస్పీ సస్పెండ్ చేశారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపాకే ఈ నిర్ణయం తీసుకున్నారు. నిందితుడికి మానవతా దృక్పథంతో పీఎస్‌వో దిండు, భోజనం తీసుకెళ్లారని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం' అన్నారు.


ఆలయం ముందు గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుమలేశుడి సేవలో గవర్నర్ అబ్దుల్ నజీర్

తిరుమల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. విశ్రాంతి తీసుకున్నాక ఉదయం 10 గంటలకు కుటుంబ సమేతంగా ఆలయం వద్దకు చేరుకున్న గవర్నర్‌కు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అధికారులు, అర్చకబృందం ఇస్తికఫాల్(ఆలయ మర్యాదల)తో స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన గవర్నర్ ధ్వజస్తంభానికి మొక్కుకుని ఆ తర్వాత గర్భాలయంలోని మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం రంగనాయక మండపానికి చేరుకున్న గవర్నర్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా.., ఈవో, అదనపు ఈవో శ్రీవారి చిత్రపటాన్ని అందజేశారు.

కనకదుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు సీజే


సీజే ధీరజ్‌సింగ్ ఠాకూర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న దుర్గగుడి ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఆదివారం సతీసమేతంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ప్రధాన న్యాయమూర్తికి ఆలయ ఈవో శీనానాయక్ స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం మల్లేశ్వరస్వామి ఆలయం, అద్దాల మండపాన్ని దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్టత, అమ్మవారికి జరిగే నిత్యపూజలు, ఆలయ అభివృద్ధి గురించి ఈవోను అడిగి తెలుసుకున్నారు.

మహానందీశ్వరుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఈవో

మహానంది, జూలై 27(ఆంధ్రజ్యోతి):మహానంది క్షేత్రంలో మహానందీశ్వరుడిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం, కుంకుమార్చన, కోదండ రామాలయంలో నామార్చన నిర్వహించారు. జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులను ఈవో శ్రీనివాసరెడ్డి శాలువాతో సత్కరించి, స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

ఆందోళన కలిగిస్తున్న బదిలీల ప్రక్రియ

» ప్రభుత్వ ఉద్యోగుల సంఘం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ

విజయవాడ (గాంధీనగర్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో బదిలీల ప్రక్రియ ప్రభుత్వ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రామమోహన్ గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రాజకీయ నేతలు తమ స్వీయ అస్థిత్వం కోసం ఉద్యోగుల బదిలీల్లో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపించారు. బదిలీల కోసం అధికారుల వద్దకు వెళ్తున్న ఉద్యోగులను ఎమ్మెల్యేల లెటర్లు ఉన్నాయా అని అడిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వేదిక లేకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగాన్ని సవరించి, పార్లమెంట్‌లో చట్టంచేసి ఏర్పాటుచేసిన అడ్మిన్‌స్ట్రేటివ్ ట్రిబ్యునల్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో కొనసాగుతుండగా, గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఉద్యోగులకు రూ.25 వేల కోట్లకు పైగా ఉన్న వివిధ రకాల ఆర్థిక బకాయిల చెల్లింపునకు ఒక ప్రణాళిక ప్రకటించాలని తీర్మానించారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లోని జీపీఎఫ్ బకాయిలు, గత ప్రభుత్వంలో ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లో నుంచి అక్రమంగా తీసుకున్న రూ.500 కోట్లపై విచారణ నివేదికను బహిర్గతం చేయాలని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. లోపభూయిష్టంగా ఉన్న విధానాన్ని రద్దుచేసి పారదర్శకమైన ఏకరీతి నిర్దిష్టమైన బదిలీ విధానాన్ని రూపొందించాలని తీర్మానించారు. ప్రధాన ఉద్యోగ సంఘానికి ప్రతి ఉద్యోగి నేరుగా ఓటు వేసి ఎన్నుకునేలా ప్రభుత్వమే ఒక ఎన్నిక విధానాన్ని చట్ట నిబంధనల ప్రకారం తీసుకురావాలని తీర్మానించారు. ఈ సమావేశంలో జేఏసీ కో-చైర్మన్ కె.హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి బాజీ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 1న వెన్నుపోటు దినం: ఏపీసీపీఎస్ఈఏ


పెన్షన్ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

విజయవాడ (వన్‌టౌన్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, ఇతర డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న 'వెన్నుపోటు దినం' పాటించాలని నిర్ణయించారు. విజయవాడలోని బందరురోడ్డులో ఉన్న అటల్ బిహారీ వాజపేయి విజ్ఞాన కేంద్రంలో 47 ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, కార్మిక, కర్షక ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సెప్టెంబరు 1న విజయవాడలో పెన్షన్ మార్చ్ జరపాలని, నల్లచొక్కాలతో హాజరుకావాలని, ఆరోజును వెన్నుపోటు దినంగా పాటించాలని సమావేశంలో నిర్ణయించారు. మహాత్మాగాంధీ దండియాత్ర స్ఫూర్తితో పాదయాత్ర చేయాలని కూడా నిర్ణయించారు. పాదయాత్ర పోస్టర్‌ను ఐక్యవేదిక చైర్మన్ కేఆర్ సూర్యనారాయణ, ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర అధ్యక్షుడు, సెక్రటరీ జనరల్ బాజీ పఠాన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆగస్టు ఒకటి నుంచి సెప్టెంబరు ఒకటి వరకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో, పాఠశాలలో పెన్షన్ మార్చ్‌కు సంఘీభావం తెలపాలని కోరారు.

ఏపీ ఎన్జీవో మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలి

» ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో తీర్మానం

విజయవాడ (గాంధీనగర్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ఎన్జీవో రాష్ట్ర మహిళా విభాగాన్ని తాలూకా స్థాయి నుంచి జిల్లా, రాష్ట్రస్థాయిలో బలోపేతం చేయాలని ఆ విభాగ రాష్ట్ర చైర్‌పర్సన్ వి.నిర్మలాకుమారి, కన్వీనర్ పి.మాధవి పిలుపునిచ్చారు. విజయవాడ గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో సంఘ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా ఉద్యోగుల సమస్యలు, వేతనాలు, పెండింగ్ అంశాలు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సవాళ్లు.. తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చైల్డ్‌కేర్ లీవ్‌లను సద్వినియోగం చేసుకునే విషయంలో...జీవోలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను సవరించాలని, స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మహిళా విభాగాన్ని పటిష్టపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తీర్మానించారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న మహిళా ఉద్యోగులకు జూమ్ సమావేశాల నుంచి మినహాయింపు ఇవ్వాలని, వారిపై పనిభారాన్ని తగ్గించాలని, పని ప్రదేశాల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు.


అన్నప్రసాదం స్వీకరిస్తున్న వెంకయ్య నాయుడు, పక్కన టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్

అన్నప్రసాదం ఎంతో రుచిగా, శుచిగా ఉంది

» తిరుమలలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తిరుమల, జూలై 27 (ఆంధ్రజ్యోతి): 'భగవంతుడి అన్నప్రసాదం స్వీకరించడం చాలా సంతోషంగా ఉంది. పైగా ఎంతో రుచిగా, శుచిగా ఉంది' అంటూ టీటీడీ అన్నప్రసాదాలను మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కొనియాడారు. శ్రీవారి దర్శనార్థం ఆదివారం తిరుమలకు వచ్చిన ఆయన మధ్యాహ్నం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకుని భక్తులతో కలిసి అన్నప్రసాదాలు స్వీకరించారు. అనంతరం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి అన్నప్రసాద భవనంలోని కామెంట్ బుక్‌లో 'భోజనం రుచిగా, శుచిగా, చక్కగా ఉన్నది. భగవంతుడి సన్నిధిలో భోజనం చేయడం భగవత్ ప్రసాదం' అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇక, భోజన సమయంలోమసాలా వడ ప్రసాదంపై టీటీడీ చైర్మన్‌తో మాట్లాడుతూ.. మసాలా వడలకు నెల్లూరు ఫేమస్ అని, ఈ వడలు తింటుంటే నెల్లూరు గుర్తుకువస్తోందంటూ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం శ్రీవారి సేవకులతో కొద్ది సమయం ముచ్చటించారు. కాగా, సోమవారం ఉదయం వెంకయ్య నాయుడు శ్రీవారిని దర్శించుకోనున్నారు.

దేవస్థానం నిధులు వేరేవాటికి వాడకూడదు

అతిథి గృహంలో వెంకయ్యనాయుడిని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. భక్తుల సౌకర్యార్థం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను తెలియజేశారు. నిధుల విషయంలో చైర్మన్ చాలా గట్టిగా ఉన్నారనే విషయాన్ని భానుప్రకాశ్‌రెడ్డి తెలియజేస్తున్న క్రమంలో వెంకయ్య నాయుడు స్పందిస్తూ 'అలానే ఉండాలి. దేవస్థానం నిధులను ధర్మప్రచారం, దేవాలయాల పునరుద్ధరణకు తప్ప వేరేవాటికి వాడనే వాడకూడదు' అన్నారు.

'ఉపాధి' పాత బిల్లుల చెల్లింపులకు గ్రీన్‌సిగ్నల్

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గత టీడీపీ ప్రభుత్వం(2014-19)లో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఉపాధి పథకం పనులను కేంద్రం రీఓపెన్ చేయడంతో ఆయా బిల్లులను అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఈ పనులకు సంబంధించి 30 రోజులు రీఓపెన్ స్థితిలో ఉంటాయని, ఆయా బిల్లులను అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ కృష్ణతేజ అన్ని జిల్లాల కలెక్టర్లకు లేఖ రాశారు. నమోదైన కాంట్రాక్టర్లకు పీఎఫ్ఎంఎస్ ద్వారా మెటీరియల్ చెల్లింపులు చేయాలన్నారు. సీఎఫ్ఎంఎస్ ఐడీలో కాంట్రాక్టర్ల రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఒకేలా ఉండాలన్నారు. గత టీడీపీ హయాంలో జరిగిన ఉపాధి హామీ పనులను వైసీపీ సర్కార్ వచ్చిన వెంటనే రద్దు చేసి, బిల్లులు చెల్లించకుండా నిలిపేసి విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ పనులను తిరిగి ఓపెన్ చేస్తూ కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 'కంప్లీటెడ్' నుంచి 'ఆన్‌గోయింగ్' స్థితికి మారుస్తూ ఎన్ఆర్ఈజీఏ సాఫ్ట్‌వేర్‌లో మార్చారు.

రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నూతన కార్యవర్గం

విజయవాడ (సత్యనారాయణపురం), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన నూతన అధ్యక్షుడిగా ఏఆర్‌కే మూర్తి (మచిలీపట్నం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గార్లపాటి విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా వారణాసి దుర్గాసారథి, కోశాధికారిగా నందిరాజు ప్రకాష్, అధికార ప్రతినిధిగా పి.వెంకట ఫణికుమార్, ఉపాధ్యక్షులుగా హనుమంతరావు, ఎస్వీఆర్ రవీంద్రబాబు, సురిబాబు, రామశాస్త్రి ఎన్నికయ్యారు. సంఘటన వ్యవస్థాపక అధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వేమూరి ఆనందసూర్య అధ్యక్షతన సత్యనారాయణపురంలో ఆదివారం ఈ ఎన్నిక జరిగింది.

సీమ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారంలోకి వచ్చిన తర్వాత జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ లిమిటెడ్ (జిందాల్ స్టీల్స్) సంస్థ కడప జిల్లా జమ్మలమడుగులోని సున్నపురాళ్లపల్లె వద్ద రెండు దశల్లో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేసి.. 2,500 మందికి ఉపాధి కల్పిస్తామని తాజా ప్రతిపాదనలు సమర్పించింది. దీంతో ఈ ప్రాజెక్టును సాకారం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని ప్రకటిస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. రెండు దశల్లో మొత్తం రూ.16,350 కోట్ల పెట్టుబడితో 2034 ఏప్రిల్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేస్తామని జేఎస్‌డబ్ల్యూ తెలిపింది. మొదటి దశలో రూ.4,500 కోట్ల పెట్టుబడితో 1,000 మందికి ఉపాధి కల్పన, రెండో దశలో రూ.11,850 కోట్ల పెట్టుబడితో 1,500 మందికి ఉపాధి కల్పనకు ప్రతిపాదనలు సమర్పించింది. 2029 నాటికి మొదటి దశను పూర్తి చేసి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించనుంది. 2034 నాటికి రెండో దశ పూర్తి చేస్తుంది. ఈ ప్రతిపాదనలను రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్ఐపీసీ), రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సిఫారసులతో ఆమోదించిన రాష్ట్రప్రభుత్వం.. రాయలసీమ స్టీల్ ప్లాంట్ పేరుతో ఈ ప్రాజెక్టును పూర్తి చేసేందుకు జేఎస్‌డబ్ల్యూ ఏపీ స్టీల్ లిమిటెడ్‌కు ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని విస్తరించింది. సింగిల్ డెస్క్ పోర్టల్ 2.0 కింద అవసరమైన ఆమోదాలు, అనుమతులను సులభతరం చేస్తూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో వేగంగా ప్రాజెక్టును పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను నిర్దేశించింది. ఈ ప్యాకేజీ కింద.. సున్నపురాళ్లపల్లె వద్ద ఎకరా రూ.5 లక్షల చొప్పున 1,100 ఎకరాల భూమిని ఔట్‌రైట్ సేల్ ప్రాతిపదికన.. ఇప్పటికే ఉన్న ఏపీఐఐసీ నిబంధనల ప్రకారం.. రెండు దశల సేల్ అగ్రిమెంట్ కమ్ సేల్ డీడ్ కింద ప్రభుత్వం కేటాయించింది. టౌన్‌షిప్ ఏర్పాటు కోసం సున్నపురాళ్లపల్లె వద్ద మరో 200 ఎకరాలు కేటాయించింది.

» ప్లాంట్‌కు అవసరమైన 268 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు జమ్మలమడుగు సబ్‌స్టేషన్‌నుంచి 400 కె.వి. డబుల్ సర్క్యూట్ ట్రాన్స్‌మిషన్ లైన్ (డిస్ట్రిబ్యూషన్ సబ్‌స్టేషన్‌తోపాటు) ఏర్పాటు.
» ఏటా 2 టీఎంసీల నీరు గండికోట జలాశయం నుంచి కేటాయింపు. ఈ నీటి సరఫరాకు పంపింగ్ సదుపాయాలతో పైప్‌లైన్ ఏర్పాటు.
» జాతీయ రహదారి-67తో అనుసంధానం చేస్తూ ప్రాజెక్టు ప్రాంతం వరకు 12 కిలోమీటర్ల మేర 4 లైన్ల యాక్సెస్ రోడ్డు నిర్మాణం.
» ముద్దనూరు రైల్వేస్టేషన్ నుంచి ప్లాంట్ వరకు 12 కిలోమీటర్ల మేర పీఎం గతిశక్తి పథకం కింద రైల్వేలైన్ ఏర్పాటు.
» ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం (4.0) కింద ప్రాజెక్టు స్థిర మూలధన పెట్టుబడిలో 50 శాతం వరకు మినహాయింపు.
» పదేళ్ల కాలంలో రూ.607.2 కోట్ల వరకు 20 శాతం మూల ధన ప్రోత్సాహకాలు.
» ఉత్పత్తి ప్రారంభించిననాటి నుంచి పదేళ్లలోపు రూ.1,092 కోట్ల వరకు విద్యుత్ సుంకం రాయితీ, రూ.4,875 కోట్ల మేర స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్.
» రెండో దశ ప్రాజెక్టు పనులు నిర్దేశిత సమయపాలన ప్రకారం ప్రారంభిస్తే.. స్థిర మూలధన పెట్టుబడిలో 50 శాతం ప్రోత్సాహకాలు.

కొత్త పరిశ్రమలకు రాయితీలు

పేపర్, ఫార్మా, సోలార్ కంపెనీలకు ప్యాకేజీ

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు స్థాపించనున్న పలు కంపెనీలకు ప్రభుత్వం భూకేటాయింపులు, ఇతర ప్రోత్సాహకాలు ప్రకటించింది. ప్రోత్సాహకాల ప్యాకేజీ అమలుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో రూ.3,700 కోట్ల పెట్టుబడితో 1,200 మందికి ఉపాధి కల్పించే 6 గిగావాట్ల ఫొటోవోల్టాయిక్ ఇంగోట్-వేఫర్ తయారీ కర్మాగారాన్ని రీన్యూ ఫొటోవోల్టాయిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయనుంది. వచ్చే జనవరి-మార్చి నెలల మధ్య నిర్మాణ పనులు ప్రారంభించి 2028 కల్లా వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభిస్తామని ఆ సంస్థ ప్రతిపాదనలు సమర్పించింది. దీంతో రాంబిల్లి వద్ద 135.96 ఎకరాల భూమిని (నీటి వనరులను మినహాయించి) ఎకరానికి రూ.66 లక్షల రాయితీ రేటుకు ప్రభుత్వం కేటాయించింది. స్థిర మూలధన పెట్టుబడిపై 30 శాతం రాయితీని ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుంచి పదేళ్లలో అందజేయనుంది. యూనిట్‌కు ఒక రూపాయి చొప్పున విద్యుత్తు టారిఫ్ రీయింబర్స్‌మెంట్ (రూ.354.17 కోట్లకు మించకుండా), ఐదేళ్ల పాటు విద్యుతు సుంకం పూర్తిగా మినహాయింపు, నీటి చార్జీలలో 25 శాతం (రూ.87.60 కోట్లకు మించకుండా) తిరిగి చెల్లింపు, పారిశ్రామిక వినియోగం, టౌన్‌షిప్, ఇతర కార్యకలాపాల కోసం భూమి కొనుగోలుపై స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, బదిలీ సుంకం పూర్తిగా మినహాయింపు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన పీఎల్ఐ ప్రోత్సాహకంపై 10 శాతం (రూ.140 కోట్లకు మించకుండా) టాప్‌అప్ ప్రోత్సాహకాలను ప్రభుత్వం అందించనుంది. ఇంకా అవసరమైన ఇతర సౌకర్యాలు, ఆమోదాలు, అనుమతులను సులభతరం చేసి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్ఫూర్తితో ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది.

» తిరుపతి జిల్లా నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో 1475 మందికి ఉపాధి కల్పిస్తూ రూ.1147.05 కోట్ల పెట్టుబడితో గ్రీన్‌లామ్ లిమిటెడ్ సంస్థ ఏర్పాటు చేయనున్న హై-ప్రెజర్ లామినేట్, ఉడ్ బేస్డ్ పార్టికల్ బోర్డ్ తయారీ కర్మాగారానికి (2, 3 దశలు పూర్తిచేయడానికి) ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని ప్రకటించింది.
» తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1358 కోట్ల పెట్టుబడితో 1770 మందికి ఉపాధి కల్పనతో ఫార్మా కంపెనీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించిన ఎక్స్‌లెంట్ ఫార్మా సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం కొన్ని ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.
» కర్నూలు జిల్లాలోని ఓర్వకల్ మెగా ఇండస్ట్రియల్ హబ్‌లో 5 గిగా వాట్ల సోలార్ మాడ్యూల్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చిన అగస్త్య ఎనర్జీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు ప్రభుత్వం టైలర్ మేడ్ ఇన్సెంటివ్స్‌ను ప్రకటించింది. రూ.6,933.11 కోట్ల పెట్టుబడితో 2028 నాటికి ప్రాజెక్టును పూర్తిచేసి 2,138 మందికి ఉపాధి కల్పిస్తామంటూ ఆ సంస్థ ప్రతిపాదనలు సమర్పించింది.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

గుంటూరు(తూర్పు), జూలై 27 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన చట్టాలతో రాష్ట్రంలో పెన్షన్‌దారులకు సమస్యలు ఎదురవుతున్నాయని, పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఏపీ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ ఇంజనీరింగ్ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు టీఎంబీ బుచ్చిరాజు కోరారు. గుంటూరులో ఆదివారం జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. వేతన విభజన చట్టాల ముసుగులో జరుగుతున్న వర్గీకరణ మూలంగా విశ్రాంత ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 12వ వేతన సవరణ పూర్తి స్థాయిలో అమలు కావాలని, మధ్యంతర భృతి 35 శాతం, 12వ పీఆర్సీలో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. జీవో 315 సవరణ ద్వారా భార్యాభర్తలకు కుటుంబపెన్షన్ వర్తించేలా మార్పులు చేయాలని కోరారు. అమరావతిలో పెన్షన్‌దారుల భవనం నిర్మించాలని కోరారు.

సోమవారం 28 జూలై 2025

వివిధ

vividha@andhrajyothy.com
సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

కె.ఎస్. జయమ్మ స్ఫూర్తి పురస్కారం

కె.ఎస్. జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని సీనియర్ సంపాదకుడు, ఉపన్యాసకుడు, సాహిత్య విశ్లేషకుడు కె. శ్రీనివాస్ స్వీకరిస్తారు. ఆగస్టు 8 మ.2 గంటలకు పలమనేరులో జరిగే సాహిత్య కార్యక్రమంలో ఈ పురస్కార ప్రదానం జరుగుతుంది. పురస్కారం కింద జ్ఞాపిక, ఇరవై ఐదువేల రూపాయల నగదు అందచేస్తారు. వివరాలకు: 94409 95010.

పలమనేరు బాలాజి

రాచకొండ సాహితీ పురస్కారం

రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఆధ్వర్యంలో రావిశాస్త్రి సాహితీ పురస్కార ప్రదాన సభ జూలై 30 సా.6గంటలకు విశాఖ పౌర గ్రంథాలయం, ద్వారకానగర్‌లో జరుగుతుంది. పురస్కారాన్ని దాట్ల దేవదానం రాజు స్వీకరిస్తారు. అధ్యక్షత గండికోట రఘురామారావు. సభలో రాచకొండ ఉమాకుమార శాస్త్రి, ప్రయాగ సుబ్రహ్మణ్యం, టి. రవిరాజు, డి.వి. సూర్యారావు, శిఖామణి ప్రసంగిస్తారు.

విశాఖ రసజ్ఞ వేదిక

'ద ద్వారం స్కూల్ ఆఫ్ వయొలిన్' ఇష్టాగోష్ఠి

వయొలిన్ కళాకారులు, సంగీత విద్వాంసులు ద్వారం దుర్గా ప్రసాదరావు గారు సంగీత, సాహిత్య, జీవన విషయాలపై రాసిన వ్యాస సంకలనం 'జీవాళి' ఇటీవల ప్రచురితమైన నేపథ్యంలో 'ద ద్వారం స్కూల్ ఆఫ్ వయొలిన్' పేరుతో ఆయనతో సోదాహరణ ప్రసంగం, ఇష్టాగోష్ఠి కార్యక్రమం ఆగస్ట్ 2 సా.6.30గం.లకు 'సప్తపర్ణి' సాంస్కృతిక కేంద్రం, ప్లాట్ 21, రోడ్ నెంబర్ 8, బంజారా హిల్స్, హైదరాబాద్‌లో జరుగుతుంది. ద్వారం సత్యనారాయణ రావు వయొలిన్ కచేరితో కార్యక్రమం ప్రారంభమవుతుంది. మృదంగ సహకారం: శ్రీ పెరవలి జయభాస్కర్.

సుమనస్పతి

విమర్శా గ్రంథాలకు ఆహ్వానం

అరసం, వరంగల్ ఇచ్చే ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు స్మారక సాహిత్య పురస్కారం – 2025 కోసం విమర్శా గ్రంథాలను ఆహ్వానిస్తున్నాం. 2021 జూలై నుంచి 2025 జూన్ మధ్యలో ప్రచురితమైన విమర్శా గ్రంథాలు నాలుగు ప్రతులను ఆగస్టు 31 లోగా చిరునామా: బూర భిక్షపతి, ఇం. నెం: 2-12-293/20, రోడ్ నెంబర్ 2బి, విజయనగర్ కాలని, గోపాలపురం రోడ్, హనమకొండ – 506009, ఫోన్- 9866612712కు పంపాలి. ఎంపికైన గ్రంథకర్తకు అక్టోబర్ 2025లో హనుమకొండలో జరుగు ప్రత్యేక కార్యక్రమంలో రూ.5000 నగదు, శాలువ, జ్ఞాపికతో పురస్కారం ప్రదానం ఉంటుంది.

బూర భిక్షపతి

నవీన జాను తెనుగు కవి

ప్రపంచీకరణ పెను దుమారం నుంచి కాపాడుకునే రక్షణ కవచాలు దేశీ రచనలు. దేశీయతలో భాగమైన జాను తెనుగుదనం జాతికి జవమూ జీవమూ. దేశీ కవిత్వం దేశీ రక్తమాంసాలతో నిర్మాణమవుతుంది. సామాన్యంగా ఉంటూ నైసర్గిక స్వభావంతో అలరారుతుంది. వస్తువులో రూపంలో భావంలో ప్రకటనలో స్థల కాలాలను ప్రతిబింబిస్తుంది. 'ఎవరిబిడ్డ! ఇది' అంటే, 'ఇది తెలుగువాడి బిడ్డ' అని గర్వంగా చెప్పుకునేటట్టుగా ఉంటుంది. ఈ బాటలో తెలుగు సాహిత్యంలో పాల్కురికి బాటకు ఆధునిక కొనసాగింపు అన్నవరం దేవేందర్.

ప్రాచీనకాలంలో "జాను తెనుగు విశేషము ప్రసన్నతకు" అన్న మాటలకూ, "సరళముగాగ భావములు జాను తెనుగున ఇంపు పెంపుతో" అన్న భావనకూ అక్షర సాక్ష్యం నేటి అన్నవరం దేవేందర్ కవిత్వం.

దేవేందర్ ఎనభయ్యవ దశకంలో 'జీవగడ్డ', 'ప్రతిపక్షం', 'అన్న', 'ఆంధ్ర జ్యోతి' మొదలైన పత్రికల్లో తెలంగాణ నుడికారంతో ప్రత్యేక శీర్షికలు నిర్వహించాడు. అప్పటి కల్లోల తెలంగాణ విప్లవ అలజడులను అధ్యయనం చేశాడు. తన ప్రాంతమైన హుస్నాబాద్ సాయుధ పోరాట కాలపు మొదటి ఎన్‌కౌంటర్‌కు, ఆసియాలోనే అతిపెద్ద స్తూప నిర్మాణానికి నిలువెత్తు సాక్ష్యం. తొంభయ్యవ దశకంలోనే ప్రాంతీయ ఆధిపత్యపు అణచివేత తీవ్రమైంది. అస్తిత్వ ఉద్యమాలు, ప్రపంచీకరణ ప్రభావాలు పురుడుపోసుకున్నాయి. హుస్నాబాద్‌లో రిక్కల సహదేవరెడ్డి మొదలైన వారితో కలిసి 1986లో 'నూతన సాహితి' స్థాపకులలో దేవేందర్ ఒకడుగా ఉన్నాడు. 'సిమాంట' పేరుతో ప్రాంతీయ కవితా సంకలనం వెలువరించాడు. 1993లో దళిత బహుజన సోయితో మొదలైన 'దళిత రచయితలు కవులు మేధావుల ఐక్య వేదిక' (దరకమే) కార్యశాల నిర్వహణలో పాలుపంచుకున్నాడు. ఈ స్థల కాలాల మీదుగా అన్నవరం దేవేందర్ విప్లవ భావజాలం, ప్రాంతీయ భాషా సంస్కృతుల పట్ల మమకారం, దళిత బహుజన అస్తిత్వ ప్రకటన, ప్రపంచీకరణ వ్యతిరేక దృక్పథంతో 'తొవ్వ', 'నడక' సంపుటాలతో కవిగా బయలుదేరాడు. ప్రపంచీకరణతో కుదేలైన పల్లెల ముఖచిత్రాన్ని 'మంకమ్మ తోట లేబర్ అడ్డా'గా ముద్రించాడు. 'బుడ్డ పర్కలు' నానీల సంపుటిలో కుల మత ఆధిపత్య దురహంకారాల మీద నిప్పు కణికలు విసిరాడు. 2001లో పురుడు పోసుకున్న 'తెలంగాణ రచయితల వేదిక' వ్యవస్థాపక సభ్యుడిగా ఉండి, ఆ వేదిక నుంచి వెలువడిన త్రైమాసిక పత్రిక 'సోయి'లో విస్తృతంగా భావజాల వ్యాప్తికి పాదులు వేశాడు. 'బొడ్డుమల్లె చెట్టు', 'పొద్దు పొడుపు', 'పొక్కిలి వాకిళ్ళ పులకరింత' పుస్తకాల్లో తెలంగాణోద్యమ చైతన్యాన్ని కవితా ప్రవాహం చేశాడు. నాటి నుండి నేటి వరకు నాలుగు దశాబ్దాలుగా విరామం లేకుండా కవిత్వం రాస్తున్నాడు.

అన్నవరం కవిత్వం భాషలో భావంలో ఈ కాలపు కవులందరికన్నా భిన్నమైనది. అది వర్తమాన చరిత్రను, తెలంగాణ సాంస్కృతికతను ప్రజల భాషలో ప్రకటిస్తుంది. జాతీయత దేశీయత అతని నుడికారంలో వ్యక్తమవుతుంది. సాధారణంగా వచన రచనల్లోనే సామెతలు, జాతీయాలు, పలుకుబడులు, కాకువు వంటి వాటిని ఎక్కువగా ప్రయోగిస్తుంటారు. అన్నవరం కవిత్వంలో అచ్చమైన దేశీయతా జాను తెనుగు లక్షణాలను పుణికిపుచ్చుకున్న జీవద్భాషా పరిమళాలు వీస్తాయి. వస్తువు విషయంలో స్థానీయతకు ప్రాధాన్యతను ఇచ్చినా ఇతర అంశాలను కవిత్వం చేసేటప్పుడు దాన్ని కూడా స్థానిక వేషభాషలతో రాణింపజేస్తాడు. భావ స్ఫూర్తి కోసం వినూత్న పదబంధాలను రూపొందించడం పాఠకుడిని ఆశ్చర్య చకితుణ్ణి చేస్తుంది. నిత్య జీవితంలో దర్శించే సామాన్య వస్తువులను ఒక జెన్ తాత్వికునిలా కొత్తగా పరిచయం చేస్తాడు అన్నవరం. జీవితంలోని వివిధ సందర్భాల్లోని సున్నిత భావ స్పందనలను కవిత్వంలోకి తీసుకువచ్చి తన కవితా ప్రయాణాన్ని కొత్త దారుల్లో నడిపిస్తాడు. అలంకరణ సామాగ్రి అంతా పల్లె నేపథ్యం నుంచి దృశ్యమానం చేస్తుంది.

"కళాత్మకంగా కుండను వానినట్లు
నాణ్యతగా చెప్పును ముడిచినట్లు



అందమైన చీరను నేసినట్లు
నేను కవిత్వాన్ని పదిలంగా అల్లుతాను" – అంటూ ఉత్పత్తి కులాల సృజన మూలమే తన కవితకు ఆయువుపట్టని స్పష్టంగా ప్రకటించాడు. "ఎల్లలు ఎన్ని దాటినా, నా మట్టి వాసనే నాకు పులకరింత, నా ప్రాదేశికత ముందు, ప్రపంచీకరణ గుడ్డ పేలిక, విస్తరిస్తున్న విశ్వీకరణకు, ప్రాంతీయాత్మే ప్రతిఘటన" అన్నప్పుడు అన్నవరం కవితలోని సూటిదనం మనల్ని ఆకట్టుకుంటుంది. "కోల్గేట్ యాప పుల్లను నమిలి మింగింది, రెక్సోనా గట్టి పిండిని ఎండగట్టింది, విమ్ బార్‌తో తౌడు కొట్టుకపోయింది, క్లినిక్ ప్లస్‌ల కుంకుడు కాయ మునిగింది" అన్న పాదాలలో ప్రపంచీకరణ ప్రభావాన్ని ప్రాంతీయ క్రియా పదాలతో స్పష్ట పరచడం అన్నవరం సరళాభివ్యక్తికి మచ్చు తునక. ప్రపంచీకరణతో పట్నం బాట పట్టిన రైతు కూలీల దీన స్థితిని "మంకమ్మ తోట లేబర్ అడ్డా మీద, బక్క చిక్కిన దేహాలన్నీ, లొట్టబోయిన కండ్లతో చూస్తున్నాయి" అన్న దృశ్యంతో కరుణ రసాత్మకంగా మనస్సులో ముద్రించాడు. "దొడ్డు దొడ్డు నిఘంటువులు ఓరకు పెట్టి, ప్రబంధాలన్నీ కాసేపు తనబ్బిల దాసుకోండ్రి, ఏరుకోండ్రి ఏరుకోండ్రి, నిఘంటువుల కెక్కని నిఖార్సయిన పదాలు, తేట తేట పదాలు సామెతల సౌరభాలు" అని ఒక పల్లెటూరి గొంతుతో పలకడం అన్నవరం కవిత ప్రత్యేకత. పదాలను పునరావృత్తి చేసి దీప్తిమంతం చేయడం, మనస్సులో స్థిరమయ్యేట్టు చెయ్యడం అన్నవరం కవిత్వంలో కనిపిస్తుంది.

అన్నవరం దేవేందర్ కవిత్వమంతా ఊరును కేంద్రంగా చేసుకొని ప్రపంచాన్ని దర్శింప జేసే రీతిలో ఉంటుంది. "ఇల్లు వాకిలే కాదు, మా ఊరంటే సుత, నాకు పెయ్యంత పులకరింత, బడి, బాయి, ఎద్దూ ఎవుసం, వాగులు వాడలు, నన్ను నన్నుగా తీర్చిదిద్దిన శిల్ప రహస్యాలు" అంటూ తన కవితా శిల్పం ఊరి నుంచి తీసుకున్నదేననే విషయాన్ని గుర్తు చేస్తాడు దేవేందర్.

అన్నవరం కవిత్వమంతా ఊరును కేంద్రంగా చేసుకొని ప్రపంచాన్ని దర్శింపజేసే రీతిలో ఉంటుంది. "ఇల్లు వాకిలే కాదు, మా ఊరంటే సుత, నాకు పెయ్యంత పులకరింత, బడి, బాయి, ఎద్దూ ఎవుసం, వాగులు వాడలు, నన్ను నన్నుగా తీర్చిదిద్దిన శిల్ప రహస్యాలు" అని తన కవితా శిల్పం ఊరి నుంచి తీసుకున్నదేననే విషయాన్ని గుర్తు చేస్తాడు. అన్నవరం పుస్తకాల పేర్లు, కవితల శీర్షికలు జాను తెనుగుతనంతో శోభిస్తాయి. 'మంకమ్మ తోట లేబర్ అడ్డా', 'బుడ్డపర్కలు', 'పొద్దు పొడుపు', 'పొక్కిలి వాకిళ్ల పులకరింత', 'వరి గొలుసులు', 'గవాయి', 'ఊరి దస్తూరి' వంటి పుస్తకాల పేర్లు దీనికి నిదర్శనం. 'బీమారి', 'ఇగం', 'ఎటమటం', 'నీల్గుడు', 'పెయ్యికాక', 'బుదురకిచ్చు', 'పంచగజ్జ పలారం', 'అగిర్త', 'సొక్కం', 'జిట్టికండ్లు', 'సడక్', 'దస్కత్' వంటి ఎన్నెన్నో జాను పదాలు కవితా శీర్షికలై అలరిస్తాయి. జాను పదకల్పన అన్నవరంకు అల్కటి ముచ్చట. వీటిలో ఆధునిక పదజాలాన్ని కూడా వాడుకోవడం, ఆడుకోవడం కనిపిస్తుంది. ఉదాహరణకు: 'అమెరికాపురం', 'ఇడుపుల మాయ', 'పైస మొలక', 'పుస్తక వికసన', 'జియో సాలెగూడు', 'నెట్టురోగం', 'సెల్ గిచ్చుడు', 'వయసహంకారం', 'భయోమయం', 'ఎర్ర సెజ్'... వంటి వందలాది పదబంధాలు అన్నవరం సృజనాత్మక అభివ్యక్తిని సౌందర్యమయం, కళామయం చేస్తాయి. అన్నవరం కవిత్వ రూపంలో ఏ వస్తువునైనా తెలంగాణీకరించే ప్రత్యేకత ఉంది. తెలంగాణ నుడికారాన్ని నేర్పుగా వాడే శక్తి ఉంది. ఆధునిక నాగరిక భాషను తెలంగాణ నుడికారంలోకి తర్జుమా చేయగలిగే నైపుణ్యం ఉంది. కొత్త పదాలను, సమాసాలను పరికల్పన చేసే బహుముఖీన ప్రతిభ ఉంది. సందర్భోచితంగా భావ చిత్రాలు, మానవీకరణ, వ్యంగ్య భాష ద్వారా కవిత్వాన్ని దృశ్యీకరించే సొబగు ఉంది. ఆధునిక తెలుగు కవిత్వంలో అన్నవరం జాను తెనుగు కవిత్వానికి ప్రతినిధి అనడం సముచితమే.

(అన్నవరం దేవేందర్ దాశరథి పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా)

■ బూర్ల వెంకటేశ్వర్లు
✆ 94915 98040

ఇద్దరు బంగారు తల్లులు



మీరు
నా గుండెపై
విచ్చుకున్న పూల రేకులు
యదపై తారాడే రంగుల సీతాకోకలు

పాలపుంతల నక్షత్ర వీధుల్లో
ఆటలాడుకుని వస్తారు
అప్పుడు మీ అరమోడ్పు కళ్లలో
మిరుమిట్లుగొలిపే కాంతి రజను
నడిసముద్రపు లోతుల్లో
మునకలేసి వచ్చుంటారు
అందుకే మీ స్పర్శకి
వెచ్చని ఇసుక తడి

ఊహాతీత లోకాల్లోని
తూనీగల్లా మోసుకొచ్చిన
ప్రేమ పుప్పొడి
నాలో ఆకలిదప్పుల్ని దహిస్తుంది

మీ బోసి నవ్వులు
నీటి బుడగ కాలానికి
దిశ నిచ్చిన ప్రాణ వాయువులు
మీ బుల్లి బుల్లి వేళ్ళ అంచులతో
నా గుండెపై రాసిన కవితలకి
కిన్నెర రాగాలు కడతాను
అప్పుడు నా హృదయం
సుగంధభరితమౌతుంది
నేను నాకు అత్యంత
విలువైనదానిలా కనిపిస్తాను

నాలో నాకే తెలీని
ఎన్నో ఆశలూ భావాలు
రంగులూ కాంతులూ అనుభూతులూ
మీతో పాటే చిగురించాయి
మీలాగే అందంగా పెరిగి పెద్దయ్యాయి

ఎన్నడూ లేని
భయాలు ఆందోళనల్ని
మీ కౌగిళ్ళ వెచ్చదనంలోంచి
నేనెదుర్కొన్నాను

అమ్మచెట్టుకు అల్లుకున్న
పూలతీగలు మీరు
మీకు నే దన్నుననుకుంటాను గానీ
మీరు లేని నాకు ఉనికి లేదు
మీకన్నీ నేర్పానని విర్రవీగినా
నిజానికి నేర్చుకున్నది నేనే

రెక్కలొచ్చి ఎగిరినప్పుడు
మీ విశాల ఆకాశాన్ని నేనవుతాను
అలసిన మీ కాలిచక్రాలకి కందెన నేను
గెలుపోటముల బతుకాటలో
నవ్వినపుడు
మీ కన్నుల్లో వెలిగే కాంతి నేను
దుఃఖాలని ఎవరాపగలరు కానీ
మీ కన్నీటి చుక్కలన్నిటినీ
కాచి వడబోసి ముత్యాలుగా మలిచి
నా మెడకున్న తాళ్లతో
హారాలు కడతాను

జీవితపు మలుపుల్లో
సందిగ్ధపు దారులలో
అయోమయంగానో అసమంజసంతోనో
మీరు నన్ను వెతుక్కున్న రోజు
ఆ విలువైన హారాలు మీకు కానుకిస్తాను

ఇక్కడున్నా లేకపోయినా
ఎప్పటికీ
వాటికి పడబోయే చిక్కుముడులన్నిటినీ
విప్పుతూనే ఉంటాను.

■ కవిత కుందుర్తి

గొప్ప జాతరలా ఆవిష్కరణ!


నా మొదటి పుస్తకం

ఆశారాజు



ఇంత వరకు నావి 23 కవిత్వ సంపుటాలు వచ్చాయి. నా మొదటి పుస్తకం 'నేపథ్యం' 1991లో వచ్చింది. నేను కవిత్వంలోకి ఆలస్యంగా వచ్చినా చాలా విరివిగా కవిత్వం రాశాను. కొన్నిసార్లు ఒకే రోజు ఐదారు పేపర్లలో కవితలు వచ్చేవి.

ద్వారకా మిత్రులు రోజూ కలుసుకొంటున్న క్రమంలో– శివారెడ్డి సార్, దేవిప్రియ సార్, "నీ పుస్తకం రావాలి రాజూ," అన్నారు. నాకు ప్రచురణ గురించి ఏమీ తెలియదు. వాసిరెడ్డి నవీన్‌తో మాట్లాడి నన్ను కవితలు ఫెయిర్ చేసి తెమ్మన్నారు. వాళ్లు వాటిని చదివి, ఆలోచించి 'నేపథ్యం' టైటిల్ ఖాయం చేశారు. నవీన్ ఒక నాలుగు రోజుల తర్వాత డిటిపి పేపర్లు తెచ్చి నన్ను ప్రూఫ్‌లు చూడమన్నారు.



ముందుమాట కోసం శివారెడ్డి చాలా టైం తీసుకొని రాశారు. ఒకరోజు కవర్ పేజీ గురించి శీలా వీర్రాజు గారికి స్క్రిప్ట్ ఇచ్చి వచ్చాం. మరునాటి నుండి హైదరాబాద్‌లో మూడు రోజులు కర్ఫ్యూ. ఆ సమయంలో కవర్ పేజీ పూర్తయింది. కవర్ పేజీ బొమ్మను చూసి నేను థ్రిల్ అయ్యాను. వీర్రాజుగారు నన్ను కాచిగూడాకో మరెక్కడికో బ్లాకులు చేయించడానికి తీసుకెళ్లారు. బ్లాకులు వచ్చాక వాటిని నవీన్ గారికి అందజేశాను. అంతా నవీన్ గారే చూసుకొన్నారు. పుస్తకాన్ని చూడగానే నా కళ్లల్లో ఆనందం తడిసింది.

ఆవిష్కరణ 1991 మార్చి 12న హైదరాబాద్ సిటీ సెంట్రల్ లైబ్రరీ, చిక్కడపల్లిలో జరిగింది. సినారె ముఖ్య అతిథి, ఆవిష్కర్త. దేవిప్రియ అధ్యక్షులు. కవిత్వం గురించి మాట్లాడే వాళ్లు, పాపినేని శివశంకర్, స్మైల్. ఆనాటి పద్ధతి ప్రకారం ముందుమాట రాసిన శివారెడ్డిని వేదిక మీదికి పిలవలేదు. ఝరీ పోయెట్రీ సర్కిల్ సంప్రదాయం ప్రకారం పూల దండలు లేవు, శాలువాలు లేవు. ఆవిష్కరణ సభ గొప్ప జాతరలా జరిగింది. హాలంతా కిటకిట లాడింది. అంత మంది వస్తారనుకోలేదు. ఆ రోజు 70–80 కాపీలు అమ్ముడుపోయాయి. అప్పట్లో అది పెద్ద విషయం.

సినారె అద్భుతంగా మాట్లాడారు. గారడీవిద్యలా కవిత్వాన్ని ప్రదర్శించారు. మాంత్రికుడిలా మాటలు అల్లి మెస్మరైజ్ చేశారు. పుస్తకం చేతిలో పట్టుకొని, "నేను ఒక పేజీ తెరుస్తాను. అందులో కవిత్వం లేకపోతే, స్టేజీ దిగిపోతాను", అని, సవాల్ విసిరినట్టు, ఉప్పొంగి ప్రసంగించారు. దేవిప్రియ సార్ సభను ముషాయిరాలా జరిపారు. ఆయన మాట్లాడుతూ, "వీర్రాజు గారు కవరు పేజీ ఇలా వేశారు కానీ, ఆశారాజు ఒక చేతికి పూలదండ చుట్టి, మరొక చేతిలో సైకిల్ చైన్ పెట్టి, చార్మినార్ ముందు నిలుచున్నట్టు ఉంటే బాగుండేది", అని మురిసిపోయారు. ఒక నాటకంలా సభ ముగిసింది. సభ ముగిసిన తర్వాత చేరా, శివారెడ్డి, దేవిప్రియ, స్మైల్, జగన్నాథ శర్మ, పాపినేని గారి హోటల్‌కు, నాంపల్లి వెళ్లాం. అక్కడ రాత్రంతా కవిత్వం నిషాలో మైమరిచారు. ఒక లారీ నిండా ఫుడ్ వదిలేశారు. జగన్నాథ శర్మ జంధ్యం డాన్స్ చేసి రాత్రిని ఊపేశాడు. చేరా ఒలికి పోకుండా మునిలా నవ్వుతూ కూర్చున్నారు. అలా దృశ్యాలు దృశ్యాలుగా సభానంతర సభలో తెల్లవారింది.

asharaju.poet@gmail.com

రాసేటప్పుడు ఆ కథ పట్ల ఎంతో నిజాయితీ ఉంటే తప్ప రాయలేను

చదువు ముచ్చట

వి మల్లికార్జున్



రీసెంట్‌గా ఏ పుస్తకాన్ని చదివి ఇష్టపడ్డారు?

ఈ మధ్యనే జి. కళ్యాణరావు రాసిన 'అంటరాని వసంతం' నవల చదివాను. నన్ను జ్వరం పట్టుకున్నట్టు పట్టుకుందా పుస్తకం. దాదాపు వందేళ్ళపాటు సాగే ఏడు-ఎనిమిది తరాల జీవితాన్ని ఒడుపుగా అల్లిన విధానం నాకు బాగా నచ్చింది. నేనింకా ఎన్నెలదిన్ని దాటి రానే లేదు.

మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదివారు?

నేను టీనేజీలో ఉన్నప్పుడు ఎక్కడో విని మా ఊరి లైబ్రరీలో ఉన్న చలం 'మైదానం' నవల చదివాను. నా మీద చెరగని ముద్ర వేసిన పుస్తకం అది. ఒకసారి చదివిన వెంటనే ఆ చివరి పేజీని అర్థం చేసుకోవడానికి మళ్ళీ వెంటనే పుస్తకమంతా చదివా. ఇప్పటికి చాలాసార్లు చదివా. ప్రతిసారీ అందులో కొత్త విషయమేదో దొరుకుతూ ఉంటుంది.

ఒకప్పటికీ ఇప్పటికీ మీ పుస్తకాల ఎంపిక, చదివే పద్ధతి ఎలా మారింది?

చిన్నప్పట్నుంచీ నాకు పుస్తకాలంటే ఇష్టమున్నా, నాకు తెలిసినవాళ్ళెవ్వరికీ పుస్తకాలు చదివే అలవాటు లేకపోవడంతో, మొదట్లో ఏది దొరికితే అది చదివేవాడ్ని. ఆ తర్వాత క్లాసిక్స్ అని విన్నవి చదివేవాడ్ని. కొన్నాళ్ళకు నేనేం ఇష్టపడుతున్నానో ఆలోచించి అర్థం చేసుకొని ఇవి నాకు నచ్చొచ్చు అని వెతుక్కొని చదువుతున్నా. ఈ ప్రయాణం గమ్మత్తుగా ఉంటుంది. ఒక్కోసారి పుస్తకం టైటిల్ చూసి చదువుతా. ఒక్కోసారి రచయిత గురించి తెలుసుకొని చదువుతా. ఏ రచయిత పుస్తకమైనా విపరీతంగా ప్రభావితం చేస్తే వాళ్ళ పుస్తకాలన్నీ చదివే ప్రయత్నం చేస్తా (బిభూతిభూషణ్ బంద్యోపాధ్యాయ, ఆల్బర్ట్ కామూ, ఫ్రాంజ్ కాఫ్కాలను అలాగే చదివా). ట్విటర్, రెడిట్ డిస్కషన్స్‌లో నాకు ఏ పుస్తకమైనా ఆసక్తి కలిగిస్తే చదువుతా. కంటెంపరరీ కూడా ఎక్కువే చదువుతా. ఇంత చదివినా ఎంత చదవకుండా ఉండిపోతున్నానో కదా అనిపిస్తుంది ఒక్కోసారి.

ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?

దోస్తొయెవ్‌స్కీని కలవగలిగితే బాగుంటుందని ఎప్పుడూ అనుకుంటాను. ఆయన పుస్తకాల గురించి కంటే హ్యూమన్ సఫరింగ్ గురించి మాట్లాడవచ్చనుకుంటాను.

సాహిత్యంలో మీకు ఆల్టర్ ఈగోలా అనిపించిన పాత్ర ఏది?

ఆల్బర్ట్ కామూ 'ది స్ట్రేంజర్' నవలలోని మెర్సాల్ట్ పాత్ర నా ఆల్టర్ ఈగో అనిపిస్తుంది. మేమిద్దరమూ ఒకే కాలంలో ఒకే ప్రాంతంలో ఒకే పరిస్థితులు ఎదురయ్యే అవకాశం గల ఇద్దరు మనుషులమేమో అనుకుంటాను. ఆ అబ్సర్డ్ పరిస్థితులకు ఇద్దరమూ లొంగిపోయేవాళ్ళమే అయినా అందుకు మేము ఎంచుకునే మార్గాలు భిన్నంగా ఉంటాయనిపిస్తుంది.

రచన విషయంలో మీకు ఉపయోగపడిన సలహా ఏదైనా?

రాయడనమనేది నాకు చాలా పర్సనల్. అంతే ప్రైవేట్ కూడా. ఇన్నేళ్ళలో ఏ పుస్తకమైనా రచయితైనా మనుషులైనా నన్ను ప్రభావితం చేసి ఉంటే అది నాలో భాగమై ఉండొచ్చేమో ఇప్పటికే. అలా కాకుండా ఏదైనా కచ్చితంగా చెప్పగలిగే ఒక సలహాను నేను రాయడానికో రాస్తూ ఉండటానికో ఎవరినుంచైనా తీసుకొని పాటిస్తున్నానా అంటే చెప్పలేను. ఒకటైతే నా అంతట నేను పాటించేది ఎప్పటికీ పోగొట్టుకోవద్దు అనుకుంటాను – అది నిజాయితీ. రాసేటప్పుడు ఆ కథ పట్ల ఎంతో నిజాయితీ ఉంటే తప్ప నేనది రాయలేను.

(వి. మల్లికార్జున్ కథా రచయిత. ఇప్పటిదాకా నాలుగు కథల పుస్తకాలు ప్రచురించారు. అవి: 'ఇరానీ కేఫ్' (2018), 'కాగితం పడవలు' (2019), 'నల్లగొండ కథలు' (2020), 'నానిగాడు' (2022))


✆ 70752 75454

నిజాంపై అజ్ఞానపు రాతలు



దాశరథి శత జయంతి ఉత్సవాల మీద జూలై 14 నాటి వివిధ లో టి. ఉడయవర్లు రాసిన వ్యాసంలో నాటి దక్కను రాజ్య అధినేత నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌పై అజ్ఞానంతో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆయన దక్కను వాస్తవ చరిత్రపై దశాబ్దాలుగా ప్రచారంలో ఉన్న అవాస్తవాలనే తిరగరాశారు. వందేళ్ళ కిందనే ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖను స్థాపించి, ఆంధ్రా ప్రాంతం నుంచి డా. రాయప్రోలు సుబ్బారావును ఆహ్వానించి శాఖాధిపతిగా నియమించిన ఘనత నిజాంది. అలాంటి వ్యక్తి గురించి "తెలుగు మాట వినిపిస్తేనే వొంటిపై తేళ్లు పాకినట్లుగా వ్యవహరించినాడు" అని రాయడం తీవ్ర అభ్యంతరకరం. తెలుగు భాష కోసం హైదరాబాద్ తెలుగు అకాడెమీ (ఆ తర్వాత తెలుగు అకాడెమీగా మారింది) ని స్థాపించి, నిధులు ఇచ్చి, తెలుగు భాషను ప్రోత్సహించిన వ్యక్తి నిజాం. నిజాం ప్రభుత్వం తెలుగు భాషకు చేసిన సేవను సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి వాళ్ళు మెచ్చుకున్నారు. మహాకవి శ్రీశ్రీ మొదలుకొని నిజాం ప్రభుత్వంలో ఎంతోమంది తెలుగు వాళ్ళు ఉద్యోగం చేసారు. కురుగంటి సీతారామయ్య పంతులు లాంటి వారు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్‌ను శ్రీరాముడి అవతారం అని తెలుగులో రచనకూడా చేసాడు. మాడపాటి లాంటి వాళ్ళు కూడా ఏనాడూ నిజాం తెలుగును అణచి వేశాడు అననే లేదు కదా! దాశరథి గొప్పతనాన్ని చెప్పాలంటే నిజాంను దూషించాలి అన్న అపరిపక్వత వ్యాసంలో రావడం దురదృష్టకరం.

■ రామ్, అజయ్, హైదరాబాద్ డెక్కన్ రీసెర్చెర్స్ గ్రూప్




1.
అనివార్యమయ్యే మరణాలు
ఛిద్రమయ్యే దేహాల మధ్య
మనిషి ఉనికిని
ఇంకా వెతుకుతూనే ఉంటావు



2.
ఎన్నో విరక్తుల మధ్య
ఎంతోకొంత బ్రతుకును
మిగుల్చుకుంటూనే ఉంటావు!
బ్రతుకు ఉన్నంత వరకు
చుట్టూ ప్రపంచం మాయమవ్వదు!



3.
ఏదో ఒక రోజు
మనుషులందరూ మన్నించి శాంతిస్తారు!
మిగిలిపోయిన భయాలు, సందేహాలు
దేహం చుట్టూ గోడలు కట్టేస్తూంటాయి!




4.
ఎప్పటికప్పుడు
ప్రేమాప్యాయతలు పెట్టే గాట్లు
అర్థం లేకపోయినా
అనుసరించాల్సిన శాంతి మంత్రాలు
ఉద్దేశాలకు అవతల వినిపించే పదాలు
బరువుగా తోచే అస్తిత్వాలు!



5.
తొలగించివేసిన అనవసరాలేవో
ఇంకా అంటిపెట్టుకున్న మమకారాలేవో
నిర్ధారణ లేని విషయాల మధ్య
విముక్తమయ్యే హృదయాలు ఏవని
వెతికి ఆరా తీస్తూంటావు!

■ రాళ్ళబండి శశిశ్రీ
✆ 74163 99396







వారధి వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్



భయపెడుతున్న గోతులు

నగరంలో నీటి సరఫరాపై మోదీ ఫిదా!

మన్‌కీ బాత్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించిన ప్రధాని

- బెజవాడలో 16 లక్షల మందికి మెరుగైన తాగునీటి వ్యవస్థ
- ఆధునిక వ్యవస్థతో నూరుశాతం రక్షిత నీటి సరఫరా
- 30 శాతం జనాభా ఉంటున్న కొండ ప్రాంతాలకు కూడా బూస్టర్స్ ద్వారా తాగునీరు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కార్పొరేషన్): బెజవాడ నగరంలో మంచినీటి నిర్వహణ తీరు దేశ ప్రధాని మోదీ మనస్సు గెలుచుకుంది. ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడిన మోదీ విజయవాడలో నీటి నిర్వహణ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించటం నగరానికి గర్వకారణంగా నిలిచింది. 16 లక్షల మంది జనాభా కలిగిన నగరానికి మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు సురక్షితమైన మంచినీటిని అందిస్తున్నారు. నీరు వృథా కాకుండా సమర్థవంతమైన 'స్కాడా' వంటి అత్యాధునిక సాంకేతిక విధానాన్ని కూడా కార్పొరేషన్ అనుసరిస్తోంది. వాటర్ ఆడిటింగ్ జరపుతూ ముఖ్య నిర్ణయాలను తీసుకుంటున్నారు. నాణ్యమైన నీటి కోసం అధునాతన ల్యాబ్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నారు. నాణ్యతతో కూడిన నీటిని ప్రతిరోజూ అందిస్తున్నారు.

1.23 లక్షల మంచినీటి కనెక్షన్లు

నగర వ్యాప్తంగా 1.23 లక్షల మంచినీటి కనెక్షన్లు ఉన్నాయి. నగర ప్రజల మంచినీటి డిమాండ్‌కు అనుగుణంగా కార్పొరేషన్ సరఫరా చేయగలుగుతోంది. ప్రజలకు సరిపడా మంచినీటిని అందించటాని ఏకైక నీటి వనరు కృష్ణానది. భవానీపురంలో కృష్ణానది ఒడ్డున కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ ఉంది. ఈ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి రోజుకు 37.50 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) నీటిని నగర ప్రజలకు అందిస్తోంది. కృష్ణానీటిని ఇక్కడి నుంచి మిగతా 6లో..

కొండ ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా..

నగరంలో 30శాతం మంది ప్రజలు కొండ ప్రాంతాలపైనే నివసిస్తున్నారు. కొండ ప్రాంతాలకు మంచినీటిని అందించటం అన్నది పెద్ద సవాల్‌తో కూడుకున్న పని. అయినప్పటికీ కార్పొరేషన్ నిరంతరాయంగా మంచినీటిని సరఫరా చేయగలుగుతోంది. వందల సంఖ్యలో కొండ ప్రాంతాలకు బూస్టర్లను ఏర్పాటు చేసి సునాయాసంగా కొండ ప్రాంతాలలోని ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేస్తోంది.



అడుగడుగునా ప్యాచ్‌లు



రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

ప్రయాణం.. ప్రమాదం

గుంతలమయంగా కనకదుర్గ వారధి

బయటకు చొచ్చుకువచ్చిన ఇనుప చువ్వలు

నిదానంగా వాహనాలు.. నిలిచిపోతున్న ట్రాఫిక్

విజయవాడ-గుంటూరు మార్గంలోని కనకదుర్గ వారధిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై గోతులు పడి, కాంక్రీట్ లేచి లోపల ఉన్న ఐరన్ కడ్డీలు బయటకు చొచ్చుకు వచ్చాయి. ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురికావాల్సిందేనన్నట్టు ఉన్నాయి. దీంతో వాహనదారులు నిదానంగా వెళ్లడంతో ట్రాఫిక్ స్తంభించి అర్ధగంట నుంచి గంటకుపైగా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వారధిపై గుంతలు పూడ్చాల్సిన అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-(ఆంధ్రజ్యోతి, విజయవాడ)





బయటకు చొచ్చుకొచ్చిన ఇనుప చువ్వలు



నాడు టీడీపీ ప్రభుత్వంలో ముక్త్యాల ఎత్తిపోతలకు శంకుస్థాపన కార్యక్రమంలో శ్రీరామ్ తాతయ్య, నెట్టెం రఘురాం



ముక్త్యాల లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేయటంతో నియోజకవర్గంలోని నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. రాష్ట్ర విభజన తర్వాత సాగర్ ఆయకట్టు నానాటికీ తీసికట్టు అన్న చందాన మారిపోయింది. తెలంగాణ ప్రాంతం నుంచి ఎప్పుడు సాగునీరు విడుదల అవుతుందా అని ఎదురు చూపులతోనే కాలం గడిచిపోతోంది. ఇటువంటి పరిస్థితుల్లో నిధులు కేటాయించి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచింది.

ముక్త్యాలకు పునరుజ్జీవం

ఎత్తిపోతల పథకానికి రూ.489.28 కోట్లు విడుదల

- రైతుల సాగునీటి ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ఇక 38,627 ఎకరాల సాగర్ ఆయకట్టు కృష్ణాజలాలతో సస్యశ్యామలం
- రైతాంగంలో ఆనందోత్సాహాలు

(ఆంధ్రజ్యోతి, జగ్గయ్యపేట): ముక్త్యాల నుంచి కృష్ణాజలాలను ఎత్తి సాగర్ కాల్వలకు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ముక్త్యాల ఎత్తిపోతలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పనులు 2019లో వర్చువల్‌గా చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముక్త్యాల ఎత్తిపోతల పేరును వేదాద్రి ఎత్తిపోతలుగా పేరు మార్చి నాటి సీఎం జగన్ తన పెళ్లిరోజున వర్చువల్‌గా మళ్లీ శంకుస్థాపన చేశారు. పనులు మాత్రం ముందుకు సాగలేదు. వేదాద్రి దగ్గర పనులు ప్రారంభించిన నిర్మాణ సంస్థ తర్వాత నిధులు విడుదల కాకపోవటంతో యంత్రాలు, మెటీరియల్‌ను తీసుకెళ్లిపోయింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి ఈ ముక్త్యాల ఎత్తిపోతల పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని ఎన్నికల హామీగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ప్రకటించారు. ఆ తర్వాత పలుమార్లు ఎంపీ కేశినేని, శ్రీరాం తాతయ్య, కేడీసీసీ బ్యాంకు ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఆప్కాబ్ మాజీ ఛైర్మన్ టీడీ జనార్ధన్‌లు మిగతా 6లో..

నగరంలో లులూకు భూ కేటాయింపు

పాతబస్టాండ్ ఆర్టీసీ స్థలం 4.15 ఎకరాలపై జీవో జారీ

- జీ ప్లస్ 3 విధానంలో ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్
- రూ. 156 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 'లులు'
- ఏర్పాటుకానున్న మొత్తం 120 రిటైల్ షాపులు
- బయటి వారి కోసం 1.34 లక్షల చదరపు అడుగుల స్థలం లీజుకు
- 200 వాహనాల సామర్థ్యంతో కూడిన పార్కింగ్ ఏరియా
- మల్లవల్లి మెగా ఫుడ్‌పార్క్ సీపీసీ నిర్వహణ చేపట్టనున్న 'లులు'



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): నగరంలోని పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని 'లులు' మాల్ కోసం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. మొత్తం 4.15 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఆర్టీసీ స్థలాన్ని లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎల్ఐఎస్ఎం) గ్రూపునకు 65 సంవత్సరాల సుదీర్ఘ కాలానికి లీజుకు ఇస్తూ భూ కేటాయింపులు జరిపింది. ఆ తర్వాత మరో 33 సంవత్సరాలు పొడిగిస్తారు. మూడేళ్ల పాటు అద్దె వెసులుబాటును కల్పించింది. నిర్మాణం పూర్తి చేయటానికి నిర్దేశించిన కాలానికి ఈ మేరకు అద్దెను మినహాయించింది. పాత బస్టాండ్ ఆర్టీసీ స్థలంలో 2.32 లక్షల చదరపు అడుగుల స్థలంలో జీ ప్లస్ 3 విధానంలో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్‌ను 'లులు' నిర్మించనుంది. ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ నిర్మాణం కోసం 'లులు' రూ. 156 కోట్లను ఖర్చు చేయబోతోంది. ఈ మాల్‌లో 'లులు' మొత్తం 120 రిటైల్ షాపులను ఏర్పాటు చేస్తుంది. బయటి వారికి ఈ మాల్‌లో 1.34 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు ఇస్తుంది. మొత్తం 200 వాహనాల పార్కింగ్ ఏరియాను మిగతా 6లో..

ఆర్టీసీ నుంచి స్థలం స్వాధీనంపై కలెక్టర్‌కు ఆదేశం

ఆర్టీసీకి చెందిన 4.15 ఎకరాల పాతబస్టాండ్ స్థలాన్ని త్వరగా స్వాధీనంలోకి తీసుకుని పర్యాటక శాఖకు అప్పగించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జీ.లక్ష్మీశకు నిర్దేశించింది. ఆర్టీసీ ప్రతిపాదనల మేరకు వారి అవసరాలకు తగినట్టు ప్రత్యామ్నాయ స్థలాలను కూడా త్వరగా చూసి తక్షణం ఆర్టీసీకి బదలాయింపు చేయాలని స్పష్టం చేసింది.

ఆందోళనల నడుమ భూ కేటాయింపులు

నగరంలో పాతబస్టాండ్ ఆర్టీసీ స్థలాన్ని 'లులు'కు ఇవ్వాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్న ఆందోళనలు పెద్ద ఎత్తున జరిగాయి. గతంలో పాతబస్టాండ్ స్థలాన్ని ఆనుకుని ఉన్న ప్రస్తుత పార్కు స్థలాన్ని అంబికా ఇతర సంస్థలకు అప్పగించినపుడు కూడా ఆందోళనలు పెద్ద ఎత్తున చేశారు. అప్పట్లో ఆర్టీసీ అధికారులు బీవోటీ కింద అప్పగించారు. అవి విఫల ప్రాజెక్టులుగా నిలవటం వల్ల వాటి భూ కేటాయింపులను రద్దు చేశారు. ఆ తర్వాత ఆ స్థలంలో పార్కును ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సారి పార్కు స్థలంతో పాటు ఆర్టీసీ గవర్నర్‌పేట-2 డిపో స్థలాన్ని కూడా అప్పగిస్తుండటంతో ఆందోళనలు మరింత తీవ్రస్థాయిలో జరిగే అవకాశం కూడా లేకపోలేదు.

రంగంలోకి దిగాలని ఏపీఐఐసీకి ఆదేశాలు

టూరిజం పాలసీలో భాగంగా స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) తీసుకున్న నిర్ణయం మేరకు 'లులు' సంస్థకు కేటాయించిన భూములలో తక్షణం ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్ కోసం చర్యలు చేపట్టాల్సిందిగా ఏపీఐఐసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. నిర్ణీత క్రమంలో పనులు జరిగేలా పర్యవేక్షించాలని నిర్దేశించింది.

మంత్రిగారూ ఆదుకోరూ..

- నేడు నందిగామలో పయ్యావుల పర్యటన
- వేదాద్రి, కంచల ఎత్తిపోతల మరమ్మతులు జరిగేనా?
- నిధుల విడుదలపై అన్నదాతల ఎదురుచూపు

6



జలపాతం

ఇటీవల కురిసిన వర్షాలకు కొండపల్లి రిజర్వు ఫారెస్టు లోని జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. ఆదివారం ట్రెక్కింగ్‌కు వచ్చిన నగర వాసులు జలపాతాల వద్ద స్నానాలు చేస్తూ సందడి చేశారు.

- ఆంధ్రజ్యోతి-ఇబ్రహీంపట్నం

రూ.150 కోట్ల విలువైన స్థలానికి ఎసరు!

ఎగ్జిబిషన్ కోసం 'లిడ్‌క్యాప్' నుంచి లీజుకు తీసుకున్న వైఎస్ ట్రేడర్స్

- గత వైసీపీ ప్రభుత్వ పెద్దల అండదండలతో లీజు పొడిగింపు
- కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగింపునకు ప్రతిపాదన
- తిరస్కరించిన లిడ్‌క్యాప్ అధికారులు, పాలకవర్గం
- కోర్టు కేసులతో లిడ్‌క్యాప్‌కు ఇబ్బందులు సృష్టిస్తున్న వైఎస్ ట్రేడర్స్
- సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లిన ఉన్నతాధికారులు



ఒక కోటి కాదు.. రెండు కోట్లు కాదు.. ఏకంగా రూ.150 కోట్ల విలువైన లిడ్‌క్యాప్ స్థలానికి ఎసరు పెట్టింది వైఎస్ ట్రేడర్స్ అనే సంస్థ. గత వైసీపీ ప్రభుత్వంలో ఎగ్జిబిషన్ నిర్వహణ కోసమని లీజుకు తీసుకున్న సంస్థ ఆ తర్వాత ప్రభుత్వంలోని పెద్దల అండదండలతో లీజులను పొడిగిస్తూ వచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా పొడిగించేందుకు ప్రయత్నించింది. లిడ్‌క్యాప్ అధికారులు, పాలకవర్గం ఒప్పుకోకపోవడంతో అనేక కారణాలు చూపుతూ కోర్టుకు లాగింది. విసిగిపోయిన అధికారులు ఈ విషయం సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ నగరంలోని ఆటోనగర్ గేటు దగ్గర తూర్పున 100 అడుగుల రోడ్డు, దక్షిణం బందరు రోడ్డు (ఎన్‌హెచ్ - 65), పడమర కార్పొరేషన్ రోడ్లను కలిగిన అత్యంత ఖరీదైన స్థలంలో చర్మకారులకు శిక్షణ, ఉపాధిని కల్పించేందుకు లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (లిడ్ క్యాప్)కు సంబంధించి మోడల్ లెదర్ గూడ్స్ మాన్యుఫాక్చరింగ్ (ఎంజీఎల్ఎం) యూనిట్ ఉంది. ఈ యూనిట్‌లో గతంలో చర్మకారులు చెప్పులు, బూట్లు, బ్యాగులు వంటి లెదర్ ఉత్పత్తులు తయారు చేసేవారు. కాలక్రమంలో మూతపడింది. దీనిని పునరుద్ధరించాల్సిన మిగతా 6లో..

అమ్మ పేరుతో ఒక మొక్క

» మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం
» హరిత శోభకు విద్యార్థులకు గ్రీన్ పాస్‌పోర్టులు
» ఇప్పటివరకు 1.61 లక్షల మంది రిజిస్ట్రేషన్


మొక్క నాటుతున్న కలెక్టర్ లక్ష్మీశ (ఫైల్)

(ఇబ్రహీంపట్నం, ఆంధ్రజ్యోతి)
మొక్కలు మానవాళిని ఎలా కాపాడుతాయో తెలుసుకునేలా చేయడంతో పాటు వారిని పర్యావరణంలో భాగస్వాములను చేసేందుకు చేపట్టిన బృహత్తర కార్యక్రమం గ్రీన్ పాస్‌పోర్టు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను దీనిలో భాగస్వాములు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ కార్యక్రమం మెగా పీటీఎం 2.0తో పురుడుపోసుకుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఈ పథకం కింద 1.61 లక్షల మంది పేర్లను నమోదు చేసుకున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ముఖ్య



ఉద్దేశం పర్యావరణ పరిరక్షణ అని, పిల్లలకు మొక్కల పెంపకం పట్ల అవగాహన పెంచడం.. తద్వారా హరితశోభను తీసుకురావడమే ముఖ్య లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.

● పర్యావరణ పరిరక్షణకు హరిత విస్తీర్ణం పెంచాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. దీనిలో విద్యార్థులను భాగస్వాములను చేయాల్సిన అవసరం ఉంది. చిన్ననాటి నుంచే పర్యావరణంపై పూర్తి అవగాహన కల్పించేందుకు గ్రీన్ పాస్‌పోర్టులు ఎంతో దోహదం చేస్తాయి. దీనిలో భాగంగా ఒక్కొక్క విద్యార్థి అమ్మ పేరున ఇంటి ఆవరణ, పొలాలు, పంట చెరువులు, ఇతర ప్రాంతాల్లో ఒక మొక్క నాటాలి. విద్యార్థి అలా నాటిన మొక్క ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా విద్యార్థికి పాయింట్స్ లభిస్తుంటాయి. విద్యార్థి నాటిన మొక్క పేరు దాని శాస్త్రీయ నామం, విద్యార్థి ఫొటోతో పూర్తి వివరాలు నమోదు చేస్తారు. మొక్కను ఆన్‌లైన్‌లో మానిటరింగ్ సైతం చేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో 4వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థుల వరకు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. వారందరికీ గ్రీన్ పాస్‌పోర్టులను ఆయా పాఠశాలలకు పంపేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

గతానికి భిన్నంగా

గతంలో వన మహోత్సవం పేరుతో పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల వద్ద పిల్లలకు మొక్కలు పంపిణీ చేశారు. అయితే వాటిపై పూర్తిగా పర్యవేక్షణ ఉండేది కాదు. అవి పెరిగితే పెరిగేవి లేకపోతే జీవాలు తినేయడం.. ఎండా కాలం వస్తే చనిపోయేవి. అయితే ఇప్పుడు అలా కాకుండా పెట్టిన మొక్క పూర్తిగా జీవించేలా మంచి ఫలాలు, నీడను ఇచ్చేలా ఉంచేందుకు ప్రభుత్వం మొక్కలను ఆన్‌లైన్ ద్వారా మానిటరింగ్ చేస్తుంది. ఈ పద్ధతి మంచి ఫలితాలను ఇస్తుందని అందరూ భావిస్తున్నారు.


కొండపల్లి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినికి మొక్కను అందజేస్తున్న విద్యాశాఖాధికారి వీరాస్వామి


లండన్ మ్యూజియంలో శిల్పసంపదను తిలకిస్తున్న సీఎం చంద్రబాబు(ఫైల్)

విదేశాల్లోని శిల్ప సంపదను రాజధానికి తెప్పించాలి

» కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు లేఖ
» రాష్ట్ర పర్యాటక సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

విజయవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : దేశవిదేశాల్లో ఉన్న అమరావతి అపురూప శిల్ప సంపద తిరిగి రాజధానికి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకుందని పర్యాటక సాంస్కృతికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఈమేరకు కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ కార్యదర్శికి ఆదివారం రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. లండన్ మ్యూజియం, చెన్నై, ఢిల్లీ, కలకత్తా, హైదరాబద్ నుంచి రాష్ట్ర సంపదను తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అమరావతి కీర్తి ప్రపంచ దేశాలకు వ్యాపించడం గర్వించదగ్గ విషయమే అయినా, నవ్యాంధ్ర నిర్మాణం తర్వాత అంతటి గొప్ప సంపద రాష్ట్రంలో లేకపోవడం భావితరాలకు లోటని అన్నారు. దీని కోసం అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్, అఖిల భారత పంచాయితీ పరిషత్(ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు ఎప్పటినుంచో కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. పది సంవత్సరాల జాప్తి ప్రయత్నాలకు తాజాగా ప్రభుత్వం సహకారం కూడా తోడైందని అజయ్‌జైన్ పేర్కొన్నారు. "మన సంపదపై హక్కు దక్కే అవకాశం కనిపిస్తోంది. చెన్నై ఎగ్మోర్ మ్యూజియంలోనే అతి ముఖ్యమైన 500 శిల్పాలున్నాయి. కలకత్తా ఇండియన్ మ్యూజియం, ఢిల్లీ నేషనల్ మ్యూజియంలలో కూడా ఎంతో విలువైన అమరావతి ప్రాచీన శిల్పసందన ఉంది" అని ఆయన పేర్కొన్నారు. 1880కు ముందే బ్రిటీష్ వారు అమరావతి నుంచి మద్రాసుకు విలువైన శిల్పాలను తరలించుకుపోయారని అజయ్‌జైన్ చెప్పారు. లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంలో అమరావతి గ్యాలరీ నెంబర్ 33లో సుమారు 133 అతి ప్రాచీనమైన కళాఖండాలు ఉన్నాయన్నారు. వాటిని తెప్పించి 'మన సంపద మన అమరావతి రాజధాని'లో ఒక అంతర్జాతీయ మ్యూజియం ఏర్పాటుచేసి అందులో ప్రదర్శనగా ఉంచితే భావితరాలు చూసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

బుద్ధుడి తలను తొలగించడం దుర్మార్గం

» ఆగస్టు 9న చలో మదనపల్లెకు ప్రజాసంఘాల పిలుపు

గాంధీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు జిల్లా మదనపల్లె మండలంలో బుద్ధుడి విగ్రహ తలను తొలగించిన సంఘటనను ప్రజాసంఘాలు ఖండించాయి. తన సొంతజిల్లాలో జరిగిన ఈ సంఘటనపై సీఎం చంద్రబాబు ఇప్పటికీ స్పందించకపోవడాన్ని తప్పుబట్టాయి. ఆగస్టు 9న చలో మదనపల్లె పేరుతో 'ధమ్మ ర్యాలీ'తో బౌద్ధుల సత్తా చూపిస్తామని ప్రజాసంఘాల నేతలు హెచ్చరించారు. భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ప్రజాసంఘాల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బౌద్ధ దేశాల సాయం కావాలి.. బౌద్ధుడి రక్షణ పట్టదా? అని ప్రశ్నించారు. జరిగిన సంఘటనకు నిరసన తెలిపిన బౌద్ధ అభిమానులపై తప్పుడు కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుద్ధుడి కొండపై బుద్ధుడి విగ్రహానికి కంచె ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. ఇది బౌద్ధుల ఆత్మగౌరవంపై దాడిగా అభివర్ణించారు.

అర్హులందరికీ పక్కా గృహాలు

» మంత్రి పార్థసారథి

విస్సన్నపేట : రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ త్వరలో పక్కా గృహాలు మంజూరు చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆదివారం కొండపర్వలో ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కోర్టు పరిధిలో ఉన్న చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టును క్లియరెన్స్ రాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. పిట్టలవారిగూడెం ఎత్తిపోతల పథకం విషయం కూడా ఆలోచిస్తామన్నారు. కొండపర్వలో రహదారులు నిర్మించాలని సామాజిక కార్యకర్త శివ సత్యనారాయణ మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, మట్టా వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్మోతో మరింత మెరుగైన వైద్యం

విజయవాడ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వెంటిలేటర్‌కు కూడా సహకరించని సమయంలో ఎక్మో(ఎక్స్‌ట్రా కార్పొరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్)తో వైద్యం చేసి ప్రాణాలు కాపాడే అవకాశం ఉందని ఐఎంఏ విజయవాడ అధ్యక్షుడు డాక్టర్ హనుమయ్య బోడేపూడి తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో మణిపాల్ ఆసుపత్రి అధ్వర్యంలో ఆదివారం "మాస్టరింగ్ ఎక్మో- ప్రముఖ నిపుణుల అనుభవాలను పంచుకోవడం" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గుండె, ఊపిరితిత్తుల పనితీరు ఆగినప్పుడు వాటిని మెరుగుపరిచే క్రమంలో ఎక్మో వాటిస్థానంలో తాత్కాలికంగా పనిచేస్తుందని తెలిపారు. ఇలాంటి సమస్య వచ్చిన రోగులను బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌కు తీసుకెళ్లేవారని, ఇకపై ఆ అవసరం లేదని తెలిపారు. ఈ పరికరాన్ని మణిపాల్ ఆసుపత్రి విజయవాడ బ్రాంచ్‌కు తీసుకురావడం వల్ల మెరుగైన వైద్యం అందించడంతో పాటు, వీలైనంత తొందరగా వైద్యం అందించడానికి అవకాశం ఉందన్నారు. అనంతరం మణిపాల్ ఆసుపత్రి అడ్వాన్స్ క్రిటికల్‌కేర్ వైద్యుడు గుత్తా లోకేష్ మాట్లాడుతూ, సాధారణంగా తిరుగాడుతున్న వ్యక్తి ఒక్కసారిగా గుండె, ఊపిరితిత్తులు పనిచేయక ఒక్కసారిగా పడిపోయిన సమయంలో ఎక్మోతో ప్రాణాలు కాపాడే అవకాశం ఉందన్నారు. ఇందులో ఆక్సిజనేటర్ ద్వారా ఊపిరితిత్తులకు, పంప్ ద్వారా ఊపిరితిత్తులకు వేరువేరుగా చికిత్స అందించవచ్చన్నారు. మంత్రి పార్థసారథి, పలువురు వైద్య నిపుణులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకం

మంత్రిగారూ ఆదుకోరూ..

» నేడు నందిగామలో పయ్యావుల పర్యటన
» వేదాద్రి, కంచల ఎత్తిపోతల మరమ్మతులు జరిగేనా?
» నిధుల విడుదలపై అన్నదాతల ఎదురుచూపు

నందిగామ, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేలాది ఎకరాలకు సాగునీరందించే వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. నిధులు ఇచ్చి అన్నదాతను ఆదుకోవాల్సిన బాధ్యత ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఉంది. మరమ్మతులకు రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించిన ఏపీఎస్ఐడీసీ అధికారులు ఫైలును ఆర్థిక శాఖకు పంపారు. ఈ క్రమంలో మంత్రి పయ్యావుల 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా సోమవారం నందిగామలో పర్యటించనున్నారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆసక్తి పెరిగింది. నిధులు విడుదల చేసి తమను ఆదుకుంటారని ఆశిస్తున్నారు. మంత్రి హోదాలో తొలి సారి నందిగామ వస్తున్న పయ్యావుల అన్నదాతలకు అండగా ఉండి ధైర్యం నింపుతారా.. లేక నిరాశ పరుస్తారా.. వేచి చూడాల్సి ఉంది.

నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాలకు చెందిన 17,500 ఎకరాల భూమికి సాగునీరందించే సంకల్పంతో గత తెలుగుదేశం ప్రభుత్వం వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాలను నిర్మించింది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో 23 వందల అశ్వసామర్థ్యం గల నాలుగు మోటార్లతో ఈపథకాన్ని నిర్మించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో ఈ తరహా పథకం లేదు. దీనికి ఏర్పాటు చేసిన మోటార్లు, పైప్‌లైన్లు, చివరకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా వైవిధ్య భరితమైన వే. ఇంతటి శక్తి వంతమైన పథకం తెలుగుదేశం పాలనలో సమర్థవంతంగా పనిచేసి 250 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా పొలాలకు అందించింది. సుమారు 125 మీటర్ల ఎత్తుకు నీటిని తోడి పోసి 430 మీటర్ల మేర పైప్‌లైన్ ద్వారా గ్రావిటీతో పంటలకు అందించిన ఈ పథకం నేడు మరమ్మతులకు గురై మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాటి నుంచీ పథకం మరమ్మతులు చేయిస్తారని అన్నదాతలు ఆశించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో గత ఏడాది పనులు చేపట్టలేదు. ఈఏడాది ఏప్రిల్ 5న పీ-4 కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ముప్పాళ్లకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు పథకం స్థితిగతులు, ఆయకట్టు రైతుల ఆవేదనను ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వివరించారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి పథకం మరమ్మతులకు రూ.15 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఎట్టకేలకు రూ.15కోట్లకు అంచనాలు రూపొందించిన ఐడీసీ అధికారులు ఫైలును ఆర్థిక శాఖకు పంపేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఖరీఫ్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఆర్థిక శాఖ త్వరితగతిన నిధులు కేటాయించి సహకరించాల్సి ఉంది. మరోవైపు రూ.21 కోట్ల మేర విద్యుత్ బకాయిలు పేరుకుపోయి ఉండటంతో సరఫరా నిలిపివేశారు. ఆ మొత్తాన్ని ఆర్థిక శాఖ భరించడమో.. లేక మాఫీ చేయడమో చేయాల్సి ఉంది. దీనికోసం ఆయకట్టు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ తరుణంలో స్వయంగా ఆర్థిక మంత్రి ఇక్కడకు రావడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

వేదాద్రి రైతులకు తీపికబురు వచ్చేనా..!

వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకాల భవిష్యత్తు ప్రస్తుతం ఆర్థిక మంత్రి పయ్యావులపై ఆధారపడి ఉంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా యాభైవేల మందికి ఆధారమైన ఈ పథకాలపై మంత్రి ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే. మంత్రి రైతులకు తీపికబురు చెబుతారా.. లేదా వేచి చూడాల్సిందే.

గులకరాయి నిందితుడి ఆచూకీ కోసం

నాలుగు బృందాల గాలింపు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : గులకరాయి [ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్] దాడి కేసు నిందితుడి అదృశ్యంపై నగర పోలీసులు స్పందించారు. నాలుగు బృందాలు అతడి కోసం గాలిస్తున్నట్టుగా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల సమయంలో జగన్మోహన్‌రెడ్డిపై రాయిదాడిలో నిందితుడిగా ఉన్న అజిత్‌సింగ్ నగర్ వడ్డెరకాలనీకి చెందిన వేముల సతీష్ ఈనెల 17 నుంచి కనిపించడం లేదు. సతీష్ అదృశ్యంపై 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. సతీష్ కొంత కాలంగా ఓ యువతితో ప్రేమలో ఉన్నాడని, సదరు విషయమై కుటుంబసభ్యులు ఇటీవల మందలించినట్టు తెలిసిందన్నారు. అదే యువతితో వెళ్లినట్టుగా సమాచారం ఉందని, ఈనెల 17న స్నేహితుడి వాహనంపై రైల్వేస్టేషన్‌లో దిగినట్టు సీసీ ఫుటేజీ ఆధారాలు లభించాయని అయితే అక్కడి నుంచి ఎటు వెళ్లాడనే విషయం తెలియాల్సి ఉందన్నారు. గుంటూరు, హైదరాబాద్, ఖమ్మం, విజయవాడల్లో నాలుగుబృందాలు గాలిస్తున్నాయని త్వరలోనే సతీష్ ఆచూకీ కనుగొంటామని పేర్కొన్నారు.


పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ నవీన్

ఈత పోటీల్లో పతకాలు

లబ్బీపేట(స్పోర్ట్స్), జూలై 27 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా జిల్లా మోడ్రన్ పెంటాథ్లాన్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన స్విమ్మింగ్ పోటీల్లో ఈడుపుగల్లు స్విమ్మింగ్‌పూల్ క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్ 13 బాలుర విభాగంలో రిత్విక్, అండర్ 11 బాలుర విభాగంలో జి.కృపా సాహిత్, విరాట్ కార్తికేయలు, బాలికల విభాగంలో ఎస్.నిహన్య, జి.సన్విత షారోన్‌లు పతకాలు సాధించారు. క్రీడాకారులను కోచ్ నవీన్ అభినందించారు. పతకాలు సాధించిన క్రీడాకారులు సెప్టెంబర్‌లో మహారాష్ట్రలో జరిగే నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని అయన తెలిపారు.


పుస్తకావిష్కరణలో జీవీ పూర్ణచంద్ తదితరులు

'సృష్టికర్త శతకం' పుస్తకావిష్కరణ

విజయవాడ కల్చరల్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మంగారి చరిత్ర వీటన్నింటి నుంచి తీసుకున్న 108 పద్యాలతో కవి 'సృష్టికర్త శతకం' రాశారు. దైవం, మతాల నిమిత్తం లేకుండా మనిషిని మానవుడిగా.. మహా మానసమూర్తిగా చేసేందుకు విశ్వకర్మ శతకాన్ని అందులోని లోతైన కవితాత్మను ఆస్వాదించవచ్చని సాహితీ విమర్శకులు గుమ్మా సాంబశివరావు అన్నారు. ఆదివారం సాయంత్రం రామ్మోహన్ గ్రంథాలయంలో రమ్య భారతి సాహిత్య వేదిక అధ్వర్యంలో జరిగిన తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు 'సృష్టికర్త శతకం' ఆవిష్కరణ సభ జరిగింది. శతాధిక గ్రంథకర్త డాక్టర్ జీవీ పూర్ణచంద్ అధ్యక్షతన జరిగిన సభలో గుమ్మా సాంబశివరావు పుస్తక సమీక్ష చేశారు. సరసభారతి అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ 'సృష్టికర్త శతకం' ఆవిష్కరణ చేయగా వేములపల్లి కేశవరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

రూ.150 కోట్ల విలువైన స్థలానికి..

(5వ పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వం ఎగ్జిబిషన్ కమ్ సేల్ కోసమని 'వైఎస్ ట్రేడర్స్' అనే సంస్థకు ముందుగా 10 రోజుల కాలానికి లీజుకు ఇచ్చింది. ఆ తర్వాత నెల, రెండు నెలలు, సంవత్సరం, రెండేళ్లు ఇలా అప్పట్లో గడువులు పొడిగిస్తూ ముందుకుపోయారు. ఈ సంస్థకు అప్పట్లో కేవలం అద్దెకు మాత్రమే ఇవ్వటం జరిగింది. ఎంతో దూరాలోచనతో ఉన్న ఆ సంస్థ లిడ్‌క్యాప్ స్థలంలో ఒక చిన్న షెడ్డు, ఇంటీరియర్ వంటి పనులు చేపట్టింది. వాస్తవానికి ఈ పనులు చేపట్టకూడదు. అప్పట్లో ప్రభుత్వ పెద్దలతో ఉన్న సంబంధాల కారణంగా వైఎస్ ట్రేడర్స్ అనే సంస్థ తమకు అనుగుణంగా మలచుకుంది. అగ్రిమెంట్‌లో ఎక్కడా నిర్మాణాలు కట్టమని లేకున్నా ఆ సంస్థ వాటిని చేపట్టడమే కాకుండా.. ఆ పేరుతో ఇప్పటికీ ఖాళీ చేయకుండా 'లిడ్ క్యాప్'లో తిష్టవేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ స్థలంలో 'లెదర్ పార్క్' కట్టేవరకు లీజుకు ఇవ్వాలంటూ అభ్యర్థన కూడా చేసుకుంది. అనూహ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో సంస్థ ఆశలు ఫలించలేదు.

ప్రభుత్వం మారాక.. లీజు పొడిగింపు ప్రయత్నాలు

గత ప్రభుత్వంలో కుదుర్చుకున్న లీజు గడువు కిందటి ఏడాది జూన్ నెలాఖరుతో ముగిసింది. లీజు కొనసాగింపునకు 'వైఎస్ ట్రేడర్స్' చేసిన ప్రయత్నం బెడిసి కొట్టింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఒప్పందాలను పరిశీలించిన మీదట ఎంజీఎల్ఎం షెడ్డు శిథిలావస్థలో ఉండటం, ఈ స్థలంలో ఎన్టీఆర్ లెదర్ పార్క్ నిర్మాణ ప్రతిపాదనలు ఉండటంతో లీజు కొనసాగింపునకు లిడ్‌క్యాప్ పాలకవర్గం, అధికారులు అంగీకరించలేదు.

పాతబకాయిలు చూపి కదలని సంస్థ

నిబంధనల ప్రకారం లిడ్‌క్యాప్ అధికారులు, పాలకవర్గం వైఎస్ ట్రేడర్స్‌కు ఖాళీ చేయాలని సదరు సంస్థకు నోటీసులు పంపింది. గత ప్రభుత్వ హయాంలో లెదర్ ఉత్పత్తుల సరఫరాకు సంబంధించి (ఇది వేరే కాంట్రాక్టు) బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి వచ్చే వరకు సమయం ఇవ్వాల్సిందిగా కోరటం జరిగింది. లిడ్ క్యాప్ పాలకవర్గం సోషల్ వెల్ఫేర్ నుంచి రావాల్సిన బకాయిలను మొత్తం మీద రప్పించింది. బకాయిలు చెల్లింపు చేయిస్తామని, ఖాళీ చేస్తున్నట్టు అగ్రిమెంట్ రాసి ఇవ్వమని 'వైఎస్ ట్రేడర్స్'ను కోరగా.. ఆ సంస్థ గొంతులో వెలక్కాయ పడింది.

పలు మార్లు కోర్టులను ఆశ్రయించి..

తనకు రావాల్సిన బకాయిలను కూడా లిడ్‌క్యాప్ చెల్లించేందుకు చర్యలు చేపట్టినా.. 'వైఎస్ ట్రేడర్స్' ఆలోచన వేరుగా ఉండటం వల్ల తనకు గడువు కావాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. ఈ కేసును ఉభయులు సంప్రదింపుల మార్గంలో పరిష్కరించుకోమని హైకోర్టు కొట్టి వేసింది. దీంతో రెండో సారి మళ్లీ కోర్టును ఆశ్రయించింది. ఈ దఫా కోర్టు స్వల్ప కాలానికి స్టే ఇస్తూ ఆ కాలానికి నెలకు రూ.75 వేల చొప్పున అద్దె చెల్లించమని ఆదేశించింది. వైఎస్ ట్రేడర్స్ అద్దె డబ్బులు చెల్లించింది. స్టే కాలం ముగిశాక.. కోర్టు ఆ కేసును కూడా డిస్మిస్ చేసింది.

యూనిట్ భవనం కూల్చేయమని నివేదిక

ఈ స్థలంలో లెదర్ భవన్ ఏర్పాటు ఆలోచనలో ఉన్న లిడ్‌క్యాప్ ప్రస్తుత భవన పటిష్టతకు సంబంధించి ఆర్ అండ్‌బీ శాఖను రిపోర్టు కోరగా.. ఆ శాఖ నిపుణుల బృందం పరిశీలించి కూల్చివేయాలని నివేదిక ఇచ్చింది. దీంతో లిడ్‌క్యాప్ అధికారులు ముందుగా ప్రహరీగోడను కొద్ది భాగం కూల్చారు.

ప్రహరీ కూల్చివేతపై కోర్టుకు..

ప్రహరీ కూల్చివేత నేపథ్యంలో వైఎస్ ట్రేడర్స్ సంస్థ తాను ఇందులో ఎంతో పెట్టుబడి పెట్టి ఉన్నానని, తనకు నష్టం జరుగుతోందని మరోమారు న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. దీనిపై కేసు ఇంకా నడుస్తోంది.

చర్మకారుల సమస్యలు పట్టవా?

ఒక పక్క చర్మకారులు తమకు శిక్షణ కల్పించి లెదర్ ఉత్పత్తుల తయారీ ప్రారంభించాలని, తమకు ఉపాధి కల్పించాలని లిడ్‌క్యాప్ మీద ఒత్తిడి తీసుకువస్తున్నారు. మరోవైపు కోర్టు కేసులతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో లిడ్‌క్యాప్ ఉంది.

ప్రభుత్వానికి నివేదించిన లిడ్‌క్యాప్

ఏడాది కాలంగా లీజుదారైన వైఎస్ ట్రేడర్స్ సంస్థతో తలబొప్పికడుతున్న వైనాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి లిడ్‌క్యాప్ ఉన్నతాధికారులు, పాలకవర్గం తీసుకువెళ్లింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, ప్రతిపాదిత స్థలంలో లెదర్ పార్క్ నిర్మాణానికి త్వరగా శ్రీకారం చుట్టాలని అభ్యర్థించింది. చర్మకారుల ద్వారా ఉత్పత్తులు తయారు చేయించేందుకు శ్రీకారం చుట్టాలని భావిస్తూ.. ఆర్టీసీ, పోలీసు, ఎక్సైజ్, ఇరిగేషన్, పాఠశాల తదితర శాఖలకు అవసరమైన లెదర్ ఉత్పత్తులన్నింటినీ కొనుగోలు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించగా.. ప్రభుత్వం జీఓ కూడా ఇచ్చింది. ఈ కేసులో ప్రభుత్వం ఇంప్లీడ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

ముక్త్యాలకు పునరుజ్జీవం!

(5వ పేజీ తరువాయి)

పథకానికి నిధులు ఇవ్వాలని చంద్రబాబును కలిశారు. పది రోజుల క్రితం కూటమి ప్రభుత్వం రూ.489.28 కోట్లు మంజూరు చేస్తూ జీవో నెం.44ను ఇచ్చింది. ఈ ఎత్తిపోతల ద్వారా 38,627 ఎకరాల సాగర్ ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. వేదాద్రి వద్ద నుంచి 386.27 క్యూసెక్కుల నీటిని రెండు దశల్లో ఎత్తి డీవీఆర్ కాల్వ ద్వారా మూడు చోట్ల ఎన్ఎస్పీ కాల్వలకు నీటిని విడుదల చేస్తారు. జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలలోని 30కి పైగా గ్రామాల రైతులకు లబ్ధి కలుగుతుంది.

పేరు మార్చి ఏమార్చిన వైసీపీ పాలకులు

గత వైసీపీ ప్రభుత్వంలో ముక్త్యాల ఎత్తిపోతల పేరు మార్చి పథకాన్ని ఏమార్చారని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆరోపించారు. ఈ స్కీం నిర్మాణం వల్ల రైతులు ప్రతి ఏడాది సాగునీటి కోసం ఎదురు చూసే పరిస్థితి ఉండదని, ఎన్ఎస్పీ ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుందని, భావి తరాలకు నీటి భద్రత కలుగుతుందని వివరించారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ, ముక్త్యాల ఎత్తిపోతల పథకానికి నిధులు విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

పట్టణంలో ఎర్రకాల్వ సమస్యకు శాశ్వత పరిష్కారానికి రూ.5.65 కోట్లు సీఎం మంజూరు చేశారని, ఈ నిధులతో పట్టణంలో ఎర్రకాల్వ ప్రవేశించే శాంతినగర్ నుంచి ఊర చెరువు వరకు కాల్వ లైనింగ్ పనులతో పాటు, అవసరమైన చోట కల్వర్టుల నిర్మిస్తామని ఎమ్మెల్యే తాతయ్య చెప్పారు.

నగరంలో నీటి సరఫరాపై మోదీ ఫిదా

(5వ పేజీ తరువాయి)

సంగ్రహించి పైపులైన్ల ద్వారా గుణదల గంగిరెద్దుల దిబ్బలోని రిజర్వాయర్‌కు సరఫరా చేసి రోజుకు 46 మిలియన్ లీటర్ల (ఎంఎల్‌డీ) నీటిని అందిస్తోంది. ప్రకాశం బ్యారేజీ దిగువ ప్రాంతలో కృష్ణానదిలో వేసిన బోర్ల ద్వారా రామలింగేశ్వరనగర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేసి రోజుకు నాలుగు మిలియన్ గ్యాలన్లు (ఎంజీడీ) నీటిని నగరం అందిస్తోంది. విజయవాడ నగరంలో పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు పూర్తి స్థాయిలో కృష్ణానది నీటిని సరఫరా చేస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో కొంత భాగానికి మాత్రమే కృష్ణానది నీరు సరఫరా అవుతోంది. మిగిలిన ప్రాంతాలకు కృష్ణానది పొడిగా ఉన్న ప్రాంతంలో ఉన్న బోర్ల నుంచి సరఫరా అవుతోంది. నగరంలో నీటి సరఫరాకు సంబంధించి కార్పొరేషన్ అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. హెడ్ వాటర్ వర్క్స్ ఇతర ప్లాంట్లలో శుద్ధి చేసిన నీటిని నగరంలోని 73 రిజర్వాయర్లకు పంపించటానికి 'స్కాడా' టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు.

లులూకు భూ కేటాయింపు

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి చేస్తుంది. విజయవాడ పాతబస్టాండ్ స్థలం అత్యంత ఖరీదైన ప్రాంతంలో ఉంది. బందరు రోడ్డు, ఏలూరు రోడ్లు అనుసంధానమయ్యే ప్రాంతంలో పాతబస్టాండ్ ఉంది. ఆసియాలోనే రెండో అతిపెద్ద బస్‌స్టేషన్, దేశంలోనే రెండో అతి పెద్ద జంక్షన్ పాతబస్టాండ్ స్థలానికి కూతవేటు దూరంలో ఉంది. విజయవాడలో బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్ వంటి ఇతర అనేక కమర్షియల్ ప్రాంతాలకు అత్యంత దగ్గరగా ఇది ఉంటుంది. లులూ మాల్ ఏర్పాటుకు మూడేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది.

మల్లవల్లి ఫుడ్‌పార్క్‌లో సీపీసీ నిర్వహణపై 'లులూ' ఆసక్తి

విజయవాడలో మెగా షాపింగ్ మాల్ నిర్మాణంతో పాటు కృష్ణాజిల్లా మల్లవల్లిలోని మెగా ఫుడ్ పార్క్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పరిచిన సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్ (సీపీసీ)ని కూడా లులు నిర్వహించటానికి ఆసక్తి చూపింది. ఇటీవలే 'లులు' ప్రతినిధులు సీపీసీని సందర్శించి వెళ్లారు. ఈ సీపీసీలో పల్ప్ తయారీ, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజ్, టెట్రా ప్యాకింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి. విజయవాడలో ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్‌ను నిర్మించ టంతో పాటు సీపీసీ నిర్వహణ బాధ్యతలు చూడనుంది.

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై జగన్ తప్పుడు ప్రచారం



» ఎమ్మెల్యే కొలికపూడి విమర్శ

తిరువూరు, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఆదాయం పెరిగింది కేవలం 3.47 శాతం అని ఒప్పుకుంటూ.. కేంద్రం నుంచి వచ్చే ఆదాయంతో కలిపితే పెరిగిన ఆదాయం 6.14 శాతం అని చెబుతూనే, మరోవైపు ఆర్థిక పరిస్థితిపై జగన్ విష పత్రికలో తప్పుడు ప్రచారం చేస్తుండటం ఆయన కుట్రపూరిత మనస్తత్వానికి నిదర్శనమని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు విమర్శించారు. ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనలో ఉండగా, జగన్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై విష ప్రచారం చేస్తు, ప్రజల దృష్టి మరల్చే కుట్రకు పూనుకున్నారని ఆరోపించారు. ఏడాది కాలంగా అమరావతి నిర్మాణం, రాష్ట్ర ఆర్థిక పునర్నిర్మాణం, పోలవరం, తదితర ప్రాజెక్టుల నిర్మాణంపై ముఖ్యమంత్రి దృష్టి సారించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంతో జరుగుతుండటాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీకి వస్తే రాష్ట్ర అభివృద్ధిపై చర్చించుకోవచ్చని కొలికపూడి హితవు పలికారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యాసాగర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్

గాంధీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి) : మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ తెలిపారు. గాంధీనగర్‌లోని ఎన్జీవో హోంలో ఆదివారం జరిగిన మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ప్రతిష్ఠ పెంచేలా ప్రతీ ఒక్క సభ్యుడు కృషి చేయాలన్నారు. ఎన్జీవోలోని వివిధ శాఖల ఉద్యోగుల సంఘాల్లో మహిళా ఉద్యోగ సంఘం కీలకపాత్ర పోషించాలన్నారు. యువతరం మహిళా నాయకులను ప్రోత్సహించాలన్నారు. బకాయి డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అధ్యయన ప్రక్రియను వేగవంతం చేయాలని మహిళా సంఘం చేసిన తీర్మానాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామన్నారు.

విజయవాడ తూర్పు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	122,131, 142
చికెన్ విత్ స్కిన్	232
చికెన్ స్కిన్‌లెస్	242

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 475

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కలెక్టరేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): నేడు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అలాగే అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నందు నమోదు చేసుకోవచ్చుని, నమోదైన అర్జీల స్థితి, సమాచారం తెలుసుకొనేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.



రెండో రోజు ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

శ్రీవారి ఆలయంలో ఘనంగా మహా కుంభాభిషేక మహోత్సవం

లబ్బీపేట, జూలై 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ కల్యాణమండపంలోని శ్రీవారి ఆలయంలో జరుగుతున్న మహా కుంభాభిషేక మహోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు. కల్యాణ మండపం ఆవరణలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి ప్రతిష్ఠ జరిగి 12ఏళ్లు పూర్తయిన సందర్భంగా మహాసంప్రోక్షణ చేపట్టారు. 2వ రోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు అగ్ని మథనం, పంచాగ్ని ప్రణయనం, సాయంత్రం 6.30 నుంచి 9 గంటల వరకు బింబాత్ కుంభే కళాపకర్షణ, ఉపచారసమర్పణం, ఉక్తహోమాలు నిర్వహించారు. ఈ పూజల్లో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం, సూపరింటెండెంట్ ఎం మల్లికార్జునరావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లలితా రమాదేవి పాల్గొనగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

అబాకస్ శిక్షణతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి

గాంధీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లోని ఏకగ్రాత, జ్ఞాపకశక్తి, అంకగణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు సిప్ అబాకస్ కృషి చేస్తుందని సిప్ అబాకస్ ఆంధ్రప్రదేశ్ హెడ్ గోపాలకృష్ణ తెలిపారు. నగరంలో ఆదివారం జరిగిన పోటీలను పోలీస్ ఉన్నతాధికారి చక్రవర్తి ప్రారంభించారు. పిల్లల్లో దాగున్న నైపుణ్యాన్ని, ప్రతిభను గుర్తించడానికి సిప్ వంటి సంస్థల కృషి అభినందనీయమన్నారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ 2003లో తమ సంస్థను ప్రారంభించామని దేశవ్యాప్తంగా వెయ్యి ఫ్రాంచైజెస్ ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి సర్టిఫికెట్లు, ట్రోఫీ, మెడల్స్ అందజేస్తామన్నారు.



గురునానక్ రోడ్లో కావడి యాత్రతో కృష్ణానది జలాలను తీసుకువస్తున్న భక్తులు

శ్రీ రామలింగేశ్వర స్వామికి కృష్ణాజలాలతో అభిషేకం

భారతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): గురునానక్ కాలనీలోని శివాలయంలో శ్రీ బాలగణేష్ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు, కృష్ణానది జలాలతో అభిషేకాన్ని నిర్వహించారు. శ్రావణమాసం సందర్భంగా (మార్వాడీ సంప్రదాయం ప్రకారం) విజయవాడ మార్వాడీ సమ్మేళన్, శివభక్తి మండల్ గురునానక్ కాలనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కావడి యాత్రతో తీసుకువచ్చిన కృష్ణానది జలాలతో శ్రీ బాలగణేష్ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామికి అభిషేకాన్ని నిర్వహించారు. ఈ కావడి యాత్రలో భక్తులందరూ దుర్గాఘాట్ నుంచి కృష్ణానీటిని కావడితో తీసుకుని బందర్ రోడ్డు మీదగా గురునానక్ కాలనీలోని శివాలయానికి తీసుకువచ్చి స్వామికి అభిషేకం చేశారు. దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో వెలసిల్లాలని కోరుతూ ఆ పరమశివుడిని ప్రార్థిస్తూ 16 ఏళ్లుగా (మార్వాడీ సంప్రదాయం ప్రకారం) కావడి యాత్రతో కృష్ణానది జలాలతో స్వామికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.



కావడితో కృష్ణానది జలాలను తీసుకువస్తున్న మహిళలు

బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా వైవీఎస్



లబ్బీపేట స్పోర్ట్స్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా విజయవాడకు చెందిన వైవీఎస్ ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఏపీ బాక్సింగ్ సంఘ ఎన్నికలు ఆదివారం విశాఖపట్నంలో జరిగాయి. ఎన్నికల్లో ఎన్టీఆర్ జిల్లా నుంచి ఉమామహేశ్వరరావు పోటీలో దిగి విజయం సాధించారు. ఉమామహేశ్వరరావు ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. రాష్ట్ర సంఘంలో చోటు దక్కించుకున్న ఉమామహేశ్వరరావును నగరానికి చెందిన క్రీడా ప్రముఖులు అభినందించారు.



మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, స్థానికులు

రామలింగేశ్వరనగర్‌లో మెగా మెడికల్ క్యాంప్

రామలింగేశ్వరనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): రాయల్‌క్లబ్ అమరావతి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ స్నేహం, సేవ, సహకారం అనే నినాదంతో ఆదివారం ఉదయం 7 నుంచి 12 గంటల వరకు 15వ డివిజన్ రామలింగేశ్వర నగర్, వినోద్ పబ్లిక్ స్కూల్‌లో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారు. స్థానిక మహిళలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రజారోగ్యంపై అవగాహనతో పాటు ప్రముఖ వైద్యులచే ఉచిత చికిత్స, వైద్య పరీక్షలు, మందుల పంపిణీ నిర్వహించామని సంస్థ రాయల్‌క్లబ్ అమరావతి అధ్యక్షుడు బండి రామ్మోహనరావు అన్నారు. రాయల్‌క్లబ్ అమరావతి కార్యదర్శి కేలం అనిల్‌కుమార్, ట్రెజరర్ కూవనరెడ్డి శివన్నారాయణ, డాక్టర్ భీమన రవితేజ, డాక్టర్ విశ్వనాథ్ కార్తిక్, డాక్టర్ యోగిత, డాక్టర్ గుండపు గంగాధర్, డాక్టర్ అంకెం చైతన్య కృష్ణ, డాక్టర్ జాహ్నవి పురంశెట్టి, డాక్టర్ యాస్మిన్ షేక్, డాక్టర్ షేక్ తప్ప అఫ్సర్ పాల్గొన్నారు.

అతివలకు ఆర్థిక స్వావలంబన

- కుట్టులో ఉచితంగా తర్ఫీదు
- త్వరలో కంప్యూటర్‌పై ఉచిత శిక్షణ
- శిక్షణా కేంద్రం కో-ఆర్డినేటర్ జ్యోతి

ఆటోనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఆటోనగర్‌లోని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ కుట్టు మిషన్ల శిక్షణా కేంద్రం కృషిచేస్తోంది. కేంద్రం నిర్వాహకులు మహిళలకు కుట్టులో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నారు. పేద మహిళకు ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన మహిళలు తమ కాళ్లపై తాము నిలిబడి తమ కుటుంబాలను పోషిస్తున్నారు.



ఆటోనగర్‌లోని కమల ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలు

1200 మందికి శిక్షణ

ఆటోనగర్ మెస్సీయ ఫెలోషిప్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కుట్టు శిక్షణా కేంద్రం 2016 నుంచి ఇప్పటి వరకు 1200 మందికి పైగా పేదమహిళలకు కుట్టుపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తిచేసిన సుమారు 600 మందికి పైగా పేద మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్‌లు అందజేశారు. ప్రస్తుతం 60 మంది శిక్షణ పొందుతున్నారు. మరో రెండు నెలలపాటు శిక్షణ సాగుతుంది. ఇప్పటి వరకు 17 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ అందజేస్తున్నారు. త్వరలో కంప్యూటర్‌పైనా శిక్షణ ఇచ్చే దిశగా నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. ఈ సెంటర్‌లో కుట్టు శిక్షణ పొందుతున్న యనమలకుదురుకు చెందిన కే చిన్నారి, న్యూ ఆర్టీసీ కాలనీకి చెందిన జీ హేమలత మాట్లాడుతూ కుట్టు నేర్చుకోవడం తమ ఆర్థిక పోషణకు దోహదపడుతుందని, టీచర్లు అర్థమయ్యేలా శిక్షణ ఇస్తున్నారన్నారు. తమకు ఈ తోడ్పాటు అందిస్తున్న మెస్సీయ ఫెలోషిప్ సంస్థ నిర్వాహకులకు వారు ధన్యవాదాలు తెలిపారు.

త్వరలో కంప్యూటర్‌పైనా శిక్షణ ఇస్తాం
సజ్జా జ్యోతి శిక్షణ కేంద్రం కో-ఆర్డినేటర్

కుట్టుతోపాటు త్వరలో మహిళలకు కంప్యూటర్‌పైనా ఉచితంగా శిక్షణ ఇస్తాం. ఇందుకోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తొమ్మిదేళ్లలో సుమారు 1200 మందికి పైగా కుట్టుపై శిక్షణ ఇచ్చాం. ఆర్థికంగా వెనుకబడిన వారికి రూ.7వేలు విలువైన కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తాం.

పాతశివాలయంలో హుండీ లెక్కింపు 5న

వన్‌టౌన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్‌లోని భ్రమరాంబమల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం (పాతశివాలయం)లో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఆగస్టు 5వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో నటరాజన్ షణ్ముగం తెలిపారు. ఆసక్తి ఉన్న భక్తులు మంగళవారం ఉదయం 7.30 గంటల లోపు దేవస్థానం కార్యాలయంలో పూర్తి వివరాలు తెలియజేసి సంప్రదాయ దుస్తులు ధరించి కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.



వాహనదారుల అవస్థలు

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్లో వేసిన ఇసుక, కనకదుర్గ గజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ 5వ రోడ్లో వేసిన బిల్డింగ్ మెటీరియల్, ఎస్‌బీహెచ్ కాలనీ రోడ్లో వేసిన ఇసుక

రహదారిపై బిల్డింగ్ మెటీరియల్

- వాహనదారుల అవస్థలు

భారతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కాలనీల ప్రధాన, అంతర్గత రహదారుల వెంబడి అడ్డంగా వేసిన బిల్డింగ్ మెటీరియల్‌తో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గురునానక్ మెయిన్, అంతర్గత, కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ 5వ రోడ్డు, ఎస్‌బీహెచ్ కాలనీ రోడ్డులోని బిల్డింగ్ యాజమానులు ఇసుక, కంకరను రోడ్డుపై వేశారు. అసలే పల్లపు రోడ్డు దానికి తోడు రోడ్డు వెంబడి బిల్డింగ్ మెటీరియల్ వేయడంతో వానకాలం కావడంతో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్‌లో నీళ్లు నిలిచిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



గవర్నర్‌పేట-2 డిపో ఎదుట నిరసన తెలుపుతున్న సంఘ నాయకులు

ఆర్టీసీ ఆస్తులు కాపాడుకుందాం

ఎన్ఎంయూఏ నాయకుల నిరసన

బస్‌స్టేషన్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విజయవాడ గవర్నర్‌పేట-2 డిపో స్థలాన్ని లులుకు ఇచ్చే ఆలోచనను విరమించుకోవాలని ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) జిల్లా కార్యదర్శి సి.హెచ్.రామకృష్ణ అన్నారు. ఆర్టీసీ స్థలాన్ని కాపాడాలని కోరుతూ రాష్ట్ర కమిటీ రెండు రోజులపాటు నిరసన కార్యక్రమంలో భాగంగా రెండో రోజు ఆదివారం గవర్నర్‌పేట-2 డిపో, విజయవాడ, విద్యాధరపురం డిపోలు, బస్టాండ్‌లో విద్యాధరపురం ఆర్టీసీ వర్క్‌షాప్ వద్ద ఎర్రబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. గవర్నర్‌పేట-2 డిపో వద్ద జరిగిన కార్యక్రమంలోజిల్లా కార్యదర్శి సి.హెచ్.రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్టీసీ స్థలాన్ని లులు సంస్థకు ఇచ్చే ప్రయత్నాన్ని తప్పుపట్టారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు వి.వి.ఎస్.మన్యం, పబ్లిసిటీ కార్యదర్శి ఎ.ఎస్.రావు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలి

చిట్టినగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ బిగుస్తున్న స్మార్ట్ మీటర్లను వెంటనే ఆపాలని, ఇప్పటికే ఏర్పాటు చేస్తే వెంటనే తొలగించాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేశాయి. చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సేవ్ టుయూ అధ్యక్షుడు వెంకట్రావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై కరెంటు చార్జీల భారం పడుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దాచిపెట్టి గుట్టు చప్పుడు కాకుండా మీటర్లను బిగించే ప్రయ త్నం ప్రారంభించడాన్ని తప్పుపట్టారు.



నోవోటెల్ ఎదురుగా ఫ్లై ఓవర్ సమీపంలో బయటకు వెళ్లే దారిలేక కాలువలో నిలిచిన వర్షపునీరు, ఏలూరు జాతీయ రోడ్డుపై ఏర్పాటు చేసిన సైడు కాలువ, రమేష్ ఆసుపత్రి సమీపంలో అసంపూర్తిగా నిలిచిన కాలువ పనులు

కాలువల్లో నీరు బయటకెళ్లేది ఎలా..?

భారతీనగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): బెంజ్‌సర్కిల్ ఫ్లై ఓవర్ ఏరియా ప్రాంతంలో ఏలూరు రోడ్డు జాతీయ రహదారిపై వర్షపు నిలవకుండా ఉండేందుకు అధికారులు ఫ్లై ఓవర్‌కు రెండు వైపులా ఉన్న రహదారిపై రమేష్ ఆసుపత్రి సెంటర్ నుంచి భారతీనగర్ కాలనీలోని నోవోటెల్ వరకు సైడు కాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువలోని నీరు బయటకు వెళ్లడానికి అనుసంధానం ఉన్న సర్వీస్ డ్రెయిన్‌ను కలపకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే దారి లేక రోడ్డుపై నిలిచిపోతున్నాయి. చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డు మునిగిపోతోంది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

గురునానక్ మెయిన్ రోడ్‌లో..

గురునానక్ కాలనీ మెయిన్ రోడ్డు పీఅండ్‌టీ కాలనీ సమీపంలో రోడ్డు పల్లంగా ఉండడంతో చిన్నపాటి వర్షం కురిసినా వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోతున్నాయి. దీంతో రోడ్డంతా అధ్వానంగా మారుతుందని వాహదారులు వాపోతున్నారు. ఆ సమయంలో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పీఅండ్‌టీ కాలనీ సమీపంలో గురునానక్ రోడ్లో నిలిచిన వాన నీరు

దిక్సూచి

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఐఐటీ బాంబే సర్టిఫికెట్ ప్రోగ్రామ్

సైబర్ సెక్యూరిటీ & సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై ఐఐటీ బాంబే ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. పన్నెండు నెలల ఈ కోర్సును పూర్తిగా ఆన్‌లైన్‌లో అందిస్తున్నారు. పరీక్షలు ఐఐటీ క్యాంపస్‌లో నిర్వహిస్తారు. ఇది పూర్తిగా వర్కింగ్ ప్రొఫెషనల్స్, కాలేజీ ఫ్యాకల్టీలతోపాటు ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ విద్యార్థులను ఉద్దేశించి రూపొందించారు. 2025 సెప్టెంబర్ 1 నుంచి కోర్సు ప్రారంభం కానుంది. పూర్తి వివరాల కోసం ఐఐటీ బాంబే వెబ్‌సైట్ చూడవచ్చు.

ఐబీపీఎస్ పీవో, ఎస్‌ఓ దరఖాస్తుల గడువు జూలై 28

ప్రొబెషనరీ ఆఫీసర్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల దరఖాస్తు దాఖలు గడువును ఐబీపీఎస్ పొడిగించింది. ఆసక్తిగల అభ్యర్థులు 2025 జూలై 28లోపు ibps.in. వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.



ఎన్ఐఆర్‌డీలో పీజీ డిప్లొమా

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ & పంచాయతీ రాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్)లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్(పీజీడీటీడీఎమ్), ప్రోగ్రామ్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి దూరవిద్యలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నారు. మొత్తం మూడు సెమిస్టర్లు ఉంటాయి. మూడో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది.

కోర్సు కాలవ్యవధి: 18 నెలలు

అర్హత: గుర్తింపు పొందిన వర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పాసై ఉండాలి.

కోర్సు ఫీజు: రూ.18,200/-(ఎస్సీ/ఎస్టీలకు ఫీజులో కొంత మేరకు మినహాయింపు ఉంటుంది)

దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 31

ఫోన్: 040 24008442, 7416860345,

Email: dec.nird@gov.in.

వెబ్‌సైట్: www.nirdpr.org.in

మ్యాట్ 2025 సెప్టెంబర్ సీజన్

సీబీటీ & పీబీటీ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఆల్ ఇండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 'మ్యాట్ 2025' సెప్టెంబర్ సీజన్ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ స్థాయిలో మేనేజ్‌మెంట్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఉద్దేశించిన ప్రధాన ఎంట్రెన్స్‌ల్లో 'ద మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్'(మ్యాట్) ఒకటి. ఈ ఎంట్రెన్స్‌ను 1988 నుంచి నిర్వహిస్తున్నారు. 2003 నుంచి కేంద్ర విద్యామంత్రిత్వశాఖ దీనిని జాతీయ స్థాయి పరీక్షగా గుర్తించింది. ఇది పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) మోడల్‌లో ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు మోడల్స్‌కు సంబంధించిన రిజిస్ట్రేషన్లు ప్రారంభం అయ్యాయి. అభ్యర్థులు తమ సౌకర్యాన్ని, ఆసక్తినిబట్టి ఈ రెంటిలో ఒకటి కానీ, రెంటినీ కానీ ఎంచుకోవచ్చు. మ్యాట్ స్కోరు వ్యాలిడిటీ ఒక సంవత్సరం ఉంటుంది. దేశవ్యాప్తంగా 600 పైగా బిజినెస్ స్కూల్స్ ఈ స్కోరు ద్వారా అడ్మిషన్ కల్పిస్తాయి. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులు దీనికి దరఖాస్తు చేసుకోవచ్చు. గ్రాడ్యుయేషన్ చివరి సంవత్సరం ఉన్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేయవచ్చు. అయితే కౌన్సెలింగ్ సమయంలోపు సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం: మ్యాట్ ఎంట్రెన్స్ నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో ఐదు సెక్షన్లు ఉంటాయి. ప్రతీ సెక్షన్‌లో ముప్ఫై ప్రశ్నలు అంటే మొత్తం 150 ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎంట్రెన్స్‌లో నెగెటివ్ మార్కింగ్ ఉంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానికి పావు మార్కు తగ్గిస్తారు.

- లాంగ్వేజ్ కాంప్రహెన్షన్ 30
- ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్ 30
- మేథమెటికల్ స్కిల్స్ 30
- డేటా అనాల్సిస్ అండ్ సఫిసియన్సీ 30
- ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ 30

పీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 21
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 15
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 18


సీబీటీ ఎగ్జామ్

- పరీక్ష తేదీ: 2025 సెప్టెంబర్ 28
- రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: 2025 సెప్టెంబర్ 22
- హాల్ టికెట్ల విడుదల: 2025 సెప్టెంబర్ 25

ఫీజు: పీబీటీ లేదా సీబీటీల్లో ఏదో ఒకటే రాయాలనుకున్న అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.2200/-. రెండు ఎంట్రెన్స్‌లు రాయాలనుకున్న అభ్యర్థులు అదనంగా రూ.1600/- చెల్లించాల్సి ఉంటుంది.

ఫలితాలు: 2025 అక్టోబర్ రెండోవారంలో విడుదల చేస్తారు.

వెబ్‌సైట్: mat.aima.in



ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ 2026

'ఆల్ ఇండియా లా ఎంట్రెన్స్ టెస్ట్ - 2026' నోటిఫికేషన్‌ను ఢిల్లీలోని 'ద నేషనల్ లా యూనివర్సిటీ' విడుదల చేసింది. ఐదు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, బ్యాచిలర్ ఆఫ్ లా(బీఏ ఎల్ఎల్‌బీ)(ఆనర్స్), ఒక సంవత్సరం మాస్టర్ ఆఫ్ లా(ఎల్ఎల్ఎం) ప్రోగ్రామ్‌లకు సంబంధించిన ఈ ఎంట్రెన్స్ పరీక్ష 2025 డిసెంబర్ 14న జరుగుతుంది. ఢిల్లీలోని నేషనల్ లా యూనివర్సిటీలో అడ్మిషన్ కోసం ఏఐఎల్ఈటీ స్కోరును మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ('క్లాట్', 'ఎల్‌శాట్'తో ఇక్కడ అడ్మిషన్ లభించదు).

విద్యార్హత: ఐదు సంవత్సరాల కోర్సుకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్‌మీడియేట్ పూర్తి చేసి ఉండాలి. ఓబీసీలకు 42, ఎస్సీ/ఎస్టీలకు 40 శాతం మార్కులు ఉంటే సరిపోతుంది.

వయస్సు: ఏఐఎల్ఈటీ ప్రోగ్రామ్‌లో చేరడానికి ఎలాంటి గరిష్ఠ, కనిష్ఠ వయస్సు నిబంధనలు లేవు.

పరీక్ష విధానం: మొత్తం మూడు సెక్షన్లతో 150 మార్కులు, 150 ప్రశ్నలతో ప్రశ్నపత్రం ఉంటుంది. నిర్ణీత సమయం రెండు గంటలు. ఇందులో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా గుర్తించిన ప్రతీ సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు.

సెక్షన్ ఏ: ఇంగ్లిష్ లాంగ్వేజ్ - 50 మార్కులు - 50 ప్రశ్నలు

సెక్షన్ బి: కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్ - 30 మార్కులు - 30 ప్రశ్నలు

సెక్షన్ సి: లాజికల్ రీజనింగ్ - 70 మార్కులు - 70 ప్రశ్నలు

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు 3500/-. ఎస్సీ/ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన అభ్యర్థులకు 1500/-. 2025 ఆగస్ట్ 7 నుంచి 2025 నవంబర్ 10లోపు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఏఐఎల్‌టీఈ 2026 కోసం nationallawuniversitydelhi.in వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఎంట్రెన్స్ పరీక్ష కేంద్రాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విశాఖపట్నంలో ఉన్నాయి.

చిరునామా: National Law University, Delhi, Sector-14, Dwaraka, New Delhi - 110078, India, 011- 40787555
(10:00 am to 05:00 pm on all working days)
ailetsupport@nludelhi.ac.in

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన ఏపీ ఫారెస్ట్ సబార్డినేట్ సర్వీస్‌లోని 100 ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025 ఆగస్ట్ 17 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చు. రాత పరీక్ష, శారీరక పరీక్ష, సీపీటీ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉన్నవారికి బోనస్ మార్కులు ఉంటాయి.

పోస్టు: ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్ఎస్ఓ). మొత్తం 100 పోస్టులు ఉన్నాయి.

వయస్సు: 2025 జూలై 1 నాటికి 18 నుంచి 30 సంవత్సరాల మధ్యలో ఉండాలి. రిజర్వేషన్లను అనుసరించి వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

అర్హత: పోస్టులను అనుసరించి డిగ్రీ ఉండాలి. (బోటనీ, ఫారెస్ట్రీ, హార్టికల్చర్, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథ్స్, స్టాటిస్టిక్స్, జియాలజీ, కెమికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్)

శారీరక ప్రమాణాలు:

పురుషులు: కనీసం 163 సెంటీమీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 84 సెంటీ మీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు కనీసం ఐదు సెంటీమీటర్లు పెరగాలి.

స్త్రీలు: కనీసం 150 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. ఛాతి 79 సెంటీమీటర్లు ఉండాలి. గాలి పీల్చినప్పుడు 5 సెంటీ మీటర్లు పెరగాలి.

నడక: పురుషులు నాలుగు గంటల్లో 25 కిలో మీటర్లు నడవాలి. మహిళలు 16 కిలో మీటర్లు నడవాలి.

చివరి తేదీ: 2025 ఆగస్ట్ 17 **వెబ్‌సైట్:** portalpsc.ap.gov.in/

SCHOLARSHIP ALERT

Aspire Scholarship Program

Description: Aspire Scholarship Program 2025-26 is a CSR initiative of SWAYAM Charitable Trust, a not-for-profit organization set up by Mr. Ajai Chowdhry and his family. The scholarship aims to provide financial support to underprivileged students pursuing B.Tech courses at 11 prestigious engineering institutions across India.

Eligibility: Students joining the first year of B.Tech courses at any of the specified 11 institutions can apply.

- The annual family income of the applicants should not exceed INR 6 lakh from all sources.

Prizes & Rewards: A total of 28 beneficiaries will be awarded scholarships based on the actual fee structure.

- The scholarship fund will be provided for academic expenses such as tuition fees, hostel fees, food, and related expenses.
- The duration of the scholarship will be 4 years, subject to meeting the specified criteria for yearly renewal.

Last Date to Apply: 31-08-2025

Application: Online Only ***Short Url:*** www.b4s.in/aj/ASPI4

HDFC Bank Parivartan's ECSS Programme

Description: HDFC Bank invites applications from students in Classes 1 to postgraduate level for the ECSS Scholarship 2025-26. This program supports meritorious and underprivileged students from financially challenged backgrounds.

Eligibility: Open to Indian nationals only

- Students in Classes 1–12, diploma, ITI, polytechnic, undergraduate, and postgraduate (general and professional) courses
- Minimum 55% marks in the last qualifying exam
- Annual family income must be INR 2.5 lakh or less
- Preference for students who have faced personal or family crises in the past three years, affecting their ability to continue education

Prizes & Rewards: Up to INR 75,000 ***Last Date:*** 04-09-2025

Application: Online only ***Short Url:*** www.b4s.in/aj/HDFC57

buddy4study.com



చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మైసా'గా రష్మిక



రష్మిక మందన్న కొత్త చిత్రం 'మైసా' ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాతో రవీంద్ర పుల్లె దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. నిర్మాత డి.సురేశ్ బాబు క్లాప్ కొట్టారు. రవి కిరణ్ కోలా కెమెరా స్విచ్చాన్ చేశారు. దర్శకుడు హను రాఘవపూడి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కి అందజేసి, ముహూర్తపు షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. రష్మిక 'మైసా' అనే శక్తిమంతమైన, హీరోయిన్ ఓరియెంటెడ్ పాత్రలో కనిపించబోతున్నారు. కాగా, గోండు తెగల బ్యాక్‌డ్రాప్‌లో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ సోమవారం నుంచి హైదరాబాద్‌లో ప్రారంభమవుతుందని, మొదటి షెడ్యూల్‌లో రష్మిక పాల్గొంటుందని చిత్రబృందం పేర్కొంది.

ఉత్కంఠభరిత చిత్రం



సమైరా, సముద్రఖని, అభిరామి ప్రధాన పాత్రల్లో అభినయ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమా 'కామాఖ్య'. పూజా కార్యక్రమాలతో ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మై ఫిల్మ్ ప్రొడక్షన్స్ బేనర్‌పై వడ్డేపల్లి శ్రీ వాణీనాథ్, యశ్వంత్ రాజ్ నిర్మిస్తున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టారు. చిత్ర దర్శకుడు అభినయ కృష్ణ ఈ సినిమా కోసం ఉత్కంఠభరితమైన కథని సిద్ధం చేశారని మేకర్స్ తెలిపారు. ఆనంద్, శరణ్య, ప్రదీప్, వైష్ణవ్, ధన్‌రాజ్, రాఘవ, ఐశ్వర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

కొత్త పాత్రలో..



వరుణ్ సందేశ్ హీరోగా ఏ.పళని స్వామి తెరకెక్కించనున్న 'వన్ వే టికెట్' అనే సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. బొరిగే శ్రీనివాస రావు నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో నిర్మాత సి.కల్యాణ్, దర్శకుడు త్రినాధరావు నక్కిన, సంగీత దర్శకుడు సాయి కార్తిక్, నటి కుష్బూ చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ 'ఈ స్క్రిప్ట్ చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. నేను ఇందులో కొత్త పాత్రను పోషించబోతున్నాను' అని అన్నారు. చిత్ర దర్శకుడు పళని స్వామి మాట్లాడుతూ 'ఈ సినిమా క్రైమ్ థ్రిల్లర్‌గా రాబోతోంది' అని తెలిపారు. ఈ చిత్రానికి కెమెరామెన్: శ్రీనివాస్ బెజుగమ్, సంగీతం: సాయి కార్తీక్.





ఔషధ 'అక్షర దార'!

ప్రకృతిలో మనకు ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. కానీ వాటి గురించి మనకు పెద్దగా తెలియదు. అలాంటి ఒక మొక్క 'అక్షర దార'. ఇది పలు అనారోగ్యలకు ఔషధంగానే కాక మరెన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఆ మొక్క గురించి తెలుసుకుందాం..

నీరు తక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ 'అక్షర దార' మొక్క మనగలుగుతుంది. ఈ మొక్కకు 'స్ట్రెబ్లస్ ఆస్పర్' అని శాస్త్రీయ నామం ఉంది. ఈ మొక్కను శాండ్ పేపర్ ట్రీ అని కూడా అంటారు. ఇది భారతదేశంతో పాటు శ్రీలంక, థాయిలాండ్, వియత్నాం, మలేషియా, కంబోడియా, ఫిలిప్పీన్స్.. పలు దేశాల్లో పెరుగుతుంది. ఈ




మొక్క దట్టంగా 4-15 మీటర్ల ఎత్తు పెరుగుతుంది. దీని ఆకులు అండాకారంలో ఉంటాయి. ఈ మొక్క పువ్వుల నుంచి అండాకారం కాయలు కాస్తాయి. అవి పండిన తరువాత పసుపు రంగులోకి మారతాయి. ఈ మొక్క ఆకులను, బెరడును సంప్రదాయ వైద్యంలో వినియోగిస్తారు. పంటి నొప్పి, విరేచనాలు, పాముకాటు.. మొదలైన వాటికి విరుగుడుగా కూడా ఉపయోగిస్తారు. ఈ మొక్కలో యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్ వంటి ఇరవైకి పైగా బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయి. ఆ మొక్క బెరడు క్రిమిసంహారకంగా ఉపయోగపడుతుంది. అలాగే 'అక్షర దార'తో చీజ్ తయారీ కోసం పాలను గడ్డకట్టించే ప్రోటీజ్ ఉంటుంది. దీని ఆకులను పశువులకు మేతగా ఉపయోగించవచ్చు. దీని వలన పాల దిగుబడి పెరుగుతుంది. అలాగే ఈ ఆకులు జంతువులలో రుమెన్ కిణ్వ ప్రక్రియను ప్రోత్సహిస్తాయి.

● డాక్టర్ శ్రీనాథ్,
వృక్ష శాస్త్రవేత్త, కన్హా శాంతివనం, హైదరాబాద్

వినూత్నం

నీళ్ల మీదా రంగోలీ!

నీళ్ల మీద రంగవల్లులు దిద్దుతూ వినూత్నమైన కళకు శ్రీకారం చుడుతున్నారు హైదరాబాద్‌కు చెందిన **సమ్మెట రేవతి**. ఆకర్షణీయమైన రంగుల ముగ్గులతో ఇప్పటివరకూ వందకు పైగా దేవతామూర్తుల రూపాలను నీళ్ల మీద సృష్టించారామె. ఈ కళ పట్ల ఏర్పడిన మక్కువ గురించీ, పొందుతున్న ఆదరణ గురించీ 'నవ్య'తో ఇలా ముచ్చటించారు.



నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలేయడమంటే ఇష్టం. అలాగే ముగ్గులు కూడా ఇష్టంగా వేసే దాన్ని. చిన్నప్పుడు మా ఇంటి పక్కనే ఉన్న రామాలయం ముందు పండుగల్లాంటి ప్రత్యేకమైన రోజుల్లో రంగులతో రంగవల్లులు దిద్దుతూ ఉండేదాన్ని. ముగ్గు వేసిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం కోసం నీళ్లు పక్కనే పెట్టుకుంటూ ఉంటాను. అయితే ఒకసారి ముగ్గు వేస్తున్న సమయంలో నా చేతిలో నుంచి రంగు ముగ్గు జారి నీళ్లలో పడిపోయింది. అది నీళ్ల మీద తేలుతూ ఉండడంతో నీళ్ల మీద రంగవల్లులు దిద్దితే ఎలా ఉంటుంది? అనే ఆలోచన వచ్చింది. అలా గత ఫిబ్రవరిలో నీళ్ల మీద ముగ్గులేసే 'ఫ్లోటింగ్ ఆర్ట్'కు బీజాలు పడ్డాయి. అంతకు ముందు ఆరేళ్ల నుంచీ ఆర్ట్ వీడియోలను యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తున్నప్పటికీ శివరాత్రి నాడు, నీళ్ల మీద వేసిన శివుడి రంగోలీతో మంచి ఆదరణ దక్కింది. పలువురు ఫలానా దేవుడి బొమ్మ వేయండి అంటూ సోషల్ మీడియా ద్వారా నన్ను అడుగుతూ ఉంటారు. తాజాగా కొమరవెల్లి మల్లన్న రంగోలీ వేయమని ఎంతో మంది నన్ను అడిగారు. కానీ ఆంధ్రలో పుట్టి పెరిగిన నాకు తెలంగాణా మల్లన్న స్వామి గురించిన అవగాహన లేదు. దాంతో గూగుల్‌లో వెతికి మల్లన్న స్వామి రూపురేఖలను గమనించి, ఆ తర్వాత రంగోలీకి పూనుకున్నాను. అలాగే అభిమానుల కోరిక మేరకు స్థానిక దేవతలు, గ్రామ దేవతల రంగోలీలు కూడా వేస్తూ ఉంటాను. ఇలా ఇప్పటివరకూ వందకు పైగా దేవతా రంగోలీలు వేశాను.

భక్తిశ్రద్ధలతోనే...

నీళ్ల మీద ముగ్గు వేయడం ఒకింత కష్టమేనని చెప్పాలి. ముగ్గు బరువుగా ఉంటుంది కాబట్టి చటుక్కున పోసేస్తే నీళ్లలో మునిగిపోతుంది. కాబట్టి నీళ్ల మీద తేలేలా ముగ్గును నెమ్మదిగా పోయాలి. బొమ్మ వేసే ముందు నేనెలాంటి సాధనా చేయను. వేయబోయే దేవతా చిత్రాన్ని, ధరించిన నగలనూ పది నిమిషాల పాటు గమనించి, నీళ్ల మీద రంగోలీ మొదలుపెట్టేస్తూ ఉంటాను. ముగ్గు వేసే సమయంలో ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండడం కోసం భక్తి పాటలు వింటాను. దేవునికి ఉపయోగించే సామాగ్రిని కూడా దైవసమానంగానే భావించాలని సనాతన ధర్మం చెప్తోంది. కాబట్టి రంగోలీ కోసం నీళ్ల నింపే స్టీలు పళ్లెం, ముగ్గు భరిణెలను పూజా సామాగ్రితో సమానంగా భావిస్తాను. రంగోలీ పూర్తి అయిపోయిన తర్వాత, ఆ నీళ్లను అందరూ తొక్కే వీల్లేకుండా పార్కులో ఓ మూలన పోరబోస్తాను. అడుగున పేరుకున్న ఇసుకను కూడా దగ్గర్లోని కాల్వల్లో కలిపేస్తూ ఉంటాను. అలాగే రంగోలీకి ముందూ, తర్వాత సదరు దేవతలకు నమస్కరించుకుంటూ ఉంటాను.



నేను క్లాసికల్ డాన్సర్‌ను. ఐదేళ్ల వయసు నుంచి ఇప్పటి వరకూ 350 కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చాను. అలాగే బాధ్యత, భగవంత్ కేశరి, గుంటూరు కారం, ఖుషి మొదలైన సినిమాల్లో చిన్న పాత్రల్లో కూడా నటించాను. పలు టీవీ సీరియల్స్‌లో కూడా నటించాను. మాది ఏలూరు జిల్లా, కలిదిండి. నేను అక్కడే పుట్టి పెరిగాను. నాన్న సమ్మెట రామారావు, జనరల్ స్టోర్ నడుపుతూ ఉంటారు. అమ్మ అమ్మాజీ టైలర్. మావారు సివిల్ ఇంజనీర్. మాకొక బాబు. నీళ్ల మీద రంగోలీ నాతోనే మొదలైందని అందరూ అంటూ ఉంటారు. ఇంటర్నెట్‌లో కూడా ఇలాంటి కళ నాకెక్కడా కనిపించలేదు. ఈ ఫ్లోటింగ్ ఆర్ట్ ఎంతలా విస్తరిస్తే, నేను కూడా అంతలా అందరికీ గుర్తుండిపోతాను. కాబట్టి భవిష్యత్తులో ఈ కళను పలువురికి నేర్పించాలనే ఆలోచన ఉంది.

లక్ష మంది సబ్‌స్క్రైబర్లు ఆ దేవుడి చలవే!

అమ్మవార్ల బొమ్మలైనా, ఇతర దేవతల బొమ్మలైనా బొమ్మ మొత్తం పూర్తయిన తర్వాత చివర్లో బొట్టు పెట్టి ముగించడం నాకు అలవాటు. అలా ఒకసారి నాలుగున్నర గంటల పాటు కష్టపడి నీళ్ల మీద వేంకటేశ్వర స్వామి వారి రంగోలీ వేశాను. కానీ చివర్లో నామం పెట్టే సమయంలో, కాస్త ఎక్కువ ముగ్గు జారి పడిపోవడంతో, ఆ ప్రదేశం నుంచి నీళ్లు బయటకు వచ్చేయడం మొదలుపెట్టాయి. ఎంత సరిదిద్దే ప్రయత్నం చేసినా వీలు పడలేదు. దాంతో నాకు ఏడుపొచ్చేసింది. అయినా వీడియోలో ఎడిట్ చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేసుకోవచ్చు. కానీ అందుకు నాకు మనస్కరించలేదు. మళ్లీ ఆ నీళ్లన్నీ ఒంపేసి, ఇంకొక నాలుగున్నర గంటల పాటు కష్టపడి అదే బొమ్మను సృష్టించాను. ఆ బొమ్మతో యూట్యూబ్‌లో నాకు లక్ష మంది సబ్‌స్క్రైబర్లు పూర్తవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. ప్రస్తుతం నాకు ఒక లక్ష 65 వేల మంది యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. పేపర్ లేదా కాన్వాస్‌ల మీద వేసే బొమ్మలు శాశ్వతంగా ఉండిపోతాయి. కానీ నీళ్ల మీద వేసే రంగోలీలను అలాగే ఉంచుకోలేం! మరొక రంగోలీ వేయాలంటే, ఆ నీళ్లను ఒంపేసి, తాజా నీళ్లను నింపుకోక తప్పదు. ఇదెంతో బాధాకరమైన విషయం. అయితే ఒకటి కావాలంటే మరొకటి వదులుకోక తప్పదు కాబట్టి మరొక కొత్త రంగోలీ కోసం పాత రంగోలీని తొలగిస్తున్నట్టు నాకు నేను సర్దిచెప్పుకుంటూ ఉంటాను. నిజానికి రంగోలీని తొలగించేటప్పుడు బాధ కలగకుండా ఉండడం కోసం, రంగోలీని కలిపే దృశ్యాన్ని వీడియో తీసి, దాన్ని రివర్స్ చేసి యూట్యూబ్‌లో పోస్ట్ చేస్తూ ఉంటాను.

● గోగుమళ్ల కవిత

ఆ ఇబ్బంది తగ్గించేందుకు..

నెలసరి.. ఆడవారిలో ప్రతినెలా జరిగే ఒక సహజ ప్రక్రియ. ఆ సమయంలో మహిళలు మార్కెట్‌లో దొరుకుతున్న శానిటరీ ప్యాడ్‌ల వలన దురద, దద్దుర్లు వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆ ప్యాడ్‌ల వలన అందరి కంటే ఎక్కువ బాధను అనుభవించారు గుజరాత్‌కు చెందిన **గీతా సోలంకి**. అందుకే వాటికి ప్రత్యామ్నాయంగా వస్త్రంతో ప్యాడ్‌ల తయారీకి శ్రీకారం చుట్టారు. ఆమె ప్రయాణం గురించి తెలుసుకుందాం...





గీతా సోలంకి.. గుజరాత్ సౌరాష్ట్ర ప్రాంతంలోని వెరవల్ అనే తీరప్రాంత పట్టణంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. ఆమె చిన్నతనం అంతా అక్కడే గడిచింది. ఆమెకు యుక్త వయసులో ఓ కణితి ఏర్పడడంతో కూర్చోడానికి, నడవడానికి కూడా ఇబ్బంది పడేవారు. ఇక నెలసరి సమయంలో ఆమె బాధ మరింత ఎక్కువయ్యేది. మార్కెట్‌లోని ప్యాడ్‌ల వాడకం వలన దురద, చికాకుతో నరకం అనుభవించారు. తన బాధను తల్లితో పంచుకోగా, ఆమె మెత్తని వస్త్రం వాడమని చెప్పారు. అందుకు గీత మొదట ఒప్పుకోలేదు. ఇన్ఫెక్షన్ వస్తుందని తిరస్కరించింది. అమ్మ నచ్చ చెప్పడంతో చివరికి అంగీకరించింది. వాడిన తరువాత గీతకు ఎంతో ఉపశమనం కలిగింది.

ఆలోచన అలా వచ్చింది..

గీతది ఉమ్మడి కుటుంబం కావడంతో ఇంట్లో ఎక్కువ మంది ఉండేవారు. ఇంట్లోని ఆడవారు శానిటరీ ప్యాడ్‌ల వలన ఎదుర్కొంటున్న సమస్యలను, అనుభవాలను అప్పుడప్పుడు వారితో ఒకరు పంచుకునే వారు. అప్పుడే గీతకు, వస్త్రంతోనే ప్యాడ్‌లు ఎందుకు తయారు చేయకూడదనే ఆలోచన వచ్చింది. ఆ తరువాత ప్యాడ్‌ల తయారీపై లోతైన పరిశోధన చేసి, 2018లో యునిప్యాడ్స్ సంస్థను స్థాపించారు. మొదట్లో ప్యాడ్‌లు కుట్టేందుకు మనుషులు దొరకలేదు. కొందరు ఆడవారు రావాలనుకున్నా నెలసరి మీద అపోహలతో వారి కుటుంబాలు ఒప్పుకోలేదు. దాంతో ఎంతో ఆలోచించి ఓ తెలివైన నిర్ణయం తీసుకున్నారు గీత. జీతం ఇచ్చి కుట్టు మిషన్ నేర్పిస్తామని చెప్పారు. దాంతో ఇంట్లోని వారు ఆడవారిని పంపడానికి ఒప్పుకున్నారు. అలా వచ్చిన వారు రోజులు గడిచే కొద్దీ నెలసరి గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. తరువాత వారి అనుభవాలు పంచుకున్నారు. నెల రోజుల కుట్టు మిషన్ ట్రైనింగ్ అయిపోయాక మరుసటి రోజు నుంచి తాము ప్యాడ్‌ల తయారీ మొదలుపెడుతున్నామని, ఆసక్తి ఉన్నవారు రావొచ్చని గీత చెప్పారు. మిషన్ నేర్చుకున్న 15 మందిలో 11 మంది ప్యాడ్‌లు కుట్టేందుకు వచ్చారు.

కేన్స్‌లో అవార్డు

నెలసరిలో ఉన్న ఆడవారిని వంటింట్లోకి రానివ్వకపోవడం మీద యూనిప్యాడ్స్ వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించింది. అహ్మదాబాద్‌లోని ఓ పెద్ద రెస్టారెంట్‌లో నెలసరిలో ఉన్నవారితోనే వంట వండించింది. చాలామంది సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, నాయకులు వాటిని తిని నిరసనకు మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని డాక్యుమెంటరీగా చిత్రీకరించగా అది కేన్స్ క్రియేటివిటీ ఫెస్టివల్‌లో 'సిల్వర్ గ్లాస్ లయన్' అవార్డు గెలుచుకుంది.

ఎన్నో అనుమానాలు..

చదువుకున్న వారిలోనూ వస్త్రంతో రూపొందించిన ప్యాడ్లపై ఎన్నో అనుమానాలు. అవి పరిశుభ్రం కాదనీ, పాత విధానమని ఎవరు వాడటానికి ముందుకు రాలేదని గీత గుర్తు చేసుకున్నారు. "దాంతో మొదట కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వారికి ఈ ప్యాడ్‌లు అందించాం. వారు ఉపయోగించి తరువాత వారే మా ప్యాడ్‌లు అమ్మడం మొదలుపెట్టారు. అలా "కళ్యాణి" వ్యవస్థ పుట్టింది. కళ్యాణిలు వారి గ్రామాల్లో మా ప్యాడ్లు అమ్ముతారు. అందుకు వారికి కమిషన్ లభిస్తుంది. అలాగే నెలసరి ఆరోగ్యం మీద ప్రజలకు అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం గుజరాత్ వ్యాప్తంగా దాదాపు 200 మంది కళ్యాణిలు పనిచేస్తున్నారు" అని గీత చెప్పారు.

పిల్లల హాజరు పెంచేందుకు..

కొంతమంది పిల్లలు నెలసరి సమయంలో బడికి వెళ్లరు. ఈ పద్ధతిని నిర్మూలించడం కోసం యూనిప్యాడ్స్ 'స్కూల్ మైల్స్' పేరిట ఓ వినూత్న కార్యక్రమం చేపట్టింది. గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో అమ్మాయిలకు కిట్(ఏడాదిన్నరపాటు వినియోగించుకునే క్లాత్ ప్యాడ్స్, వస్త్రంతో తయారుచేసిన స్కూల్ బ్యాగ్, లోదుస్తులు, సబ్బు, హాట్ వాటర్ బ్యాగ్)ను అందిస్తుంది. ఆ తరువాత ప్రతినెలా వారి హాజరును పరిశీలిస్తుంది. హాజరులో మెరుగుపడిన వారికి యూనిఫాం, స్టేషనరీ, కొత్త ప్యాడ్‌లు అందిస్తుంది.

బద్ధకం వదలాలంటే..!

ఒక్కోసారి మనకు బద్ధకంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. దీనివల్ల సమయం వృథా అవుతూ ఉంటుంది. అలా కాకుండా బద్ధకాన్ని ఎలా వదిలించుకోవాలో తెలుసుకుందాం...



- ఎప్పుడు చేయాలనుకున్న పనిని అప్పుడే పూర్తిచేస్తూ ఉంటే బద్ధకంగా అనిపించదు. పనులను వాయిదావేయడం మానుకోవాలి.
- ఏ పనిచేస్తే ఏమవుతుందో అన్న భయం కూడా మంచిది కాదు. దీనివల్ల తెలియకుండానే పనులను వాయిదా వేస్తూ ఉంటారు. భయాందోళనలకు గురికాకుండా పనులు చేస్తూ ఉంటే బద్ధకం దరిచేరదు.
- నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎప్పుడూ గుర్తుచేసుకుంటూ ఉండాలి. దీంతో ఆ లక్ష్య సాధన కోసం త్వరగా పని పూర్తిచేయాలన్న ఆలోచన వస్తుంది. శరీరం చురుకుగా పనిచేస్తుంది.
- రోజూ ఒకే దినచర్యను పాటించాలి. సమయానుసారం నిద్రించడం, ఉదయాన్నే వ్యాయామం చేయడం, అల్పాహారం తీసుకోవడం లాంటివి బద్ధకాన్ని వదిలిస్తాయి.
- శరీరం అలసిపోయినా కూడా బద్ధకంగా అనిపిస్తుంది. కాబట్టి శ్రమ అనిపించినప్పుడు కొద్దిగా విశ్రాంతి తీసుకోవాలి. గోరువెచ్చని నీళ్లతో స్నానం చేయడం కూడా ఉపకరిస్తుంది.
- పూర్తి చేయాలనుకున్న పనులను ఒక లిస్టుగా రాసుకోవాలి. తరచూ ఈ లిస్టును చూస్తూ ఒకదాని తరవాత మరోదాన్ని పూర్తిచేస్తూ ఉండాలి.
- పెద్ద పనులు అనుకోకుండా త్వరగా పూర్తయినప్పుడు ఆ ఆనందాన్ని మనస్ఫూర్తిగా ఆస్వాదించాలి. అప్పుడే బద్ధకం వదిలి మరింత ఉత్సాహంగా పనిచేయాలనిపిస్తుంది.

అమ్మ మనసు పాఠం చెబుతోంది!

వైకల్యాల కారణంగా అవహేళనలు ఎదుర్కొన్న కుమారుడి కోసం డాక్టర్ వృత్తిని వదిలేసి టీచర్‌గా మారారు దీప్తి తివారీ. కాన్పూర్‌లో ఆమె ఏర్పాటు చేసిన స్పెషల్ స్కూల్... వైకల్యాలున్న కొన్ని వందలమంది పిల్లలను అక్కున చేర్చుకుంది. ఆ పిల్లలకు నైపుణ్యాలను, వారి తల్లితండ్రులకు ఊరటను అందిస్తోంది.

అది నాకు జీవితాంతం గుర్తుండిపోయే సంఘటన. మా అబ్బాయి భరత్‌ను ఆ రోజే కొత్త స్కూల్‌లో చేర్పించాం. అతణ్ణి తరగతి గదిలోకి పంపించి... నేను బయట బెంచీ మీద కూర్చున్నాను. కొద్ది సేపటికి భరత్ ఏడుపు వినిపించింది. క్లాస్‌లోకి తొంగి చూశాను. మిగిలిన పిల్లలు అతణ్ణి ఆట పట్టిస్తున్నారు. టీచర్ దాన్ని పట్టించుకోనట్టు ఉన్నారు. నేను వెళ్ళి ఆమెను అడిగాను. 'ఈ స్కూల్ మీ అబ్బాయిలాంటి వాళ్ళ కోసం కాదు' అన్నట్టు మాట్లాడారు. వెంటనే భరత్‌ను తీసుకొని బయటకి వచ్చేశాను. ఇలాంటి అనుభవాలు మాకు ఎన్నో ఎదురయ్యాయి.


తెల్లకోటు వదలేసి...

డాక్టర్ కావాలనేది నా చిన్ననాటి లక్ష్యం. దాన్ని నెరవేర్చుకోవడానికి ఎంతో కష్టపడ్డాను. ఎంబీబీఎస్ పూర్తి చేశాను. వివాహం అయ్యాక... నా స్వస్థలమైన కాన్పూర్‌లోనే ప్రాక్టీస్ పెట్టాను. 1998లో భరత్ పుట్టాడు. కొన్ని నెలల తరువాత తనకు ఆరోగ్యపరమైన లోపాలు ఉన్నట్టు గ్రహించాను. వైద్య పరీక్షలు చేయించాక... భరత్‌కు శారీరకంగాను, మానసికంగాను వైకల్యాలు ఉన్నట్టు తేలింది. కాన్పూర్‌తో పాటు లఖ్‌నవూ, ఢిల్లీ, బెంగళూరు... ఇలా ఎన్నో నగరాలకు చికిత్స కోసం అతణ్ణి తీసుకువెళ్ళాను. కానీ భరత్ పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు. తను ఈ సమస్యతో జీవితాంతం బాధపడాల్సిందేనని తెలిశాక... ఎంతో వేదన అనుభవించాం. కానీ ధైర్యం మాత్రం కోల్పోలేదు. మాకు వీలైనంత వరకూ భరత్‌కు అన్నీ నేర్పించాలని అనుకున్నాం. అయితే బడిలో అడ్మిషన్ సంపాదించడం కష్టమయింది. మా అబ్బాయి మిగిలిన పిల్లల కన్నా భిన్నమైనవాడని మాకు తెలుసు. కానీ ఎవరైనా చెడుగా ప్రవర్తిస్తే తను అర్థం చేసుకోగలడు. భరత్‌ను ఎవరైనా వెక్కిరించినా, అల్లరి పెట్టినా తన బాధను, కోపాన్ని వ్యక్తం చెయ్యగలడు. మామూలు స్కూళ్ళ వాతావరణంలో తను ఇమడలేడని గ్రహించాం. భరత్ లాంటి ఎందరో పిల్లల తల్లితండ్రులు కూడా నాకు పరిచయం అయ్యారు. వారి ఆవేదనను కూడా గమనించిన తరువాత... శారీరక, మానసిక వైకల్యాలు, ఆటిజం సమస్య ఉన్న పిల్లల కోసం నేనే ఒక స్కూల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాను. 2007లో 'సంకల్ప్ స్పెషల్ స్కూల్' స్థాపనతో తొలి అడుగు వేశాను. దానికోసం నేనే టీచర్‌గా మారాను. తెల్ల కోటు వదిలేసి... బ్లాక్ బోర్డు మీద పాఠాలు చెప్పడం మొదలుపెట్టాను.



చదువుతో పాటు నైపుణ్యాలు కూడా...

పిల్లలు సంతోషంగా ఉండడం, ఒత్తిడి లేకుండా తమకు వీలైనవి నేర్చుకోవడం, తోటి పిల్లలతో కలిసి ఆటపాటలతో గడపడం... ఇదీ ఈ పాఠశాల ఏర్పాటు వెనుక ప్రధానమైన ఆశయం. గత 18 ఏళ్ళలో కొన్ని వందలమంది పిల్లలు మా పాఠశాలలో చేరి, వివిధ నైపుణ్యాలు నేర్చుకున్నారు. ప్రస్తుతం అయిదు నుంచి ఇరవై ఎనిమిదేళ్ళ మధ్య వయసున్న వారు మా బడిలో చదువుతున్నారు. నిర్దిష్టమైన ఫీజులేవీ ఇక్కడ లేవు. ఎవరు ఎంత ఇవ్వగలిగితే అంత ఇవ్వొచ్చు. అది కూడా చెల్లించలేనివారికి అంతా ఉచితంగానే అందిస్తున్నాం. చదవడం, రాయడంతోపాటు హస్త కళలు, ఆట పాటలు, వివిధ నైపుణ్యాలను మా విద్యార్థులు నేర్చుకుంటున్నారు.



నాటికలు, ఏకపాత్రాభినయాలు కూడా వివిధ వేదికల మీద ప్రదర్శించి ప్రశంసలందుకుంటున్నారు. ఇంతకుముందు మా అబ్బాయి ఎక్కువ సమయం నాతో గడిపేవాడు. ఇప్పుడు తనకు ఎంతోమంది స్నేహితులు. నా మీద తను ఆధారపడడం తగ్గించుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. అలాగే మా బడి పిల్లల తల్లితండ్రుల్లో సంతోషాన్ని చూస్తున్నప్పుడు ఎంతో సంతృప్తి కలుగుతోంది."

నీళ్ల బాటిళ్లు ఇలా శుభ్రం!



పాఠశాలలకు, ఆఫీసులకు లేదా బయటకు వెళ్లేటప్పుడు వెంట మంచినీళ్ల బాటిల్‌ను తీసుకెళ్తాం. అందులో ఉండేది నీళ్లే కదా అని బాటిళ్లను తరచూ శుభ్రం చేయరు. దాంతో బ్యాక్టీరియా చేరి బాటిళ్లు వాసన వస్తాయి. కాబట్టి నీళ్ల బాటిళ్లను తరచూ సులువుగా ఎలా శుభ్రం చేయాలో తెలుసుకుందాం..

- బాటిల్‌లో రెండు టేబుల్ స్పూన్‌ల బేకింగ్ సోడా లేదా ఉప్పు వేసి, కొంచెం నీరు పోసి మూతపెట్టి బాగా కదపాలి. తరువాత బ్రష్‌తో బాటిల్‌ను రుద్ది శుభ్రం చేయాలి.
- కొంచెం నిమ్మరసాన్ని బాటిల్‌లో పోసి మూతపెట్టి బాగా కదిపి మంచి నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేస్తే దుర్వాసన దూరం అవుతుంది.
- ఒక టేబుల్ స్పూన్ వెనిగర్, కొంచెం నీరు పోసి పదిహేను నిమిషాల తరువాత బాటిల్‌ను బాగా కదిపి నీటితో శుభ్రం చేయాలి.
- ఒక టీ బ్యాగ్‌ను బాటిల్‌లో వేసి గోరువెచ్చని నీరు పోసి రాత్రంతా అలా వదిలేసి ఉదయాన్నే బ్రష్‌తో రుద్ది కడగాలి.
- అలాగే బాటిల్ మూతను శుభ్రం చేసే విషయంలోనూ శ్రద్ధ వహించాలి. మూతను సబ్బు నీటిలో బాగా కడగాలి.
- కొన్ని బాటిళ్లకు ప్లాస్టిక్ సీల్ ఉంటాయి. ఆ సీల్‌ను తొలగించి శుభ్రం చేస్తే మంచి ఫలితముంటుంది.
- బాటిల్‌ను శుభ్రం చేసి తడి పూర్తిగా ఆరే వరకు మూత పెట్టకూడదు. అలాగే ఇంటికి వచ్చాక బాటిల్‌లో మిగిలిన నీటిని పారబోసి నీటితో శుభ్రం చేసి పూర్తిగా ఆరాకే మూత పెట్టాలి.



చైనా చిన్నది ఫైనల్ చేరింది

ప్రపంచ స్విమ్మింగ్‌లో 12 ఏళ్ల జిడి సంచలనం

సింగపూర్: ఈత కొలనులో పెను ప్రకంపనలు సృష్టిస్తున్న 12 ఏళ్ల చైనా టీనేజ్ స్విమ్మర్ యు జిడి ఊహించినట్లే అంతర్జాతీయ స్విమ్మింగ్‌లోనూ సంచలనం దిశగా దూసుకెళ్తోంది. ఇటీవల చైనా చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రదర్శన చేసి ప్రపంచ టోర్నీకి అర్హత సాధించిన ఈ చిన్నది.. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ తన అరంగేట్రాన్ని ఘనంగా చాటింది. ఈ మెగా టోర్నీలో 200 మీటర్లు, 400 మీటర్లు వ్యక్తిగత మెడ్లే, 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ విభాగాల్లో పోటీపడుతోన్న యు జిడి.. ఆదివారం ఇక్కడ జరిగిన 200 మీటర్ల మెడ్లేలో ఫైనల్ చేరి అందరినీ ఆశ్చర్యపరిచింది. మొదట 2 నిమిషాల 11.90 సెకన్ల టైమింగ్‌తో సెమీఫైనల్ చేరింది. మొత్తం 16 మంది క్వాలిఫయర్స్‌లో జిడి 15వ ఫాస్టెస్ట్ టైమ్ నమోదు చేసింది. అనంతరం సెమీస్‌లో 2 నిమిషాల 10.22 సెకన్ల టైమింగ్‌తో ఏడోస్థానంలో నిలిచి ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకుంది. ఫైనల్లో పోటీపడుతోన్న ఒలింపిక్ చాంపియన్, ప్రపంచ రికార్డు గ్రహీత సమ్మర్ మెకింతోష్‌కు ఇప్పుడు జిడి గట్టి పోటీదారుగా నిలిచింది.

311 పరుగుల లోటు.. ఐదు సెషన్ల ఆట.. అటు చూస్తే బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్. దీనికితోడు సున్నాకే రెండు వికెట్లు ఫట్. ఈనేపథ్యంలో టీమిండియా గెలుపు కాదు కదా.. కనీసం డ్రా కూడా అసాధ్యమేమో అనిపించింది. కానీ పోరాడితే పోయేదేముందనే కసితో బరిలోకి దిగిన టీమిండియా అబ్బురపరిచింది. కెప్టెన్ గిల్ తన అసాధారణ ఆటతీరుతో సిరీస్‌లో నాలుగో శతకం సాధించగా, రాహుల్ క్లాస్ ఇన్నింగ్స్ సెంచరీ సమీపంలో నిలిచింది. ఇక జడేజా-సుందర్‌లు రెండు సెషన్ల పాటు నిలిచి అజేయ సెంచరీలతో ఓటమి నుంచి కాపాడారు. వీరి పోరాటంతో మ్యాచ్ గ్రేట్ ఎస్కేప్ రీతిలో చరిత్రాత్మక డ్రాగా ముగిసింది. దీంతో తమదే విజయమనే ధీమాలో ఉన్న ఇంగ్లండ్‌కు దిమ్మ తిరిగింది. ఈ అలుపెరుగని పోరాటంతో యువ కెప్టెన్ గిల్ ఆధ్వర్యంలోని నయా భారత్‌ను తక్కువ అంచనా వేయరాదని ప్రత్యర్థి జట్లకు చాటి చెప్పింది.

టీమిండియా అద్భుత పోరాటం



గిల్ (103)



జడేజా (107 నాటౌట్)

1 ఓ టెస్టు సిరీస్‌లో ఎక్కువ శతకాలు (4) బాదిన కెప్టెన్‌గా బ్రాడ్‌మన్, గవాస్కర్ సరసన నిలిచిన గిల్. అయితే తొలిసారి కెప్టెన్‌గా బరిలోకి దిగి ఇన్ని సెంచరీలు సాధించిన రికార్డు మాత్రం గిల్‌దే. ఇక భారత్ తరపున ఓ సిరీస్‌లో నాలుగు సెంచరీలు సాధించి గవాస్కర్, విరాట్‌లతో సమంగా నిలిచాడు.

1 టెస్టు సిరీస్‌ల్లో ఎక్కువ సార్లు (7) 350+ స్కోర్లు సాధించిన జట్టుగా భారత్.

గ్రేట్ ఎస్కేప్

శతక్కొట్టిన గిల్, జడేజా, సుందర్ ● రాహుల్ చేజారిన సెంచరీ

భారత్ రెండో ఇన్నింగ్స్ 425/4 ● ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు డ్రా

మాంచెస్టర్: ఐదు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు తమ ఆశలను సజీవంగా ఉంచుకుంది. బ్యాటర్ల అసామాన్య పోరాటంతో ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో టెస్టును టీమిండియా డ్రాగా ముగించింది. దీంతో ఈనెల 31 నుంచి జరిగే ఐదో టెస్టులో నెగ్గి సిరీస్‌ను సమం చేయాలనుకుంటోంది. ప్రస్తుతం స్టోక్స్ సేన 2-1తో ఆధిక్యంలో ఉంది. చివరి రోజు ఆదివారం ఆటలో జడేజా (107 నాటౌట్), సుందర్ (101 నాటౌట్), కెప్టెన్ గిల్ (103) శతకాలతో హోరెత్తించారు. దాదాపు రోజంతా బ్యాటింగ్ సాగించిన భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 143 ఓవర్లలో 425/4 స్కోరుతో నిలిచింది. రాహుల్ (90) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వోక్స్‌కు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా స్టోక్స్ నిలిచాడు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 358, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 669 పరుగులు చేశాయి.

గిల్ శతక పోరాటం: 174/2 ఓవర్‌నైట్ స్కోరుతో చివరి రోజు భారత్ రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. శనివారం క్రీజులో పాతుకుపోయి డ్రాపై ఆశలు రేపిన కెప్టెన్ గిల్, రాహుల్ ఏమేరకు పోరాడతారనే ఆసక్తి అంతటా వ్యక్తమైంది. అయితే తన క్లాస్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్న రాహుల్ సెంచరీకి మరో 10 రన్స్ దూరంలోనే ఆగాడు. ఆట ఆరంభమైన కాసేపటికే అతడిని స్టోక్స్ ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో మూడో వికెట్‌కు 421 బంతుల్లో 188 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెర పడింది. ఇక స్టోక్స్ తర్వాతి ఓవర్‌లో బంతి గిల్ కుడిచేతి బొటన వేలికి తాకి పైకి లేచి హెల్మెట్‌ను సైతం తాకడంతో బాధతో విలవిల్లాడాడు. ఫిజియో వచ్చి పరిశీలించాక బ్యాటింగ్ సాగించాడు. నాలుగో రోజు బౌలింగ్‌కు దూరంగా ఉన్న స్టోక్స్ ఆదివారం మాత్రం భుజం నొప్పితోనే వరుసగా ఎనిమిది ఓవర్ల స్పెల్ వేసి బౌన్స్‌తో ఇబ్బందిపెట్టాడు. 90 పరుగులకు చేరాక నిదానం కనబర్చిన గిల్ మరో 10 రన్స్ కోసం 36 బంతులాడి శతకం పూర్తి చేసుకున్నాడు. కానీ అప్పటికే కొత్త బంతి తీసుకున్న ఇంగ్లండ్ ఫలితం సాధించింది. సెషన్ ముగియడానికి రెండు ఓవర్ల ముందు గిల్‌ను ఆర్చర్ అవుట్ చేశాడు. తర్వాతి బంతికే జడేజా ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో రూట్ వదిలేశాడు. తొలి సెషన్‌లో కేవలం 49 పరుగులే రావడం గమనార్హం.

జడ్డూ-సుందర్ శతక భాగస్వామ్యం: 88 పరుగులు వెనుకబడిన దశలో రెండో సెషన్‌ను ఆరంభించిన భారత్‌కు జడేజా-సుందర్ అద్భుత భాగస్వామ్యంతో అండగా నిలిచారు. బౌలర్లను మార్చినా.. క్రీజుకు నలువైపులా ఫీల్డర్లను మోహరించినా... ఇంగ్లండ్ ఈ జోడీని విడదీయలేకపోయింది. పట్టు వదలకుండా ఒక్కో బంతిని జాగ్రత్తగా ఆడేస్తూ ప్రత్యర్థి బౌలర్లను విసిగించారు. స్పిన్నర్ డాసన్ కూడా ఈ ఇద్దరు లెఫ్ట్ హ్యాండర్లను ఇబ్బంది పెట్టలేకపోయాడు. స్టోక్స్ ఓవర్‌లో 6,4తో సుందర్ హాఫ్ సెంచరీ పూర్తి చేయగా.. అదే ఓవర్‌లో మరో ఫోర్‌తో జడేజా సైతం ఈ ఫీట్ అందుకున్నాడు. సెషన్ ముగిసేసరికి ఐదో వికెట్‌కు అజేయంగా వంద పరుగుల భాగస్వామ్యం పూర్తి చేయడమే కాకుండా.. జట్టుకు 11 పరుగుల ఆధిక్యాన్ని అందించారు. దీంతో డ్రాపై అంచనాలు మరింత పెరిగాయి. ఆఖరి సెషన్‌లోనూ పరిస్థితి మారలేదు. బంతి కూడా పాతబడడంతో వీరి బ్యాటింగ్‌కు ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదు.

స్టోక్స్‌కు నో..

ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 138వ ఓవర్ ముగిశాక కెప్టెన్ స్టోక్స్ డ్రా కోసం ముందుకు వచ్చాడు. అయితే జడేజా, సుందర్ సెంచరీకి చేరువలో ఉండడంతో దీనికి అంగీకరించలేదు. దీంతో స్టోక్స్ అసంతృప్తి వ్యక్తం చేయడం కనిపించింది. అటు డ్రెస్సింగ్ రూమ్ నుంచి కెప్టెన్ గిల్ చిరునవ్వుతో ఇదంతా గమనిస్తున్నా అతడి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. ఇక మ్యాచ్‌ను త్వరగా పూర్తి చేసేందుకు స్టోక్స్ తమ ఫీల్డర్లను సర్కిల్ లోపలే ఉంచాడు. దీంతో ఆ తర్వాత ఐదు ఓవర్లలోనే వేగంగా బౌండరీలు రాబట్టి జడ్డూ, సుందర్ తమ శతకాలను పూర్తి చేసి ఆటను ముగించారు. ఈ జోడీ ఐదో వికెట్‌కు అజేయంగా 203 పరుగులు జోడించడం విశేషం.





వాషింగ్టన్ సుందర్ (101 నాటౌట్)

1 మూడు లేదా నాలుగో ఇన్నింగ్స్‌లో మూడు శతకాలు నమోదు కావడం భారత్‌కిదే తొలిసారి. అలాగే ఓ టెస్టు సిరీస్‌లో నలుగురు భారత బ్యాటర్లు (గిల్, పంత్, రాహుల్, జడేజా) 400+ పరుగులు సాధించడం కూడా ఇదే మొదటిసారి.

2 కెప్టెన్‌గా తొలి సిరీస్‌లోనే ఎక్కువ పరుగులు (722) చేసిన రెండో బ్యాటర్‌గా గిల్. డాన్ బ్రాడ్‌మన్ (810) తొలి స్థానంలో ఉన్నాడు. అలాగే భారత్ తరపున ఈ ఫీట్ సాధించిన రెండో బ్యాటర్ అయ్యాడు. గవాస్కర్ (774, 732) ముందున్నాడు.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 358
ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 669
భారత్ రెండో ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) రూట్ (బి) వోక్స్ 0, రాహుల్ (ఎల్బీ) స్టోక్స్ 90, సుదర్శన్ (సి) బ్రూక్ (బి) వోక్స్ 0, గిల్ (సి) స్మిత్ (బి) ఆర్చర్ 103, సుందర్ (నాటౌట్) 101, జడేజా (నాటౌట్) 107, ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 143 ఓవర్లలో 425/4; వికెట్ల పతనం: 1-0, 2-0, 3-188, 4-222. బౌలింగ్: వోక్స్ 23-4-67-2, ఆర్చర్ 23-3-78-1, కార్స్ 17-3-44-0, డాసన్ 47-11-95-0, రూట్ 19-2-68-0, స్టోక్స్ 11-2-33-1, బ్రూక్ 3-0-24-0.



ఫలితం టైబ్రేక్‌కు

రెండో గేమ్‌లోనూ హంపిని నిలువరించిన దివ్య

విజేత తేలేది నేడే ● మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్

బటూమి (జార్జియా): మహిళల చెస్ వరల్డ్‌కప్ విజేత ఎవరో తేలేది టైబ్రేక్‌లోనే. జీఎం కోనేరు హంపి, ఐఎం దివ్య దేశ్‌ముఖ్ మధ్య ఆదివారం జరిగిన రెండో క్లాసిక్ గేమ్ కూడా 34 ఎత్తుల్లో డ్రాగా ముగిసింది. తొలి గేమ్‌లో కూడా ఇద్దరూ పాయింట్ పంచుకొన్నారు. హంపి, దివ్య 1-1తో సమంగా నిలవడంతో.. క్వీన్ ఎవరనేది సోమవారం జరిగే టైబ్రేక్‌లో తేలనుంది.

దూకుడు తగ్గించి..

రెండో గేమ్‌లో తెల్లపావులతో ఆడడం హంపికి లాభిస్తుందని భావించారు. కానీ, డేరింగ్‌గా ఆడే దేశ్‌ముఖ్ వీలైనంతగా డ్రా కోసం ప్రయత్నించింది. ఇద్దరూ సరికొత్త ప్రయోగాలు చేయకుండా.. సంప్రదాయ ఆటకే ప్రాధాన్యమిచ్చారు. కోనేరు ఇంగ్లిష్ ఓపెనింగ్ చేయగా.. దేశ్‌ముఖ్ అగిన్‌కోర్ట్ డిఫెన్స్‌తో ఎదుర్కొంది. మిడిల్ గేమ్‌లో బోర్డుపై ఆధిపత్యం సాధించడానికి పాన్‌ను ట్రేడ్ చేసింది. అయితే, దివ్య బిషప్‌తో ఎఫ్3లోని హంపి నైట్‌ను పిన్ చేసింది. ఈ క్రమంలో హంపి నైట్‌ను కోల్పోగా.. దివ్య బిషప్‌ను చేజార్చుకొంది. 14వ ఎత్తు వేయడానికి కోనేరు కొంత సమయం తీసుకోగా.. దివ్యకు 20 నిమిషాల ఆధిక్యం దక్కింది. 16 ఎత్తుల తర్వాత ఇద్దరూ రూక్‌లను ట్రేడ్ చేసుకొన్నారు. హంపి, దివ్య సమవుజ్జీలుగా నిలవడంతో.. గేమ్ డ్రా దిశగా సాగింది. అనంతరం దేశ్‌ముఖ్ క్వీన్స్ ట్రేడ్ కోసం ప్రయత్నించినా.. తోసిపుచ్చిన హంపి గెలుపు కోసం ప్రయత్నించింది. 28వ ఎత్తులో సి7లోకి క్వీన్‌ను నడిపిన హంపి.. దివ్యను ఉచ్చులోకి లాగే ప్రయత్నం చేసింది. దీన్ని పసిగట్టిన దేశ్‌ముఖ్ తన క్వీన్‌ను డి5లోకి నడిపి తప్పించుకొంది. ఎండ్‌గేమ్‌లో ఇద్దరూ వేగంగా ఎత్తులు వేస్తూ పాన్‌లను త్యాగం చేశారు. హంపి క్రమంగా పట్టుబిగిస్తున్న సమయంలో దివ్య డ్రా కోసం తీవ్రంగా ప్రయత్నించింది. 30వ ఎత్తు నుంచి వరుసగా మూడుసార్లు తన క్వీన్‌ను డీ1లోకి నడిపిన దేశ్‌ముఖ్.. 34 ఎత్తులో గేమ్‌ను డ్రాగా ముగించింది. కాగా, మూడో స్థానం కోసం చైనా గ్రాండ్‌మాస్టర్ల మధ్య జరిగిన పోరులో టాన్ జోంగ్‌యి 1.5-0.5తో లి టింగ్జీపై గెలిచింది.

టైబ్రేక్ ఇలా..

టైబ్రేక్‌లో 15 నిమిషాల రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్ జరగనుంది. ఇది డ్రా అయితే.. 10 నిమిషాల రెండు ర్యాపిడ్ గేమ్‌ల సెట్ నిర్వహిస్తారు. ఇది కూడా సమంగా ముగిస్తే.. 5 నిమిషాల రెండు బ్లిట్జ్ గేమ్‌ల సెట్ ద్వారా ఫలితం తేల్చేందుకు ప్రయత్నిస్తారు. ఒకవేళ ఇది కూడా డ్రా అయితే.. చివరగా మూడు నిమిషాల గేమ్‌తో ఫలితం వచ్చే వరకు ఆడిస్తారు.

విండీస్.. అదే తీరు

నాలుగో టీ20లో ఆసీస్ విజయం

సెయింట్ కిట్స్: వెస్టిండీస్ జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. ఆస్ట్రేలియాతో శనివారం జరిగిన నాలుగో టీ20లోనూ 3 వికెట్ల తేడాతో ఓడింది. ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో 0-4తో ఇప్పటికే సిరీస్ కోల్పోయిన విండీస్‌కిది ఈ ఫార్మాట్‌లో వరుసగా ఏడో ఓటమి. గత నెలలో ఇంగ్లండ్‌పై 0-3తో వైట్‌వాష్ అయ్యింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ 20 ఓవర్లలో 205/9తో భారీ స్కోరు సాధించింది. రూథర్‌ఫోర్డ్ (31) టాప్‌స్కోరర్. జంపాకు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఆసీస్ 19.2 ఓవర్లలో 206/7 స్కోరుతో నెగ్గింది. గ్రీన్ (55), ఇన్‌గ్లిస్ (51), మ్యాక్స్‌వెల్ (47) రాణించారు. బ్లేడ్స్‌కు మూడు వికెట్లు దక్కాయి.

విజేతలు షి, వాంగ్

చైనా ఓపెన్

చాంగ్జౌ: చైనా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషులు, మహిళల సింగిల్స్ టైటిళ్లను షి యుకి, వాంగ్ జియా గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో యుకి (చైనా) 14-21, 21-14, 21-15తో తన దేశానికే చెందిన వాంగ్ జెన్‌సింగ్‌ను ఓడించి విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్ తుది పోరులో డిఫెండింగ్ చాంపియన్ వాంగ్ జియా 21-18, 21-13తో హాన్ ఈ (చైనా) చిత్తుచేసి టైటిల్ నిలబెట్టుకుంది. మహిళల డబుల్స్ ఫైనల్లో టాప్ సీడ్ లియు/టాన్ (చైనా) జంట 24-22, 17-21, 21-14తో జాంగ్/జియా (చైనా) ద్వయంపై నెగ్గి చాంపియన్‌గా నిలిచింది. పురుషుల డబుల్స్ తుది పోరులో ఫజర్/మహ్మద్ (ఇండోనేసియా) జోడీ 21-14, 21-15తో చియా /సో (మలేసియా) జంటపై నెగ్గి టైటిల్ అందుకుంది.



అంకితకు రజతం

- భారత్‌కు 12 పతకాలు
- ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలు

న్యూఢిల్లీ: జర్మనీలోని ఎస్సెన్ నగరంలో ఆదివారం ముగిసిన ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడలను భారత్ మొత్తం 12 పతకాల (2-5-5)తో ముగించింది. చివరి రోజు..మహిళల మూడువేల మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో అంకిత ధ్యానీ రజతం సాధించింది. ఇక, పురుషుల 4X100 మీ. రిలేలో, మహిళల 20 కి.మీ. రేస్‌వాక్ టీమ్ ఈవెంట్‌లో మనోళ్లు కాంస్యాలు నెగ్గారు. ఆఖరి రోజు పలువురు భారత అథ్లెట్లు ట్రాక్ విభాగాలలో తలపడినా..కేవలం రెండు పతకాలే లభించాయి. 23 ఏళ్ల అంకిత తొమ్మిది నిమిషాల 31.99 సెకన్ల వ్యక్తిగత అత్యుత్తమ సమయంతో రేస్‌ను పూర్తి చేసి రజతం దక్కించుకుంది. ఫిన్లాండ్, జర్మనీ అథ్లెట్లు స్వర్ణ, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. లాలూ ప్రసాద్, అనిమేష్ కుజూర్, మణికంఠ, మృత్యుంజయరాంతో కూడిన జట్టు 4X100 మీ. రిలేను 38.89 సెకన్లతో పూర్తి చేసి కాంస్యం చేజిక్కించుకుంది. దక్షిణకొరియా స్వర్ణం, దక్షిణాఫ్రికా కాంస్య పతకం నెగ్గాయి. మునిత, మాన్సీ, సెజాల్‌తో కూడిన భారత త్రయం మహిళల 20 కి.మీ. టీమ్ రేస్‌వాక్‌లో (4:56:06) కాంస్యం గెలుపొందింది. చైనా స్వర్ణం, ఆస్ట్రేలియా రజతం అందుకున్నాయి.

మోర్కెల్‌పై వేలాడుతున్న కత్తి?

టీమిండియా బౌలింగ్ ప్రదర్శనపై బీసీసీఐ గుర్రు



న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో సిరీస్‌లో భారత జట్టు బౌలింగ్ ప్రదర్శనపై బీసీసీఐ అసంతృప్తితో ఉన్నట్టు సమాచారం. దీంతో టీమిండియా సహాయ సిబ్బంది మోర్నీ మోర్కెల్, టెన్ డష్కాటెపై వేటుపడే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా, జట్టు చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పనితీరుపైనా బోర్డు పెద్దలు అసంతృప్తి వ్యక్తం చేశారట. అజిత్ ప్రస్తుతం జట్టుతోనే పర్యటిస్తున్నాడు. అయితే, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు తుది జట్టులో చోటు కల్పించకపోవడం బోర్డు ఆగ్రహానికి ఒక కారణంగా భావిస్తున్నారు. ఈ సిరీస్‌లో టీమిండియా బౌలింగ్ మరీ నాసిరకంగా ఉంది. ఈ నేపథ్యంలో బౌలింగ్ కోచ్ మోర్కెల్ పనితీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది. అసిస్టెంట్ కోచ్ డష్కాటే కూడా ఆశించినంత జట్టుకు సేవలందించలేక పోయాడు. సిరీస్ ముగిసిన తర్వాత సమీక్షా సమావేశంలో వీరిద్దరిపై వేటువేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. అయితే, చీఫ్ కోచ్ గంభీర్ పోస్టుకు ఇప్పట్లో గండం లేదని తెలుస్తోంది. వైట్‌బాల్ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శన గౌతీకి ప్లస్‌గా మారింది.

తిలక్‌కు సౌత్‌జోన్ పగ్గాలు

మళ్లీ జోనల్ ఫార్మాట్‌లో దులీప్ ట్రోఫీ



బెంగళూరు: దులీప్ ట్రోఫీలో సౌత్‌జోన్ కెప్టెన్‌గా హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ నియమితుడయ్యాడు. అతడితోపాటు తెలుగు ఆటగాళ్లు తన్మయ్ అగర్వాల్, తనయ్ త్యాగరాజన్, రికీ భుయ్, టి. విజయ్, షేక్ రషీద్ కూడా ఎంపికయ్యారు. కర్ణాటక క్రీడాకారులు వైశాక్ విజయ్ కుమార్, దేవ్‌దత్ పడిక్కల్, స్మరణ్‌కు కూడా టీమ్‌లో చోటుదక్కింది. దులీప్ ట్రోఫీని మళ్లీ జోనల్ ఫార్మాట్‌కు మార్చిన సంగతి తెలిసిందే. గతేడాది భారత్ ఎ,బి,సి,డి జట్లుగా విభజించి నిర్వహించారు. కానీ, ఈసారి జోనల్ సెలెక్టర్లు ఆరు జట్లను ఎంపిక చేశారు. వచ్చే నెల 28 నుంచి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ మైదానంలో మ్యాచ్‌లు జరగనున్నాయి.

సన్‌రైజర్స్‌ను వీడే ప్రసక్తి లేదు



నితీశ్ కుమార్

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టుతో ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్‌ది విడదీయరాని బంధం. 2024 ఐపీఎల్ సీజన్‌లో ఎస్ఆర్‌హెచ్ ఫైనల్‌కు చేరడంలో నితీశ్‌ది కీలక పాత్ర. ఆ సీజన్ 13 మ్యాచ్‌ల్లో దాదాపు 143 స్ట్రయిక్‌రేట్‌తో రెండు హాఫ్ సెంచరీలు సహా నితీశ్ 303 పరుగులు కొల్లగొట్టాడు. అలాగే బౌలింగ్‌లోనూ రాణించి మూడు వికెట్లు పడగొట్టాడు. ఇక..సీన్ కట్ చేస్తే..ఎస్ఆర్‌హెచ్‌ను నితీశ్ వీడనున్నాడని కొద్ది రోజులుగా వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. 2026 సీజన్‌కు ముందు అతడు కొత్త జట్టుతో చేరనున్నాడని పేర్కొన్నాయి. ఎట్టకేలకు ఈ వార్తలపై నితీశ్ పెదవి విప్పాడు. 'నేను సన్‌రైజర్స్‌ను వీడనున్నాననే వార్తలపై స్పష్టత ఇవ్వాలనుకుంటున్నా. ఎస్ఆర్‌హెచ్‌తో నా బంధం నమ్మకం, గౌరవంతో కూడినది. అందువల్ల నేను ఎప్పుడూ ఆ జట్టుతోనే కొనసాగుతా' అని ఎక్స్‌లో పేర్కొన్నాడు.

తులసి, నిత్యకు స్వర్ణాలు

బ్రిటిష్, ఐరిష్ పారా బ్యాడ్మింటన్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ పారా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత షట్లర్లు సత్తా చాటారు. యూకేలోని కార్డిఫ్‌లో జరిగిన బ్రిటిష్, ఐరిష్ పారా టోర్నీలో తులసి మురుగేశన్, నిత్య శ్రీ సుమతి సివాన్ సింగిల్స్‌లో పసిడి పతకాలు కొల్లగొట్టారు. మహిళల సింగిల్స్ ఎస్‌యూ5 కేటగిరి ఫైనల్లో తులసి 18-21, 21-17, 21-16తో భారత్‌కే చెందిన మనీషా రామదాస్‌ను ఓడించింది. ఎస్‌హెచ్6 సింగిల్స్ తుదిపోరులో నిత్యశ్రీ 21-11, 21-23, 21-11తో గిలియానా పొవెడ (పెరూ)పై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో సుకాంత్ (ఎస్ఎల్4), కృష్ణ నగర్ (ఎస్‌హెచ్6) వరుసగా రజత, కాంస్య పతకాలు సాధించారు. పురుషుల డబుల్స్ డబ్ల్యూహెచ్1 కేటగిరిలో ప్రేమ్ కుమార్/అబూ హుబైదా జోడీకి కాంస్యం, మిక్స్‌డ్ డబుల్స్ ఎస్‌హెచ్6 విభాగంలో కృష్ణా నగర్/నిత్యశ్రీ జంటకు కాంస్యం దక్కాయి. మహిళల సింగిల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్ కౌర్, మిక్స్‌డ్ డబుల్స్ ఎస్ఎల్3లో మన్‌దీప్/చిరాగ్ ద్వయం కాంస్యాలు అందుకున్నారు.

ఏపీ లిక్కర్ స్కాం ఢిల్లీ స్కాం కంటే పెద్దది: మంత్రి నిమ్మల

కడప ఎన్టీఆర్‌సర్కిల్/రైల్వేకోడూరు/ఓబులవారిపల్లె, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే వైసీపీ ప్రభుత్వ హ యాంలో ఏపీలో జరిగిన లిక్కర్ స్కాం అతి పెద్దదని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం కడప జిల్లాలో నిర్వహించిన సుపరిపాలన-తొలి అడుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దొంగ ఓట్ల మంత్రిగా పేరొందారని ఆరోపించారు. ఇక, వైఎస్ జగన్ మామిడి కాయల్లాగా మనుషులను తొక్కించుకుం టూ పోతుంటారని వ్యాఖ్యానించారు. పులివెందులలో కూడా తల్లికి వందనం డబ్బులు ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ పడ్డాయని తెలిపారు.

రాష్ట్రంలో పాజిటివ్ గవర్నెన్స్: మంత్రి సత్యప్రసాద్



విశాఖపట్నం, జూలై 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో పాజిటివ్ గవర్నెన్స్ నడుస్తోందని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. ఏడాది కాలంలో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, దీనివల్ల యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో పెట్టుబడులకు పెట్టేందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలను జగన్మోహన్‌రెడ్డి వెళ్లగొట్టారని ఆరోపించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైందని తెలిపారు.

బటన్ నొక్కినదాంట్లో జగన్ నొక్కిందెంత: పయ్యావుల

చాగల్లు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం బటన్ నొక్కానని, వారిని ఉద్ధరించానని చెబుతున్న వైఎస్.జగన్, అందులో ఆయన నొక్కిందెంతో ప్రజలు ఆలోచించాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో సుపరి పాలనలో తొలి అడుగులో భాగంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో అప్పు పుట్టని పరిస్థితికి.. దేశంలోనే అట్టడుగుస్థాయికి రాష్ట్రం చేరిందన్నారు. సీఎం చంద్రబాబుపై నమ్మకంతోనే ఇప్పుడు బ్యాంకులు అప్పు ఇస్తున్నాయని తెలిపారు.

జగన్ అండ్‌కోకు ఉరిశిక్ష వేయాలి: బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో జే బ్రాండ్ నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన 'జగన్ అండ్ కో'కు ఉరి శిక్షవేయాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరంలో ఆదివారం మాట్లాడారు. జైలులో ఉన్న మిథున్‌రెడ్డిని చూడడానికి వచ్చి వైసీపీ నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారని, మద్యం స్కాంకు పాల్పడినవారిని జైలుకు పంపడం తప్పా అని ఆయన ప్రశ్నించారు.

త్వరలోనే అనంతబాబు అరెస్టు: జవహర్

గుంటూరు(తూర్పు), జూలై 27(ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబును త్వరలోనే అరెస్టు చేసి, జైలుకు పంపుతామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. గుంటూరులో జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ జగన్‌కు భయపడి చాలామంది ఆ కుటుంబానికి ఆసరాగా నిలవలేదన్నారు.

మోదీ పాలనలో అభివృద్ధి: బీజేపీ చీఫ్ మాధవ్

కడప మారుతీనగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ 11 సంవత్సరాల పాలనలో దేశం అభివృద్ధిలో పరుగులు పెడుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కొనియాడారు. ఆదివారం కడప జిల్లాలో మాట్లాడారు. జాతీయ రహదారులు, ఇరిగేషన్ ప్రాజెక్టులు, గ్యాస్ కనెక్షన్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశుధ్యం తదితర వాటి పట్ల ప్రత్యేక శ్రద్ధతో ప్రజల సంక్షేమం, అభివృద్ధే అంతిమ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పరిపాలన చేస్తోందని తెలిపారు.

లిక్కర్ స్కామ్ సొమ్ము స్వాధీనం చేసుకోవాలి: సీపీఐ

అనంతపురం విద్య, జూలై27(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ ద్వారా కొట్టేసిన డబ్బులు, ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. అనంతపురంలో ఆయన ఆదివారం మాట్లాడారు. విద్యుత్ చార్జీల పెంపు, స్మార్టుమీటర్ల బిగింపునకు నిరసనగా ఆగస్టు 5న ఆందోళనలు చేపడతామన్నారు.

రిజర్వేషన్ గల్లంతు!

- ఈఏపీ సెట్ వెబ్ కౌన్సెలింగ్ అస్తవ్యస్తం
- భారీగా నష్టపోయిన రిజర్వేషన్ విద్యార్థులు
- జనరల్ కోటాలో రిజర్వ్ అభ్యర్థులకు నో ఎంట్రీ
- మెరిట్ విద్యార్థినులకు 10-20% మందికే జనరల్
- మేల్, ఫిమేల్ కటాఫ్‌లో కనిపించని వ్యత్యాసం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లలోనూ ఇదే పరిస్థితి

ఒక కళాశాలలో సీఎస్ఈ ఓసీ జనరల్ కటాఫ్ ర్యాంకు 12,227. కానీ, అంతకంటే మెరుగైన ర్యాంకులు వచ్చిన 30 మంది విద్యార్థినులకు, అంతకంటే మెరుగైన ర్యాంకులు వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు జనరల్ కోటాలో సీట్లు రాలేదు. వారికి ఓసీ జనరల్ కటాఫ్ కంటే మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ ఈఏపీ సెట్లో మెరిట్ కోటాలో సీటు దక్కలేదు. వారికి సంబంధించిన రిజర్వేషన్ కోటాలోనే సీటు వచ్చింది. కేవలం కొంతమంది అధికారుల నిర్లక్ష్యం కొన్ని వేల మంది విద్యార్థుల తలరాతలు మార్చేస్తోంది. గత ప్రభుత్వం నిర్వహించిన సచివాలయ ఉద్యోగుల ఎంపికతో మొదలైన రిజర్వేషన్ తొలగింపు ప్రక్రియ ఇప్పటికీ కొనసాగుతోంది.

గుంటూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ(ఈఏపీ) సెట్‌కు సంబంధించి చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్ వేలాది మంది విద్యార్థుల తలరాతలు మార్చేస్తోంది. ఈఏపీ సెట్లో సీట్ల కేటాయింపు నిమిత్తం చేపట్టిన వెబ్ కౌన్సెలింగ్‌లో 'రూల్ ఆఫ్ రిజర్వేషన్' గల్లంతైంది. తాజాగా జరిగిన తొలి విడత వెబ్ కౌన్సెలింగ్‌లో అనేక లోపాలు బయటబడ్డాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ విషయంలో కొంత మంది అధికారుల నిర్లక్ష్యం రిజర్వేషన్ వర్తించే విద్యార్థులకు శాపంగా మారింది. తొలివిడత కౌన్సెలింగ్‌లో విడుదలైన సీట్ అలాట్‌మెంట్ జాబితా జనరల్ కోటా అర్థం మారిపోయింది. జనరల్ కోటాలో సీట్లు మొత్తం బాలురకే కేటాయించారు. 'జనరల్' అంటే పురుష, స్త్రీ అన్న వ్యత్యాసం లేకుండా ఎవరికైనా మెరిట్ ఆధారంగా కేటాయించాలి. కానీ, జనరల్ కోటా సీట్లలో 80 శాతం సీట్లు బాలురకే కేటాయించారు. పురుషుల కోటాలో లాస్ట్ కటాఫ్ ర్యాంకు వచ్చిన అభ్యర్థికంటే మెరుగైన ర్యాంకుల వచ్చిన 80 శాతం మంది విద్యార్థినులను జనరల్ కోటాలోకి తీసుకోకుండా, వారికి బాలికల కోటాలో సీట్లు ఇచ్చారు. ఫలితంగా వేల మంది విద్యార్థినులకు అన్యాయం జరిగింది.

సామాజిక రిజర్వేషన్లలో

వెనుకబడిన, అణగారిన వర్గాలకు కేటాయించి హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారం మొత్తం సీట్లలో 50 శాతం వారికి కేటాయించాలి. వాటిలో 15 శాతం ఎస్సీలకు, 6 శాతం ఎస్టీలకు, 29 శాతం బీసీలకు కేటాయిస్తారు. అయితే, ఓపెన్ కేటగిరీలో ఉన్న 50 శాతం సీట్లకు కులమతాలు, రిజర్వేషన్లతో సంబంధం లేకుండా మెరిట్ ప్రకారం ఎంపిక చేస్తారు. మెరిట్ వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, విద్యార్థినులు కూడా ఆ కోటాలో సీట్లు పొందుతారు. ఆ కేటగిరీ భర్తీ అయిన తర్వాత మిగిలిన 50 శాతం సీట్లను ఆయా రిజర్వేషన్ల అభ్యర్థులకు కేటాయిస్తారు. అయితే, తాజా కౌన్సెలింగ్‌లో ఆ రిజర్వేషన్లు అమలు కాలేదు. మెరిట్ వచ్చిన బీసీ, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు అతి కొద్దిమందికి మాత్రమే జనరల్ కోటాలో సీట్లు కేటాయించారు. ఓపెన్ కేటగిరీ కటాఫ్ ర్యాంకు కంటే మెరుగైన ర్యాంకులు వచ్చిన 80 శాతం మందిని ఓపెన్ కేటగిరీలోకి రానివ్వకుండా, వారికి రిజర్వేషన్ కేటగిరీల్లోనే సీట్లు కేటాయించారు.



ఒక ఇంజనీరింగ్ కళాశాలలో ఓసీ జనరల్ కటాఫ్ ర్యాంకు 12,227(రెడ్ మార్కు) | అదే కళాశాలలో అంతకంటే మెరుగైన ర్యాంకు వచ్చినప్పటికీ జనరల్ కోటాలో సీటు రాని దజన్ల కొద్దీ విద్యార్థినులు(రెడ్ మార్కు)

వర్టికల్ రిజర్వేషన్ అబాసుపాలు

సామాజిక రిజర్వేషన్లతో పాటు ప్రభుత్వం మహిళలకు 33.3 శాతం రిజర్వేషన్లు కల్పించింది. దీనిని 'వర్టికల్ రిజర్వేషన్' అంటారు. అంటే ప్రతి కేటగిరీలో 33.3 శాతం సీట్లు విద్యార్థినులకు కేటాయించాలి. ఓపెన్ కేటగిరీలో ఉన్న 50 శాతం సీట్లలో మూడో వంతు మహిళలకు కేటాయించాలి. అలాగే, బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో ఉన్న సీట్లలో కూడా మహిళలకు మూడో వంతు సీట్లు కేటాయించాలి. అలా ప్రతి కేటగిరీలో మహిళలకు 33.3 శాతం సీట్లు కేటాయించాలి. అయితే, తాజా వెబ్ కౌన్సెలింగ్‌లో వర్టికల్ రిజర్వేషన్ పూర్తిగా అబాసుపాలైంది. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విభాగంలో మెరిట్ ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ఎవరినీ ఈ కోటాలోకి అనుమతించలేదు. ఆ కారణంగా వారంతా ఓపెన్ కేటగిరీ సీట్లు కోల్పోయారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

'టీడీఆర్' విజిలెన్స్ నివేదిక ఏమైంది?

- ఉన్నతాధికారులకు చేరిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించని వైనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల కుంభకోణంపై విజిలెన్స్ విచారణ నివేదిక జాడ లేకుండా పోయింది. ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి నెలలు గడిచిపోతున్నా ప్రభుత్వానికి చేరలేదు. గత వైసీపీ హయాంలో తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ దాదాపు రూ.140కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లను జారీ చేసింది. వాటిని 40శాతానికి బయట మార్కెట్‌లో విక్రయించుకున్నారు. అంటే రూ.56 కోట్ల మేర లబ్ధి చేకూరింది. నియోజకవర్గ వైసీపీ నేత కూడా లబ్ధి పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత దీనిపై విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. దాదాపు 4నెలల పాటు సాగిన ఈ విచారణలో భాగంగా స్థల యజమాల నుంచి విజిలెన్స్ డీఎస్పీ వివరాలు సేకరించారు. తాడేపల్లిగూడెం-భీమవరం రహదారి విస్తరణకు అవకాశం లేకపోయినా బాండ్లు జారీ చేశారు. ఇప్పటికీ భూమి యజమానుల వద్దే ఉంది. స్థల యజమానులు కాకుండా భీమవరం పట్టణానికి చెందిన బ్రోకర్ సంతకాలు చేసి బాండ్లు తీసుకుని, విక్రయించుకున్నారు. కొందరు యజమానులకు మాత్రం కొంతమేర ముట్టజెప్పారు. ఓ పాత సినిమా థియేటర్ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ అభివృద్ధి కోసం ఇచ్చిన యజమానులకు ఎలాంటి లబ్ధి చేకూరలేదు. వైసీపీ నేత, బ్రోకర్‌తో పాటు, కాంప్లెక్స్ అభివృద్ధి చేసిన నిర్మాణదారులు బాండ్లు విక్రయించుకున్నారు. అలాగే తాడేపల్లిగూడెం-భీమవరం రహదారికి ఆనుకుని 4వేల చదరపు గజాల స్థలం కొందరు మహిళల పేరుతో ఉంది. అక్కడ కాంప్లెక్స్ నిర్మాణానికి ఓ బిల్డర్ వారితో ఒప్పందం చేసుకున్నారు. అందులో 1,000 గజాల స్థలాన్ని మున్సిపాలిటీకి రాసిచ్చారు. స్థల యజమానులైన మహిళలకు బదులుగా బిల్డర్ పేరుతో బాండ్లు జారీ చేశారు. వాటిని భీమవరం పట్టణానికి చెందిన ప్రసాద్‌రాజు అనే బ్రోకర్ తీసుకొని, విక్రయించేసుకున్నారు. ఇందులోనూ వైసీపీ నేత హస్తం ఉంది. దీనిపై ఇటీవల తాడేపల్లిగూడెంలో పర్యటించిన మంత్రి నారాయణకు బాధిత మహిళలు ఫిర్యాదు చేయడంతో ఆయన విస్తుపోయారు.



సదస్సులో మాట్లాడుతున్న సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు, సీఎఫ్‌డీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రెండోదశ భూసమీకరణపై చర్చ అవసరం

- ఎన్నికల కమిషనర్‌గా ఉన్నప్పుడు పెట్టిన కేసులు ఎవరూ పట్టించు కోవట్లేదు: నిమ్మగడ్డ వ్యాఖ్యలు

విజయవాడ, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి రెండోదశ భూసమీకరణపై చర్చ జరగాల్సి అవసరం ఉందని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ(సీఎఫ్‌డీ) కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. 'రాజ్యాంగం-జవాబుదారీతనం' అంశంపై సీఎఫ్‌డీ ఆధ్వర్యంలో విజయవాడలో ఆదివారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాజధానిలో మరో 40 వేల ఎకరాలను సమీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించడంపై భిన్నాభిప్రాయాలు ఉన్నాయన్నారు. భూసమీకరణ అవసరమే కానీ, చేయాల్సిన సమయం ఇది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారని తెలిపారు. ఈ విషయాల్లో సీఎఫ్‌డీ తటస్థ వైఖరితో ఉంటోందని చెప్పారు. పౌరసమాజం చట్టబద్ధ, సుపరిపాలనను కోరుకుంటోందని నిమ్మగడ్డ తెలిపారు. ప్రజలకు అవినీతి లేని పాలనను అందించడంలో నేతల కంటే అధికారులకే ఎక్కువ బాధ్యత ఉంటుందన్నారు. కానీ, ప్రభుత్వ పెద్దల ప్రాపకం కోసం అధికారులు పనిచేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘాలు తమ సమస్యలపై మాత్రమే స్పందిస్తున్నాయన్నారు.

స్పందన ఏదీ?

తాను ఎన్నికల సంఘ కమిషనర్‌గా ఉన్న సమయంలో జరిగిన ఘటనపై నాటి అధికారులే కాకుండా, ప్రస్తుత అధికారులు కూడా చర్యలు తీసుకోవడం లేదని రమేశ్‌కుమార్ ఆరోపించారు. తాను పదవిలో ఉన్నప్పుడు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా, కృష్ణాజిల్లాకు చెందిన మంత్రి తనపైన, అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుపైన దారుణమైన భాషను ప్రయోగించారని గుర్తు చేశారు. దీనిపై తాను కేసు నమోదు చేశామని చెప్పారు. ప్రస్తుత ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తా గానీ దీనిపై ఇప్పటి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

బ్లాక్‌షీప్‌లా 'అనర్హత' అంశం

- జస్టిస్ లావు నాగేశ్వరరావు

పార్టీలు ఫిరాయిస్తున్న చట్టసభ సభ్యులపై తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం దారుణమని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ లావు నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. అనర్హత అంశం ఒక బ్లాక్‌షీప్‌లా తయారైందన్నారు. తెలుగు రాష్ట్రాల చట్టసభల్లో జరుగుతున్న పరిణామాలను స్వయంగా పరిశీలిస్తున్నానని చెప్పారు. ఒక పార్టీ నుంచి ఎన్నికైన సభ్యులు మరో పార్టీలోకి వెళ్తున్నారని, అలాంటి వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్లకు ఫిర్యాదు చేసినా వారు నిర్ణయం తీసుకోవడం లేదని చెప్పారు.

25,000 వద్ద పునరుజ్జీవం తప్పనిసరి

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కీలక స్థాయి 25,000 వద్ద రికవరీతో ప్రారంభమైనా 25,250 వద్ద విఫలమై చివరి రెండు రోజుల్లో బలమైన రియాక్షన్‌లోకి జారుకుంది. చివరికి వారం మొత్తానికి 130 పాయింట్ల నష్టంతో 24,830 వద్ద ముగిసింది. గత కొద్ది రోజులుగా 25,000 స్థాయిలో ఏర్పడిన కన్సాలిడేషన్‌లో విఫలమైంది. అలాగే మిడ్ క్యాప్-100, స్మాల్‌క్యాప్-100 సూచీలు కూడా బలమైన కరెక్షన్ సాధించాయి. ఇది స్వల్పకాలిక బలహీనతను సూచిస్తోంది. నిఫ్టీ గత నాలుగు వారాలుగా నిరంతర కరెక్షన్ ట్రెండ్‌లో ట్రేడవుతూ 850 పాయింట్ల మేరకు నష్టపోయింది. ప్రస్తుతం 25,000 కన్నా దిగువకు వచ్చినందువల్ల స్వల్పకాలిక బలహీనత మరింతగా కొనసాగవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: నిఫ్టీకి ఇంతకాలం మద్దతు స్థాయిగా ఉన్న 25,000 ఇప్పుడు నిరోధ స్థాయిగా మారింది. మరింత పాజిటివ్ ట్రెండ్ కోసం ఈ స్థాయిలో పునరుజ్జీవం సాధించి తీరాలి.

బేరిష్ స్థాయిలు: మరింత బలహీనత ప్రదర్శించినా భద్రత కోసం మద్దతు స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకుని తీరాలి. విఫలమైతే మరింత బలహీనతలో పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 24,450.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ సైతం గత కొద్ది వారాలుగా 57,000 వద్ద సాగిన కన్సాలిడేషన్ అనంతరం విఫలమై వారం కనిష్ఠ స్థాయి 56,520 వద్ద ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం 57,000 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన నిరోధం, జీవితకాల గరిష్ఠ స్థాయి 57,600. బలహీనత ప్రదర్శించినా సానుకూలత కోసం 56,000 వద్ద నిలదొక్కుకోవడం తప్పనిసరి. విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో పడుతుంది.

పాటర్న్: నిఫ్టీ గత వారం 50 డిఎంఏ కన్నా దిగువకు వచ్చింది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద బౌన్స్‌బ్యాక్ కావాలి. అలాగే 24,700 వద్ద ఏర్పడిన "డబుల్ బాటమ్" పాటర్న్ వద్ద నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,760, 24,700

25,250 పైన బుల్లిష్

(జూలై 28-ఆగస్టు 1 తేదీల మధ్య వారానికి)

నిఫ్టీ స్కోప్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 25,248-24,806 పాయింట్ల మధ్యన కదలాడి 131 పాయింట్ల నష్టంతో 24,837 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25,250 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.


- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 25,041, 25,058, 25,176, 25,217 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25,250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,425

నిరోధ స్థాయిలు: 25,050, 25,150, 25,250 (24,950 పైన బుల్లిష్)


మద్దతు స్థాయిలు: 24,625, 24,525, 24,425 (24,725 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



28వ తేదీ			
హైదరాబాద్	425	విజయవాడ	475
వరంగల్	427	గోదావరి	455
చిత్తూరు	483	విశాఖపట్నం	465
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	114
వరంగల్	115	గుంటూరు	119
కరీంనగర్	115	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	113
కర్నూలు	115	నెల్లూరు	118
విశాఖపట్నం	97	అనంతపురం	118
గోదావరి	114		

మరికొంత కాలం లాభాలపై ఒత్తిడి తప్పదు

అమ్మకానికి ప్రాధాన్యతా రంగ రుణాలు
కెనరా బ్యాంక్ ఎండీ సత్యనారాయణ రాజు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ లాభాలపై ఒత్తిడి తగ్గించుకునే పనిలో పడింది. ఇందు కోసం పరిమితికి మించి ఇచ్చిన ప్రాధాన్యతా రుణాల్లో మరికొంత మొత్తాన్ని ఈ త్రైమాసికంలో అమ్మకానికి పెడుతోంది. బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు ఈ విషయం వెల్లడించారు. జూన్ త్రైమాసికంలోనూ ఈ అధిక ప్రాధాన్యతా రంగ రుణాల్లో కొన్ని రుణాలను విక్రయించడం ద్వారా కెనరా బ్యాంక్ రూ.1,248 కోట్ల కమీషన్ ఆదాయం ఆర్జించింది. అయినా జూన్ త్రైమాసికం ముగిసే నాటికి బ్యాంక్ మొత్తం రుణాల్లో ప్రాధాన్యతా రుణాల వాటా 45.63 శాతం వరకు ఉంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించిన 40 శాతం కంటే ఇది 5.63 శాతం ఎక్కువ. ఈ అధిక ప్రాధాన్యతా రుణాలను కొనేందుకు మార్కెట్లో అనేక బ్యాంకులు సిద్ధంగా ఉన్నట్లు రాజు చెప్పారు.

వడ్డీ రేట్లే సమస్య: వడ్డీ రేట్లు తగ్గడం వల్లే బ్యాంక్ లాభాలపై ఒత్తిడి పెరిగిందని ఎండీ, సీఈఓ రాజు చెప్పారు. ఆర్‌బీఐ కీలక రెపో రేటు ఈ ఏడాది ఫిబ్రవరి-జూన్ మధ్య ఒక శాతం తగ్గించింది. దీంతో కెనరా బ్యాంక్ నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) జూన్ త్రైమాసికంలో 2.75 శాతానికి పడిపోయింది. రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో ఆగస్టు లేదా అక్టోబరులో జరిగే సమావేశాల్లోనూ ఆర్‌బీఐ రెపో రేటు మరింత తగ్గిస్తుందనే అంచనాలు వినిపిస్తున్నాయి. అదే జరిగితే సెప్టెంబరు త్రైమాసికంలో 2.75 శాతం ఎన్ఐఎం కొనసాగించడం కష్టమవుతుందన్నారు. అయితే అక్టోబరు, మార్చి త్రైమాసికాల్లో పరిస్థితి కొద్దిగా మెరుగుపడే అవకాశం ఉందని సత్యనారాయణ రాజు తెలిపారు.

బిజినెస్

భారత ఆర్థికానికి ఢోకా లేదు

- ఎంపీసీ సభ్యుడు నగేశ్ కుమార్

న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ శక్తివంతంగా పురోగమిస్తున్నదని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం పైబడిన వృద్ధి రేటు సాధించే విషయంలో ఎలాంటి సవాలు ఎదురయ్యే స్థితి లేదని ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సభ్యుడు నగేశ్ కుమార్ అన్నారు. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ రుణ సంక్షోభంతో పాటు అధిక ద్రవ్యోల్బణం, వృద్ధిలో మందగమనం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ మాత్రం వెలుగుదివ్వెగా ఉన్నదని ఆయన పేర్కొన్నారు. దేశీయ వినియోగమే భారత్‌కు బలమని అన్నారు. రాబోయే సంవత్సరాల్లో వృద్ధి మరింత వేగం అందుకోవడంతో పాటు అది 7-7.5 శాతానికి కూడా చేరవచ్చని అంచనా వేశారు. ప్రస్తుతం వినియోగదారుల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 2 శాతానికి దిగివచ్చిందని, ఎంపీసీ అనుసరించిన విధానపరమైన వైఖరే ఇందుకు కారణమని వ్యాఖ్యానించారు. మరో రెపో రేటు కోత అనేది విభిన్న స్థూల ఆర్థిక గణాంకాలపై ఆధారపడి ఉంటుందని అంటూ ద్రవ్యోల్బణం 2 శాతానికి దిగివచ్చినంత మాత్రాన ఎల్లకాలం అక్కడే స్థిరంగా ఉండిపోతుందని అర్థం కాదన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ఎంపీసీ సమీక్ష ఉన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్య ప్రాధాన్యం సంతరించుకుంది.

డీఈసీ ఇన్‌ఫ్రాకు రూ.613 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న డీఈసీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్‌కు కేంద్ర ప్రభుత్వం నుంచి రెండు ప్రతిష్ఠాత్మక కాంట్రాక్టులు లభించాయి. ఆర్డర్‌లో భాగంగా ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లోని భవనాల కన్జర్వేషన్, రెట్రోఫిట్టింగ్‌తో పాటు ఒక సర్వీస్ బిల్డింగ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. సీపీడబ్ల్యూడీ నుంచి లభించిన ఈ కాంట్రాక్టు విలువ రూ.317.32 కోట్లు. రెండేళ్లలో ఈ కాంట్రాక్ట్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది. మరొక కాంట్రాక్ట్‌లో భాగంగా పలు ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఉన్న నేతాజీ నగర్‌లోని సెంట్రల్ విస్టాలో ఇంటర్నల్ ఫినిషింగ్, ఫర్నీచర్ ఫినిషింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులను ఏడాదిలోగా పూర్తి చేయాలి. ఈ కాంట్రాక్టు విలువ రూ.295.91 కోట్లు అని కంపెనీ తెలిపింది.

బౌన్స్ బ్యాక్ అయితేనే!

దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుతం కీలక దశకు చేరుకున్నాయి. మార్కెట్లలో మళ్లీ బుల్ రన్ కొనసాగాలంటే ఇప్పటి స్థాయిలను అధిగమించాల్సి ఉంటుంది. అంతర్జాతీయంగా రాజకీయ పరిణామాలు మారుతుండటం, కార్పొరేట్ కంపెనీల ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవటం, వడ్డీ రేట్ల కోతలు, అమెరికాతో వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవటం నెగటివ్ సెంటిమెంట్‌కు దారితీస్తోంది. నిఫ్టీ 50 డీఎంఏ, 25,000 దిగువకు రావటం కలవరపెడుతోంది.

స్టాక్ రికమండేషన్స్

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్: తాజా గరిష్ఠం రూ.1,379 నుంచి స్వల్ప దిద్దుబాటుకు లోనైన ఈ కౌంటర్ ప్రస్తుతం మెరుగ్గా చలిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ పెరుగుతోంది. పైగా ఫార్మా రంగ సూచీ బ్రేకౌట్ ఇచ్చింది. గత శుక్రవారం రూ.1,277 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,270/1,250 శ్రేణిలో ప్రవేశించి రూ.1350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,225 స్థాయిని స్టాప్‌లా‌స్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ లొంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్: ఈ షేరు నష్టాల మార్కెట్లోనూ మెరుగ్గా రాణించింది. గత శుక్రవారం రూ.1,921 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,900 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. బై ఆన్ డిప్స్ పద్ధతిలో కొనుగోలు చేయాలి. రూ.1,875 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టొరెంట్ ఫార్మా: ఈ కౌంటర్ అత్యంత బలాన్ని ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ చాలా బాగున్నాయి. డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతోంది. పైగా జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. గత శుక్రవారం రూ.3,063 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,550/3,580 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,750 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,550 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: ఆరు నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. కీలకమైన నిరోధ స్థాయికి చేరుకుంది. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం రూ.1,832 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,800 శ్రేణిలో ప్రవేశించి రూ.1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,770 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సన్ ఫార్మా: కొన్ని నెలలుగా డౌన్‌ట్రెండ్‌లో పయనించిన ఈ షేరు ప్రస్తుతం అక్యుములేషన్ జోన్‌లో ఉంది. ప్రస్తుతం అనిశ్చితి తగ్గింది. మూమెంటమ్ పెరుగుతోంది. గత శుక్రవారం రూ.1,699 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,660/1,680 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,800 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకోవాలి. అయితే రూ.1,640 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

ఐసీఐసీఐ ప్రు ఈఎల్ఎస్ఎస్‌తో మెరుగైన రిటర్నులు

దీర్ఘకాలంలో మదుపరులకు అద్భుతమైన రిటర్నులు అందించటంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్.. ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) కీలకంగా ఉన్నాయి. 1999లో ఈ పథకంలో రూ.10,100 పెట్టుబడిగా పెడితే దాదాపు 25 ఏళ్ల కాలంలో ఈ మొత్తం రూ.7.9 లక్షలకు చేరుకుంది. ఈ పాతికేళ్లలో పెట్టుబడుల విలువ ఏకంగా 7,726.31 శాతం పెరిగింది. ఇదే సమయంలో నిఫ్టీ 1,789.84 శాతం, సెన్సెక్స్ 4,672.12 శాతం రిటర్నులు అందించగలిగాయి. మార్కెట్లు కరెక్షన్‌కు గురయినప్పటికీ, పరిస్థితులకు తగ్గట్టుగా పెట్టుబడుల విధానాన్ని మార్చుకోవటం ద్వారా ఈ ఫండ్ మెరుగైన రిటర్నులు అందించగలిందని ఐసీఐసీఐ ప్రు వెల్లడించింది.

- లైటస్ టెక్నాలజీస్ హోల్డింగ్స్.. ప్రైవేట్ ఈక్విటీ ప్లేస్‌మెంట్ రూపంలో రూ.132 కోట్లు సమీకరించింది. దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ మొత్తాలను సమీకరించినట్లు కంపెనీ ప్రకటించింది. మూలధన అవసరాలు, అంతర్జాతీయంగా కార్యకలాపాల విస్తరణకు ఈ మొత్తాలను వినియోగించనున్నట్లు వెల్లడించింది.
- టాటా ఎంటర్‌ప్రైజ్‌కు చెందిన బిగ్‌బాస్కెట్ ఖమ్మంలో తన క్విక్ డెలివరీ కార్యకలాపాలు ప్రారంభించింది. ఖమ్మం పట్టణ వాసులకు పది నిమిషాల్లో అవసరమైన ఉత్పత్తులను డెలివరీ చేయనున్నట్లు ప్రకటించింది. దాదాపు 10 వేలకు పైగా ఉత్పత్తులు క్విక్ డెలివరీ కింద అందుబాటులో ఉంటాయని తెలిపింది.
- పియాజియో వెహికల్స్ లిమిటెడ్.. మార్కెట్లోకి సరికొత్త ఎలక్ట్రిక్ ఆటోలను విడుదల చేసింది. అపే ఈ-సిటీ అల్ట్రా, అపే ఈ-సిటీ ఎఫ్ఎక్స్ మ్యాక్స్ పేరుతో వీటిని తీసుకువచ్చింది. వీటి ధరలు వరుసగా రూ.3.30 లక్షలు, రూ.3.88 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న పియాజియో డీలర్‌షిప్ కేంద్రాల్లో ఈ మోడళ్లు అందుబాటులో ఉంటాయి.
- ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా).. కేంద్ర ప్రభుత్వ పరిశోధనా సంస్థలైన సీఎస్ఐఆర్, సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (సీఆర్ఆర్ఐ)తో కలిసి కొత్త టెక్నాలజీని అభివృద్ధి చేసింది. రహదారుల అభివృద్ధిలో స్టీల్ స్లాగ్ అగ్రిగేట్స్‌ను ఉపయోగించే విధంగా ఈ టెక్నాలజీని రూపొందించారు. ఏఎంఎన్ఎస్ ఆకార్ పేరుతో ఈ స్టీల్ స్లాగ్‌ను ఉత్పత్తి చేయనుంది.
- ఎస్‌బీఐ కార్డ్, ఫోన్‌పే.. కో-బ్రాండెడ్ క్రెడిట్ కార్డును తీసుకువచ్చాయి. ఫోన్‌పే ఎస్‌బీఐ కార్డ్ పర్పుల్, సెలెక్ట్ బ్లాక్ పేరుతో ఈ క్రెడిట్ కార్డులు అందుబాటులో ఉండనున్నాయి. ఫోన్‌పే యాప్ ద్వారా చేసిన ప్రతి ఖర్చుపై 10 శాతం వాల్యూ బ్యాక్‌తో పాటు రివార్డ్ పాయింట్లను ఎస్‌బీఐ కార్డ్ అందించనుంది.

హరిద్వార్ మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట

» ఆరుగురి మృతి.. 28 మందికి గాయాలు

» విద్యుత్తు వైరు తెగిపడిందన్న వదంతులతో ఘటన




హరిద్వార్, జూలై 27: ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మృత్యువాత పడగా.. 28 మంది గాయాలపాలయ్యారు. కొండపైన ఉన్న మానసాదేవి అమ్మవారి దర్శనం కోసం ఆదివారం భక్తులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. అదేసమయంలో విద్యుత్తు వైరు తెగి పడిందన్న వదంతులు వ్యాపించడంతో భక్తులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. 500 అడుగులకు పైగా ఎత్తయిన కొండపైకి వెళ్లే మెట్ల మార్గంలో విద్యుత్తు వైరు తెగి పడిందన్న ఊహాగానాలతో ఉదయం 9 గంటల సమయంలో ఒక్కసారిగా భక్తులు పరుగులు తీశారు. మెట్లపై పెద్ద సంఖ్యలో భక్తులు ఉండడంతో తొక్కిసలాటకు దారితీసింది. ఈ ఘటనలో 34 మంది గాయపడడంతో ఆస్పత్రికి తరలించినట్లు హరిద్వార్ సీనియర్ ఎస్పీ ప్రేమేంద్ర సింగ్ తెలిపారు. వారిలో ఆరుగురు మరణించారన్నారు. మృతులను ఆరుష్ (12), శకల్‌దేవ్ (18), విక్కీ (18), విపిన్ (18), వకీల్, శాంతిగా గుర్తించినట్లు చెప్పారు. 28 మంది చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఈ ఘటనపై న్యాయ విచారణకు ఆదేశించారు. ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. తొక్కిసలాటలో ఆరుగురు మృతి చెందడంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

63 జిల్లాల్లో 50% పైగా చిన్నారుల్లో ఎదుగుదల లోపం

న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపం ఆందోళనకరంగా ఉంది. 13 రాష్ట్రాలు, యూటీల్లోని 63 జిల్లాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారుల్లో 50 శాతానికి పైగా ఎదుగుదల లోపంలో బాధపడుతున్నారని పార్లమెంట్‌లో సమర్పించిన పలు పత్రాల డేటా వెల్లడించింది. 199 జిల్లాల్లో ఇది 30 నుంచి 40 శాతం మధ్య ఉందని పేర్కొంది. పిల్లలు చాలా కాలం పాటు తగిన పోషకాహారం తీసుకోనప్పుడు సంభవించే దీర్ఘకాలిక పోషకాహార లోపాన్నే ఎదుగుదల లోపం (స్టంటింగ్) అంటారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖకు చెందిన పోషన్ ట్రాకర్- 2025 జూన్ ఆధారిత డేటా ప్రకారం.. కొన్ని జిల్లాల్లో అత్యధిక సంఖ్య చిన్నారుల్లో ఎదుగుదల లోపం ఉంది.





ఒబామాను కారులో వెంటాడుతూ!

» పోలీసులతో కలిసి చేజింగ్ చేస్తున్నట్టుగా మీమ్ ఫొటో పోస్టు చేసిన ట్రంప్

వాషింగ్టన్, జూలై 27: అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఓ తెలుపు రంగు ఫోర్డ్ బ్రాంకో కారులో దూసుకెళ్తున్నారు.. ఆయనను పట్టుకునేందుకు ప్రస్తుత అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, పోలీసులు కార్లలో చేజ్ చేస్తున్నారు..! ఒబామాను టార్గెట్ చేస్తూ ట్రంప్ పోస్టు చేసిన తాజా మీమ్ ఫొటో ఇది. అమెరికాలో తన మాజీ భార్యను, మరొకరిని హత్య చేసిన కేసులో నిందితుడైన ప్రఖ్యాత ఫుట్‌బాల్ క్రీడాకారుడు, హాలీవుడ్ నటుడు ఓజే సింప్సన్.. ఫోర్డ్ బ్రాంకో కారులో పారిపోతుండగా పోలీసులు వెంటాడి పట్టుకున్నారు. 1994 జూన్17న సుదీర్ఘంగాసాగిన ఆ చేజింగ్ దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. ఇప్పుడా దృశ్యాన్ని వినియోగించి రూపొందించిన మీమ్‌ను ట్రంప్ పోస్టు చేశారు. ఇంతకుముందు అమెరికా అధ్యక్ష కార్యాలయంలో ట్రంప్, ఒబామా కూర్చుని మాట్లాడుతుంటే.. పోలీసులు వచ్చి ఒబామాను అరెస్టుచేసి జైలులో పెట్టినట్టుగా ఉన్న ఏఐ వీడియోను ట్రంప్ పోస్టు చేశారు. త్వరలో ఒబామాను అరెస్టు చేసే అవకాశం ఉందని, ట్రంప్ పోస్టులు అదే విషయం చెబుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఎన్నికైన 2016లో రష్యా సహకారం తీసుకున్నారనే ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో ఒబామా, ఆయన యంత్రాంగమే ఈ తప్పుడు ప్రచారానికి పాల్పడ్డారని, దీనికి ఆధారాలున్నాయని ఇటీవల అమెరికా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్ తులసి గబ్బార్డ్ ప్రకటించారు.

అమెరికా వీసా ఆలస్యం..

» వేలాది భారత విద్యార్థులపై ప్రభావం

న్యూఢిల్లీ, జూలై 27: ఇటీవల వీసా ఇంటర్వ్యూలపై అమెరికా నిషేధం ఎత్తివేసినప్పటికీ.. వీసా ప్రాసెసింగ్‌లో అసాధారణ జాప్యం జరుగుతోంది. ఈ క్రమంలో అమెరికా విశ్వవిద్యాలయాల్లో కొత్తగా ప్రవేశం పొందిన చాలామంది విద్యార్థులు సకాలంలో అక్కడ అడ్మిషన్ పొందే అవకాశాలు కనిపించడంలేదు. వీసా ప్రాసెసింగ్‌లో ఆలస్యం, వీసా తిరస్కరణల కారణంగా గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం రాబోయే సెమిస్టర్‌లో చేరే భారత విద్యార్థుల సంఖ్య 70-80శాతం తగ్గొచ్చని కన్సల్టెన్సీ నిపుణులు చెబుతున్నారు. ఈ సీజన్ సెమిస్టర్ సెప్టెంబరులో, మరికొన్ని చోట్ల ఆగస్టు చివరివారంలో మొదలవుతుంది. దీనికోసం విద్యార్థులు ఆగస్టులోనే అమెరికా చేరుకుంటారు. కొత్త మార్గదర్శకాల ప్రకారం కాన్సులర్ అధికారులు విద్యార్థి, సందర్శకుల వీసా దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని అమెరికా ఎంబసీ ప్రతినిధి తెలిపారు. 'దరఖాస్తుదారుడు అమెరికా చట్టాల ప్రకారం వీసా పొందేందుకు అర్హుడని నిర్ధారించే కాన్సులర్ అధికారి సంతృప్తి చెందేవరకు మేం వీసా జారీ చేయం. అందుకే ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది' అని పేర్కొన్నారు.

గాజాలో మానవతా సాయానికి ఇజ్రాయెల్ ఓకే

గాజా, టెల్ అవీవ్, జూలై 27: ప్రపంచ దేశాల నుంచి పెరుగుతున్న ఒత్తిడితో గాజాలో ఇజ్రాయెల్ మానవతా సాయం అందించడానికి అడ్డంకులు కొంతమేర తొలగించింది. మళ్లీ ప్రకటించే వరకు రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు గాజాతోపాటు అల్ మవాసి, డెయిర్ అల్‌బలా ప్రాంతాల్లో సైనిక చర్యలు చేపట్టబోమని ప్రకటించింది. ఇజ్రాయెల్ జరిపిన తాజా దాడుల్లో 53 మంది మృతిచెందారని గాజా ఆరోగ్య శాఖ పేర్కొంది. కాగా హమాస్ మాజీ చీఫ్ యహ్యా సిన్వర్ హతమవడంతో ఆయన భార్య సమర్ ముహమ్మద్ అబూ జమర్ గాజా నుంచి తుర్కియేకు పారిపోయి మరో వివాహం చేసుకున్నట్టు ఇజ్రాయెల్ వార్తా సంస్థ వైనెట్ తెలిపింది. గతేడాది అక్టోబరు 16న ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో సిన్వర్ ప్రాణాలు కోల్పోవడంతో జమర్ ఫోర్జరీ పాస్‌పోర్టులతో పిల్లలతోసహా తుర్కియేకు పారిపోయారు.

ఎస్ఐఆర్‌ను తక్షణమే ఆపండి: ఇండీ కూటమి

న్యూఢిల్లీ, జూలై 27: బిహార్‌లో ఎన్నికల కమిషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)పై ప్రతిపక్ష ఇండీ కూటమి విరుచుకుపడింది. అస్పష్టత, లోపభూయిష్ఠ డేటాతో ఓట్ల తొలగింపు ప్రక్రియ చేపట్టారని మండిపడింది. మరణాలు, వలసలు ఇతర కారణాల వల్ల 63 లక్షలకు పైగా ఓటర్లు నిర్దేశిత చిరునామాలో లేరంటూ ఈసీ తెల్పిన డేటాను ప్రస్తావిస్తూ.. తక్షణమే ఈ ప్రక్రియను నిలిపేయాలంటూ డిమాండ్ చేసింది. ఈ సమస్య కేవలం ఇండీ కూటమి ఓటర్ల వరకే పరిమితం కాదని.. ఎన్డీయే మిత్రపక్షాలు కూడా ప్రభావితమవుతాయన్నది గుర్తుంచుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియ ముగిసేనాటికి దాదాపు 2 కోట్ల మంది ఓటు హక్కును కోల్పోతారని హెచ్చరించింది.

కాంగో చర్చిపై దాడి.. 34 మంది మృతి

కిన్షాసా, జూలై 27: ఆఫ్రికా దేశమైన కాంగోలో ఇస్లామిక్ స్టేట్ అనుకూల తిరుగుబాటుదారులు రెచ్చిపోయారు. తూర్పు కాంగోలోని ఓ క్యాథలిక్ చర్చిలో అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో కాల్పులకు తెగబడ్డారు. ఇస్లామిక్ స్టేట్ మద్దతు గల అలైడ్ డెమొక్రటిక్ ఫోర్స్ (ఏడీఎఫ్)కు చెందిన సాయుధ తిరుగుబాటుదారులు చర్చి లోపల, వెలుపల విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. చర్చి ఆవరణలోని పలు ఇళ్లు, దుకాణాలను దహనం చేశారు. ఈ దాడుల్లో 34 మంది వరకు చనిపోయారని ఓ సామాజిక కార్యకర్త మీడియాకు వెల్లడించారు.

'టెంపుల్ వార్' విరమణకు సిద్ధం!

» నేడు మలేషియాలో థాయ్, కాంబోడియా నేతల చర్చలు

బ్యాంకాక్, జూలై 27: పురాతన శివాలయాలు ఉన్న ప్రాంతం కోసం మొదలుపెట్టిన యుద్ధాన్ని విరమించేందుకు థాయ్‌లాండ్, కాంబోడియా సిద్ధమయ్యాయి. మలేషియాలో ఇరు దేశాల ప్రతినిధులు సోమవారం చర్చలు జరపనున్నారు. ఆదివారం తెల్లవారుజామునే థాయ్, కాంబోడియా ప్రధానులతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడారు. యుద్ధం ఆపకపోతే వాణిజ్య ఒప్పందాలు జరపబోమని స్పష్టం చేశానని, దీంతో ఆ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించాయని ప్రకటించారు. అయినా ఇరుదేశాల మధ్య సరిహద్దుల వెంట పరస్పర దాడులు కొనసాగాయి. కానీ మలేషియా మధ్యవర్తిత్వంతో చర్చలకు సిద్ధమయ్యాయి. థాయ్‌లాండ్, కాంబోడియా సరిహద్దుల్లో ఉన్న పురాతన 'టా మ్యుయెన్' శివాలయాల సమూహం, ప్రీహ్ విహార్ ఆలయ ప్రాంతం విషయంలో ఇరుదేశాల మధ్య ఈ నెల 24న యుద్ధం మొదలైన విషయం తెలిసిందే.

ఉగ్రవాదులకు ఎక్కడా సురక్షిత చోటు లేదు

ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.. దేశవ్యాప్తంగా కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది

» చోళుల కాలం స్వర్ణయుగం

» ప్రజాస్వామ్య పాలన వారిదే: మోదీ



బృహదీశ్వరాలయంలోకి గంగాతీర్థమున్న కలశాన్ని చేతపట్టుకుని వెళ్తున్న ప్రధాని మోదీ

చెన్నై, జూలై 27 (ఆంధ్రజ్యోతి): "మన సార్వభౌమాధికారంపై దాడి జరిగితే భారత్ ఎలా స్పందిస్తుందో ఆపరేషన్ సిందూర్ ఈ ప్రపంచానికి చూపింది. దేశవ్యాప్తంగా కొత్త మేల్కొలుపు, కొత్త ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. భారత్‌ను లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాదులు, శత్రువులకు ఎక్కడా సురక్షితమైన చోటు లేదని నిరూపించింది" అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ఆదివారం ఆయన అరియలూరు జిల్లా గంగైకొండ చోళపురంలోని బృహదీశ్వరాలయ ప్రాంగణంలో నిర్వహించిన మొదటి రాజేంద్ర చోళుడి ఆడి తిరువాదిరై (ఆషాఢ ఆరుద్ర) జయంత్యుత్సవాలు, బృహదీశ్వరాలయ శంకుస్థాపన సహస్ర వార్షికోత్సవాలు, రాజేంద్రచోళుడు ఆగ్నేయాసియా దేశాలపై జరిపిన దండయాత్ర సహస్ర వార్షికోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. చోళులు సైనిక సంపత్తిలో కొత్త పద్ధతులు, కొత్త రకం ఆయుధాలను ఉపయోగించేవారని, ఆ రీతిలోనే ప్రస్తుతం తమ ప్రభుత్వం కూడా ఆయుధాలను స్వయంగా తయారుచేసి శత్రువులను మట్టుబెట్టేందుకు ఉపయోగిస్తుందని చెప్పారు. చోళ చక్రవర్తుల పరిపాలన భారతదేశపు స్వర్ణయుగాలలో ఒకటని, ప్రజాస్వామ్యానికి జన్మనిచ్చింది చోళ రాజులేనని అన్నారు. ప్రజాస్వామ్యం అంటేనే బ్రిటన్ మాగ్నా కార్టా గురించి మాట్లాడుతుంటారని, వాస్తవానికి అంతకుముందే చోళసామ్రాజ్యంలో 'కుడవోలై' పద్ధతి (కుండలో అభ్యర్థుల పేర్లున్న తాటి ఆకుల్లో ఒకదాన్ని తీయడం)లో ప్రజాస్వామ్యం వెల్లివిరిసిందని చెప్పారు. బృహదీశ్వరుడి పాదాల వద్ద కూర్చునే భాగ్యం తనకు లభించిందని, ఆ సందర్భంగా 140 కోట్ల మంది భారతీయుల సంక్షేమం కోసం, దేశ పురోగతి కోసం ప్రార్థించానని చెప్పారు. ఇతర దేశాల నుంచి బంగారం, వెండి తీసుకొచ్చిన చాలామంది రాజులు గురించి మనకు తెలుసని, అయితే రాజేంద్రచోళుడు మాత్రం గంగాజలాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. బృహదీశ్వరాలయ సందర్శనకు వచ్చిన తాను కూడా కాశీ నుంచి గంగా జలాన్ని ఆవుడయార్ (పరమేశ్వరుడికి)కు సమర్పించేందుకు తీసుకురావడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన చెప్పారు. కాగా, రాజేంద్ర చోళుడిని భావి తరాలవారు స్మరించుకునే ఆ చక్రవర్తి రూపం ఉన్న ప్రత్యేక నాణేన్ని ప్రధాని మోదీ ఆవిష్కరించారు.

విజయవాడలో నీటి నిర్వహణ పద్ధతులు భేష్

» స్వచ్ఛ భారత్ మిషన్ ఒక సామూహిక ఉద్యమం

» మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): విజయవాడలో నీటి నిర్వహణ పద్ధతులు భేష్ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. 'మన్ కీ బాత్' 124వ ఎపిసోడ్‌లో భాగంగా ఆదివారం ఆయన తన అభిప్రాయాలను దేశ ప్రజలతో పంచుకున్నారు. విజయవాడ, కరాడ్‌లో నీటి నిర్వహణ కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అనేక వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నాయని తెలిపారు. కలిసి పనిచేస్తే అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయొచ్చని స్వచ్ఛ భారత్ నిరూపించిందని చెప్పారు. ఈ మిషన్ త్వరలోనే 11 సంవత్సరాలు పూర్తి చేసుకుంటుందని, ఇదొక సామూహిక ఉద్యమంలా సాగిందన్నారు. ప్రతి సంవత్సరం నిర్వహించే స్వచ్ఛ సర్వేక్షణ్‌తో అద్భుతమైన ఫలితాలు సాధించామని చెప్పారు. ఈ సంవత్సరం దేశంలోని 4,500కి పైగా నగరాలు, పట్టణాలు దీనిలో చేరాయని, 15కోట్లకు పైగా ప్రజలు భాగస్వాములయ్యారని వివరించారు. ఇది స్వచ్ఛ భారత్ స్వరంగా ప్రధాని పేర్కొన్నారు. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవమని, దానిని ఎలా జరుపుకోబోతున్నారు? ఏవైనా కొత్త ఆలోచనలు ఉన్నాయా? అనే విషయాలను నమో యాప్ ద్వారా తనకు సందేశాలు పంపాలని దేశ ప్రజలకు మోదీ పిలుపునిచ్చారు.

నేడు పార్లమెంటులో హోరాహోరీ!

» పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్ అంశాలపై చర్చ

» పలు ప్రశ్నలు సంధించేందుకు సిద్ధమవుతున్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్ర దాడి, ఆపరేషన్ సిందూర్ అంశాలపై సోమవారం పార్లమెంటులో అధికార, ప్రతిపక్షాల మధ్య వాగ్యుద్ధం ప్రారంభం కానున్నది. ఈ అంశాలపై పలు ప్రశ్నలు లేవనెత్తేందుకు ప్రతిపక్షాలు సిద్ధమవుతున్న నేపథ్యంలో మోదీ సేన వారిని ఎలా ఎదుర్కొంటుందన్న విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. జూలై 21న ప్రారంభమైన పార్లమెంటు వర్షాకాల సమావేశాలను వరుసగా 5 రోజుల పాటు స్తంభింపచేసిన ప్రతిపక్షాలు.. ఈ అంశాలపై ప్రభు త్వం చర్చకు సమయం కేటాయించిన తర్వాతే శాంతించాయి. సోమవారం లోక్‌సభలో 16 గంటల పాటు చర్చ నిర్వహించాలని, అది ముగిసిన వెంట నే రాజ్యసభలోనూ 16 గంటల పాటు చర్చించాలని శుక్రవారం పార్లమెంటరీవ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు నేతృత్వంలో జరిగిన అఖిల పక్ష భేటీలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. సమావేశాల ప్రారంభానికి ముందు రాహుల్ గాంధీ నేతృత్వంలో ఇండి కూటమి నేతలు సమావేశమై చర్చను ఎలా ఎక్కుపెట్టాలో వ్యూహరచన చేయనున్నారు. ప్రధానంగా జాతీయ భద్రత, విదేశీ విధానం అంశాలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయని కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. కాగా, సోమవారం నుంచి బుధవారం వరకు లోక్‌సభ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలని కాంగ్రెస్ తన ఎంపీలకు విప్ జారీ చేసింది.

టేకాఫ్ అవుతుండగా విమానం టైరు నుంచి మంటలు

» అత్యవసర ద్వారం నుంచి బయటపడిన ప్రయాణికులు, సిబ్బంది

» అమెరికాలోని డెన్వర్‌లో ఘటన



డెన్వర్, జూలై 27 : అమెరికాలోని డెన్వర్ విమానాశ్రయం నుంచి అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం ఒకటి శనివారం టేకాఫ్ అవుతుండగా టైరు నుంచి మంటలు రావడంతో రన్‌వేపైనే నిలిచిపోయింది. అందులోని 173 మంది ప్రయాణికులు, సిబ్బంది అత్యవసర ద్వారం నుంచి బయటపడ్డారు. లాండింగ్ గేర్ సరిగ్గా పనిచేయక టైరు నుంచి మంటలు, పొగ వచ్చాయి. దీంతో ప్రయాణికులను అత్యవసర ద్వారం నుంచి సురక్షితంగా దింపినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఒక వ్యక్తికి మాత్రం స్వల్ప గాయాలైనట్లు పేర్కొన్నారు. మయామి బయలుదేరిన బోయింగ్ 737 మాక్స్8 విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో ఆందోళనకు గురైన ప్రయాణికులు అత్యవసరం ద్వారం నుంచి జారి బయటపడుతుండగా.. టైరు నుంచి మంటలు, భారీగా పొగ రావడం వీడియోల్లో కనిపించింది. విమానం ఉన్న చోటును పొగ కమ్మేసింది. ఈ ఘటనపై విచారణ జరపనున్నట్లు అమెరికాకు చెందిన ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ ప్రకటించింది. విమానం నుంచి వచ్చిన మంటలను అదుపు చేసినట్లు డెన్వర్ అగ్నిమాపక విభాగం పేర్కొంది. నిర్వహణ సమస్యతో విమానం టైరు నుంచి మంటలు వచ్చినట్లు అమెరికన్ ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. కాగా డెన్వర్‌లో ఇది రెండో ఘటన.

టీసీఎస్‌లో 12 వేల ఉద్యోగాల కోత!

2025-26 ఆర్థిక సంవత్సరంలో 2 శాతం సిబ్బందిని తొలగించనున్నట్టు ఆ సంస్థ వెల్లడి

» మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగులపై ప్రభావం



న్యూఢిల్లీ, జూలై 27: దేశంలోనే అతి పెద్ద ఐటీ సేవల ఎగుమతి సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' (టీసీఎస్).. భారీస్థాయిలో ఉద్యోగాల ఊచకోతకు సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తన సిబ్బందిని 2 శాతం మేర తగ్గించుకోనున్నట్టు ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపింది. ఆ సంస్థ వర్క్‌ఫోర్స్‌లో 2% అంటే.. 12,200 మందికి పైగానే (మొత్తం ఉద్యోగుల సంఖ్య 6,13,069)!! ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, కృత్రిమ మేధ కారణంగా సాంకేతిక పరిజ్ఞానాలు మారుతున్న నేపథ్యంలో వ్యాపార గిరాకీ తగ్గిపోతుండడంతో ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకుంది. "టీసీఎస్.. భవిష్యత్తు పరిణామాలకు సిద్ధంగా ఉండే సంస్థగా మారే ప్రయాణంలో ఉంది. ఆ ప్రయాణంలో భాగంగా.. సంస్థకు ఉపయోగపడని ఉద్యోగులను ఏడాది వ్యవధిలో తొలగిస్తాం. ఈ ప్రభావం మా అంతర్జాతీయ సిబ్బందిలో 2% మందిపై.. ముఖ్యంగా మధ్య స్థాయి, సీనియర్ గ్రేడ్ ఉద్యోగులపై పడుతుంది" అని ఆ సంస్థ తన ప్రకటనలో వివరించింది. టీసీఎస్ సేవలను పొందేవారికి ఎలాంటి ఇబ్బందీ కలగకుండా, తమ సేవలపై ఎలాంటి ప్రభావం పడకుండా.. ఉద్యోగాల కోతకు ప్రణాళికలు రచించినట్టు వెల్లడించింది. ఉద్యోగాలు కోల్పోయే తమ సిబ్బందికి ఇది కష్టకాలమేనన్న సంగతి తమకు తెలుసునని.. వారి సేవలకు కృతజ్ఞతలు తెలుపుతూనే కొత్త ఉద్యోగాలు వెతుక్కునేందుకు అన్ని రకాలుగా సాయం చేస్తామని టీసీఎస్ పేర్కొంది. ఈ డ్రైవ్‌లో భాగంగా ఉద్యోగాలు కోల్పోయేవారికి వారి నోటీసు కాలానికి సంబంధించిన జీతాలు చెల్లించడమే కాక.. కోత ప్యాకేజీ కింద మరికొంత అదనంగా ఇస్తామని తెలిపింది. వారికి బీమా ప్రయోజనాలను కూడా పొడిగించే అవకాశాలను పరిశీలిస్తామని.. 'ఔట్‌ప్లేస్‌మెంట్ ఆపర్చునిటీస్ (అంటే కొత్త ఉద్యోగం పొందడానికి వీలుగా రెజ్యూమ్ తయారు చేసుకోవడంలో, ఇంటర్వ్యూలను ఎదుర్కోవడం, కౌన్సెలింగ్ వంటి సహాయాలు)' అందిస్తామని వెల్లడించింది. టీసీఎస్ సంస్థ ఇటీవలే తన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ'ని సవరిస్తూ తీసుకున్న నిర్ణయంపై కొందరు ఉద్యోగులు లీగల్ కంప్లైంట్లు దాఖలు చేసిన కొద్దిరోజులకే ఆ సంస్థ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సవరించిన 'ఎంప్లాయ్‌మెంట్ బెంచ్ పాలసీ' ప్రకారం.. టీసీఎస్‌లో పనిచేసే ఉద్యోగులు ఏడాదికి గరిష్ఠంగా 35 రోజులు మాత్రమే బెంచ్‌పై (ఏ ప్రాజెక్టులోనూ లేని సమయం) ఉండాలి. అలాగే.. ఏటా కనీసం 225 రోజుల 'బిల్లబుల్ డేస్ (అంటే డబ్బులు వచ్చే ప్రాజెక్టుపై) పనిచేయాలి. అలా లేనివారిపై చర్యలు తీసుకునే విధంగా కొత్త విధానం ఉంది. కాగా.. టీసీఎస్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేవలం ఖర్చులను తగ్గించుకోవడానికి తీసుకున్న నిర్ణయంగా కాక, సంస్థ దిశ మార్పు (స్ట్రాటజిక్ షిఫ్ట్)గా చూడాలని నిపుణులు భావిస్తున్నారు. టీసీఎస్ సీఈవో కృతివాసన్ సైతం ఒక వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే విషయాన్ని వెల్లడించారు. ఏఐ వంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాల కారణంగా పనిచేసే తీరు మారుతోందని.. ఈ నేపథ్యంలో తాము భవిష్యత్తుకు సిద్ధంగా, వేగంగా స్పందించగలిగేలా ఉండాలని ఆయన వివరించారు.

జీఎస్ఎల్వీ-ఎఫ్16 రిహార్సల్ విజయవంతం

» 30న నిసార్ ఉపగ్రహంతో రోదసీలోకి

» నేడు ఎంఆర్ఆర్ భేటీ.. రేపు కౌంట్‌డౌన్

సూళ్లూరుపేట, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇస్రో-నాసా సంయుక్తంగా చేపడుతున్న నిసార్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5:40 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ద్వారా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ సన్నాహకాల్లో భాగంగా ఆదివారం రాకెట్ రిహార్సల్‌ను శాస్త్రవేత్తలు విజయవంతంగా నిర్వహించారు. రాకెట్‌ను మొబైల్ సర్వీస్ టవర్ నుంచి ముందుకు తీసుకొచ్చి మళ్లీ వెనక్కి తీసుకెళ్లే ప్రయోగ ప్రక్రియను శాస్త్రవేత్తలు నిర్వహించారు. రాకెట్‌లోని అన్ని దశల పనితీరును పరిశీలించి తుది దశ తనిఖీలు చేశారు. ప్రయోగానికి సంబంధించి రాకెట్ సంసిద్ధత (ఎంఆర్ఆర్) సమావేశం సోమవారం షార్‌లో జరగనుంది. ఎంఆర్ఆర్ అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు (లాబ్) సమావేశమవుతుంది. ఆ తర్వాత కౌంట్‌డౌన్ సమయాన్ని శాస్త్రవేత్తలు అధికారికంగా ప్రకటిస్తారు. కౌంట్‌డౌన్ 24 గంటలు లేదా 25:30 గంటలకు ముందు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇది నాసా-ఇస్రో ఉమ్మడి ప్రాజెక్టు కావడంతో అమెరికా శాస్త్రవేత్తలు కూడా షార్‌కు రానున్నారు.

రానిటిడిన్‌తో క్యాన్సర్ భయం

» ఎసిడిటీ మందుపై కేంద్రం విచారణ.. ఆ మందులో ప్రమాదకర ఎన్‌డీఎంఏ

న్యూఢిల్లీ, జూలై 27: ఎసిడిటీ చికిత్సకు ఉపయోగించే ఔషధం రానిటిడిన్‌తో క్యాన్సర్ ముప్పు పొంచి ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ ఔషధంలోని నైట్రోసోడైమెథైలమైన్(ఎన్‌డీఎంఏ) అనే ప్రమాదకరమైన క్యాన్సర్ కారకం(కార్సినోజెన్) ఉన్నట్లు తేలింది. దీంతో.. తమ పరిధిలో తయారయ్యే రానిటిడిన్‌లో ఎన్‌డీఎంఏ స్థాయిలను గమనించాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ(సీడీఎస్‌సీవో), అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఔషధ నియంత్రణ డైరెక్టర్ జనరళ్లకు ఆదేశాలు జారీ చేసింది. డ్రగ్స్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా(డీసీజీఐ) డాక్టర్ రాజీవ్ సింగ్ రఘువంశీ సూచనతో.. డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డు(డీటీఏబీ) సిఫార్సుల ఆధారంగా రానిటిడిన్‌లో క్యాన్సర్ కారకాలున్నట్లు గుర్తించినట్లు పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్ 28న జరిగిన డీటీఏబీ 92వ వార్షిక సమావేశంలో రానిటిడిన్‌లోని ఎన్‌డీఎంఏ ఆనవాళ్లపై ప్రత్యేక నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను సమీక్షించాక.. ఆ ఔషధాన్ని స్టోరేజీ చేయడానికి విధించిన షరతులే ఎన్‌డీఎంఏకు కారణమవుతున్నాయా? అనే కోణంలో లోతుగా అధ్యయనం చేయడానికి కమిటీని నియమించాలని డీటీఏబీ సూచించింది. ఈ ఔషధాన్ని దీర్ఘకాలికంగా వినియోగిస్తే కలిగే దుష్ప్రభావాలపై అధ్యయనం చేయాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చ్(ఐసీఎంఆర్)ను కోరింది. కాగా.. రానిటిడిన్‌కు ప్రత్యామ్నాయంగా ఫామొటిడిన్, పాంటోప్రాజోల్ ఉన్నాయని, ఇవి సురక్షితమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రత్యామ్నాయాలున్న నేపథ్యంలో ఎన్‌డీఎంఏ ఉండే రానిటిడిన్‌ను వినియోగించకూడదని సూచిస్తున్నారు. న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చెందిన ఆంకాలజిస్టు డాక్టర్ అభిషేక్ శంకర్ కూడా భద్రతాపరమైన ప్రత్యామ్నాయాలున్నప్పుడు రానిటిడిన్‌ను వాడకూడదని అభిప్రాయపడ్డారు. అమెరికా సహా.. చాలా దేశాలు ఎన్‌డీఎంఏ మోతాదులు ఎక్కువగా ఉన్న కారణంగా.. రానిటిడిన్‌ను మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. మ్యాక్స్-ద్వారక ఆస్పత్రికి చెందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్టు డాక్టర్ లోహిత్ చౌహాన్ మాట్లాడుతూ.. నగరాల్లో రానిటిడిన్ వాడకం బాగా తగ్గిందని, అయితే.. ద్వితీయ/తృతీయ శ్రేణి నగరాలు, పట్టణాల్లో మాత్రం దీని వినియోగం కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

మహిళా స్కీమ్ సొమ్ము తినేస్తున్న మగాళ్లు!

మహారాష్ట్రలో 'లడ్కీ బహిన్' కుంభకోణం

ముంబై, జూలై 27: మహారాష్ట్రలో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 'లడ్కీ బహిన్ యోజన' పథకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఈ స్కీమ్ కింద మహిళలు లబ్ధి పొందాల్సి ఉండగా.. దాదాపు 14 వేల మందికి పైగా పురుషులు మోసపూరితంగా డబ్బులు కాజేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వ్యవస్థను తప్పుదోవ పట్టించి, మహిళలుగా పేర్లను నమోదు చేసుకొని, 'లడ్కీ బహిన్ యోజన' కింద లబ్ధి పొందారు. 14,298 మంది పురుషులకు రూ.21.44 కోట్ల మేర అందినట్లు మహిళా, శిశు అభివృద్ధి శాఖ (డబ్ల్యూసీడీ) ఆడిట్‌లో వెల్లడైంది. పథకాన్ని ప్రారంభించిన దాదాపు 10 నెలల తర్వాత ఈ ఘరానా మోసం బయటపడడం గమనార్హం. ఈ వ్యవహారంపై డిప్యూటీ సీఎం అజిత్ పవార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు లడ్కీ బహిన్ స్కీమ్‌ను ప్రారంభించామన్నారు. తప్పుడు మార్గంలో లబ్ధి పొందిన పురుషుల నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తామని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. మరికొన్ని విధాలుగా ఈ పథకంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆడిట్‌లో తేలింది. పెద్ద సంఖ్యలో అనర్హుల నమోదు కారణంగా రూ.1,640 కోట్ల నష్టం జరిగిందని డబ్ల్యూసీడీ అంచనా వేసింది. ఈ పథకాన్ని ఒక్కో కుటుంబంలో ఇద్దరికే పరిమితం చేయగా.. 7.97లక్షల మందికి పైగా మహిళలు తమ కుటుంబాల నుంచి మూడో సభ్యురాలిగా నమోదు చేసుకున్నారు. తద్వారా ప్రభుత్వానికి రూ.1,196కోట్ల నష్టం వాటిల్లింది. గరిష్ఠ వయసు పరిమితి 65 ఏళ్లు పెట్టగా.. 65 ఏళ్లు దాటిన 2.87 లక్షల మంది స్కీమ్ లబ్ధి పొందారు. దీని వల్ల రూ.431.7 కోట్ల నష్టం జరిగింది. స్కీమ్‌లో అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరపాలనే డిమాండ్లు వస్తున్నాయి.

ఎన్ఆర్ఐలే బ్రాండ్ అంబాసిడర్లు

రాష్ట్రాభివృద్ధిలో వీరంతా భాగస్వాములు కావాలి

ఏపీలో సింగపూర్ ఎఫ్‌డీఐలకు సహకరించండి: మంత్రి లోకేశ్



కార్యక్రమ వేదికపై మంత్రులు టీజీ భరత్, లోకేశ్, నారాయణ

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): 'ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ ఎంతలా నాశనమైందో మీకు తెలుసు. రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎంత కష్టపడుతుందో మీరంతా చూస్తున్నారు. చంద్రబాబు పట్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న నమ్మకమే మన పెట్టుబడి. మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను ప్రచారంగా చేసి పెట్టుబడులు రాబడదాం' అని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. సింగపూర్ ఓవిస్ ఆడిటోరియంలో ఏపీఎన్‌టీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశంలో ఆయన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. 'ఎన్నారైలే మా బ్రాండ్ అంబాసిడర్లు, రాష్ట్రాభివృద్ధిలో ఎన్ఆర్ఐలంతా భాగస్వాములు కావాలి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం మొత్తం 81.04 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వస్తే, అందులో సింగపూర్ నుంచే దాదాపు 14.94 బిలియన్ డాలర్లు వచ్చాయి. ఇది మొత్తం ఎఫ్‌డీఐలలో 19శాతం. ఈ పెట్టుబడుల్లో అధిక శాతం ఏపీకి వస్తే మన రాష్ట్రం మరో సింగపూర్ అవుతుంది. ఇక్కడ ఉద్యోగులుగా ఉన్న మీలో చాలామంది రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టి యజమానులుగా మారడానికి అనేక అవకాశాలు ఉన్నాయి' అని లోకేశ్ అన్నారు. 'సింగపూర్‌లో తెలుగువారి ఉత్సాహం సూపర్. ఎయిర్‌పోర్టులో ల్యాండ్ అయిన దగ్గర నుంచి తెలుగు ప్రవాసుల సమావేశం వరకు ఎక్కడ చూసినా తెలుగు వారే. నేను సింగపూర్‌లో ఉన్నానా? సింహాచలంలో ఉన్నానా? అని సందేహం వచ్చింది. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా తెలుగువారి ఆధిపత్యమే కనిపిస్తుంది. సింగపూర్‌ను శాసించేది కూడా తెలుగువారే. అందరూ మిమ్మల్ని ఎన్నారైలు అంటారు. కానీ నా మనస్సులో ఎప్పుడూ మీరు ఎంఆర్ఐలే. అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్ (అత్యంత విశ్వసనీయ భారతీయులు). సింగపూర్‌లో ఉన్నా, మలేసియాలో ఉన్నా.. మీ మనసంతా ఎప్పుడూ మన రాష్ట్రం పైనే ఉంటుంది. రాష్ట్రంపై మీకు ఎంత ప్రేమ ఉందో గత ఎన్నికల్లో చూశాను. రాష్ట్రంలో సైకో పాలన పోవాలని ప్రపంచంలో ఉన్న తెలుగువారంతా ఏకమయ్యారు. ఆయనను జైల్లో పెట్టిన 53 రోజులు వివిధ దేశాల్లో ఉన్న తెలుగువారు రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. రాష్ట్రాన్ని కాపాడుకోవటానికి మీరంతా సెలువులు పెట్టి మరీ రాష్ట్రానికి వచ్చి పనిచేశారు. కూటమి ప్రభుత్వం 44 శాతం ఓట్లతో 164 సీట్లు గెలవటంలో కీలక పాత్ర పోషించారు.

మన బ్రాండ్ సీబీఎన్

ప్రతి దేశానికి, ప్రతి వస్తువుకు ఒక బ్రాండ్ ఉంటుంది. సింగపూర్ అంటే అభివృద్ధి. ఏపీలో అభివృద్ధి అంటే సీబీఎన్. ఇది మన బ్రాండ్. సీబీఎన్ బ్రాండ్‌తో ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా పెట్టుబడులు వస్తాయి. బ్రాండ్ ఏపీ ప్రమోషన్ కోసం మేం ఇక్కడకు వచ్చాం. రాష్ట్రానికి పెట్టుబడులను సాధించే మా ప్రయత్నాలకు మీ సహకారం అవసరం. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు రోల్ మోడల్ సింగపూర్‌ని ఆదర్శంగా తీసుకుని నూతన పారిశ్రామిక విధానాలు అమలు చేస్తున్నాం. మానవ వనరులు, మౌలిక సదుపాయాలు ఉన్న మన రాష్ట్రానికి పెట్టుబడుల ప్రతిపాదనతో రండి. అనుమతులు తీసుకునివెళ్లండి. యువతకు ఉద్యోగాలు కల్పించండి. 20 లక్షల ఉద్యోగాల కల్పన.. ఇదే మన నినాదం... ఇదే మన విధానం. జీరో పావర్టీ లక్ష్యంగా చంద్రబాబు తలపెట్టిన పీ4కి ఎన్నారైల సహకారం కోరుతున్నాం. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్నదే చంద్రబాబు కోరిక. ఆరోగ్యవంతమైన సంపన్నవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం మనమంతా కలిసి పనిచేద్దాం. పీ4లో మార్గదర్శిగా చేరండి... పేద కుటుంబాలకు ఆసరాగా నిలవండి.

డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి!

ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. ఇందులో భాగంగానే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాం. రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కార్ నడుస్తోంది. కేంద్రంలో మోదీ, ఏపీలో చంద్రబాబు నేతృత్వంలో పనిచేస్తున్నాం. ఐదేళ్లలో నష్టపోయినదంతా వడ్డీతో సహా తీసుకొస్తాం. ఇతర దేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఎంఎస్ఎంఈ కంపెనీలను ప్రోత్సహిస్తున్నాం. టీసీఎస్‌లో 35 శాతం తెలుగు వారు పనిచేస్తున్నారు. అందుకే ఏపీకి వస్తున్నామని టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ చెప్పారు. మీరంతా సహకరిస్తే ఏపీని నంబర్ వన్‌గా తయారు చేస్తాం. అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు తీయిస్తాం. ఈ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు. సింగపూర్‌లో ఇంతమంది తెలుగువారు రావడం ఎప్పుడూ చూడలేదు. ఇక్కడ ఉన్నవారిలో ఒక ఎనర్జీ కనపడుతోంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న కసి మీలో ఉంది' లోకేష్ పేర్కొన్నారు.



తెలుగు డయాస్పోరా కార్యక్రమంలో చంద్రబాబు, లోకేశ్ చిత్రాలను ప్రదర్శిస్తున్న ప్రవాసాంధ్రులు

కూచిపూడి, కోలాటంతో స్వాగతం

తెలుగు ప్రవాసుల కార్యక్రమం ఐదుగంటలపాటు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. సీఎం సభాప్రాంగణానికి రాగానే సభకు హాజరైన వారంతా లేచి నిలబడి హర్షధ్వానాలు చేశారు. కార్యక్రమం ప్రారంభంలో 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన' చేశారు. సీఎం రావడానికి రెండు గంటల ముందే సమావేశ ప్రాంగణం మొత్తం నిండిపోయింది. మొత్తం 1,500 మంది కూర్చునే ఓవిస్ క్యాంపస్ ప్రాంగణం నిండిపోవడంతో పక్కనే ఉన్న మరో ప్రాంగణంలో కూడా కూర్చునే ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి భార్యాపిల్లలు, స్నేహితులతో ప్రవాసులు తరలివచ్చారు. కార్యక్రమం అనంతరం సుమారు 2,500 మందితో చంద్రబాబు ఫొటోలు దిగారు. రెండున్నర గంటలపాటు ఓపిగ్గా నిలబడి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించారు. మంత్రి లోకేశ్ వేదికపైనే ఉండి ప్రతి కుటుంబం సీఎంతో ఫొటోలు దిగేలా పర్యవేక్షించారు. పిల్లలతో వచ్చిన మహిళలను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సింగపూర్‌లో భారత్ హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రులు పి.నారాయణ, టీజీ భరత్ పాల్గొన్నారు. కార్యక్రమం ఆద్యంతం తెలుగుదనం ఉట్టిపడింది. అంతకుముందు ఆదివారం ఉదయాన్నే సింగపూర్ చేరుకున్న చంద్రబాబుకు స్థానిక తెలుగు ప్రజలు ఘనస్వాగతం పలికారు. సంప్రదాయ వస్త్రధారణలో తరలివచ్చిన తెలుగు కుటుంబాలు సీఎం, లోకేశ్‌కు హారతులిచ్చి.. నుదుట కుంకుమ దిద్ది ఆహ్వానించారు. కూచిపూడి నాట్యం, కోలాటాలతో స్వాగతించారు.

ప్రవాసులకు వెంకన్న ప్రత్యేక దర్శనం

తిరుమల బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం మన అదృష్టం. ఎన్ని కష్టాలున్నా వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో స్వామి ఆలయం ఉండాలి. సింగపూర్ నుంచి విజయవాడ, తిరుపతి, విశాఖకు నేరుగా విమానాలు వచ్చేలా చూస్తాను. ఈమేరకు కేంద్రంతో మాట్లాడతాను.

ద్వితీయ భాషగా తెలుగు

సింగపూర్‌లో మొత్తం నాలుగు అధికార భాషలు (మలయ్, ఆంగ్లం, మాండరిన్, తమిళం) ఉన్నాయి. ఇక్కడి స్కూళ్లలో హిందీ, పంజాబీని కూడా మాతృభాషగా బోధిస్తున్నారు. తెలుగును కూడా వాటిలో ద్వితీయ భాషగా ప్రవేశపెట్టాలి. ఈ మేరకు సింగపూర్ ప్రభుత్వాన్ని కోరేందుకు ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ చొరవ తీసుకోవాలి.

జన్మభూమిని మరవొద్దు

(మొదటి పేజీ తరువాయి)

మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పైన్స్, థాయ్‌లాండ్‌లలోని ప్రవాసాంధ్రులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రపంచంలో మారుతున్న పరిణామాలను తెలుగు ప్రజలు అందిపుచ్చుకున్నారని తెలిపారు. ఉమ్మడి ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వం తెచ్చిన సంస్కరణలు వారి జీవితాలను మార్చాయని.. దాని ఫలితమే నేడు 120కిపైగా దేశాల్లో తెలుగు ప్రజలు ఉన్నారని చెప్పారు. చాలా దేశాల్లో స్థానికుల కంటే ఎక్కువగా తెలుగువారు సంపాదిస్తున్నారని అన్నారు. అమెరికాలో ఉండే స్థానికుల కంటే మనవాళ్ల తలసరి ఆదాయం రెట్టింపు ఉందని చెప్పారు. సత్య నాదెళ్లలాంటి వాళ్లు మైక్రోసాఫ్ట్ వంటి ప్రముఖ కంపెనీలకు సీఈవోలుగా ఉన్నారని గుర్తుచేశారు. తాను ముఖ్యమంత్రిని కాకముందు ఉమ్మడి ఏపీలో ఇంజనీరింగ్ కాలేజీలు సింగిల్ డిజిట్‌లో ఉండేవని.. మూడేళ్లలో 300 ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటుచేశామని తెలిపారు. దీనిపై చాలా మంది విమర్శించారని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు బహుళ జాతి సంస్థల సీఈవోలుగా పనిచేస్తున్న ప్రవాస తెలుగు ప్రముఖుల నైపుణ్యాన్ని వినియోగించుకునేందుకు 'సీఎక్స్‌వో(చీఫ్ ఎక్స్‌పీరియన్స్ ఆఫీసర్) క్లబ్'ను ఆయన ప్రారంభించారు. సభలో ఇంకా ఏమన్నారంటే..


పుట్టినగడ్డను మరవొద్దు..

1991లో పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, దశ, దిశ రూపకల్పన చేసిన వ్యక్తి ఆయన. అదే సమయంలో ఇంటర్నెట్ విప్లవం మొదలైంది. ఈ పరిణామాలను గుర్తించి భవిష్యత్ అంతా ఐటీ, నాలెడ్జ్ ఎకానమీకి ఉంటుందని నమ్మాను. నాలెడ్జ్ ఎకానమీలో తెలుగు జాతి అగ్రగామిగా ఉండాలంటే ఐటీని ప్రమోట్ చేయాలని ఆలోచించాను. సింగపూర్‌లో వేల మంది తెలుగు ప్రజలు ఉన్నారంటే ఆనాటి టీడీపీ ప్రభుత్వం ఆలోచనలే కారణం. ఒకప్పుడు మహిళలకు విద్య, ఉద్యోగాలు ఎందుకనేవారు. నేను సీఎం అయిన తర్వాత విద్య, ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్ అమలు చేశాను. విదేశాల్లో స్థిరపడిన తెలుగువారు.. పుట్టిన గడ్డను మరువొద్దు. జన్మభూమిలో ఉన్న పేదలకు చేయూతనివ్వాలి. ఏపీ ప్రజలు కట్టిన పన్నులతో మీరు ఈ స్థాయికి ఎదిగారు. అవకాశాలు పొందారు. కాబట్టి జన్మభూమి అభివృద్ధికి కృషి చేయడం.. పెట్టుబడులు పెట్టడం అనేది బాధ్యతగా తీసుకోవాలి.

క్రమశిక్షణ కలిగిన దేశం..

ఒక మత్స్యకార గ్రామమైన సింగపూర్ నేడు ప్రపంచంలోనే గొప్ప దేశంగా ఎదిగింది. అందుకే ఈ దేశమంటే నాకు గౌరవం. నీతి నిజాయితీతో ఒక వ్యక్తి వేసిన పునాదితో గౌరవప్రదమైన దేశంగా ఎదిగింది. ఇక్కడ అవినీతి చాలా తక్కువ. గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు ఏపీ ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో ఆయన్ను తీసుకుని సింగపూర్ వచ్చాను. ఆయన సిగరెట్లు బాగా తాగేవారు. కానీ ఇక్కడ సిగరెట్లు తాగలేదు. ఎందుకని అడిగితే.. పొరపాటున సిగరెట్ తాగితే 500 డాలర్లు జరిమానా వేస్తారని చెప్పారు.





తెలుగు డయాస్పోరా కార్యక్రమానికి హాజరైన ప్రవాసాంధ్రులు, ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

అంతటి క్రమశిక్షణ ఉన్న దేశం సింగపూర్. ఈ దేశం చాలా కాలం క్రితమే చెత్తను ఎనర్జీగా మార్చే విధానం తీసుకొచ్చింది. ఇక్కడ రాత్రి అంతా రోడ్లను శుభ్రం చేస్తారు. తెల్లారితే రోడ్డుపై ఒక్క కాగితం ముక్క కూడా కనిపించదు. ఈ పరిస్థితిని చూసి ఉమ్మడి ఏపీలో హైదరాబాద్‌లో అమలు చేశాను. ఇప్పుడు ఏపీలో చెత్త సంపద కేంద్రాలు ఏర్పాటు చేశాం. సింగపూర్‌పై ఉన్న ఆ గౌరవంతోనే అమరావతిని సింగపూర్ మాదిరి చేస్తానని 2014 ఎన్నికలకు ముందు చెప్పా. చాలా మంది రాజకీయ నేతలు ఇక్కడకు వచ్చి ఎంజాయ్ చేసి వెళ్తారు. చంద్రబాబు మాత్రం ఇక్కడకు వచ్చి మనం చేసిన మంచి పనులను తెలుసుకుని వాళ్ల రాష్ట్రంలో అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ నా గురించి చెప్పారు. అలాంటి సింగపూర్‌లో 40 వేల మంది తెలుగువారు ఉన్నారంటే గర్వంగా ఉంది. అమరావతి మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ ప్రభుత్వం ఉచితంగా తయారుచేసి ఇచ్చింది. సీడ్ క్యాపిటల్‌లో సింగపూర్‌ను భాగస్వామిని చేస్తే ప్రపంచంలోని మంచి కంపెనీలను తీసుకొస్తారని భావించా. 2019 తర్వాత సింగపూర్ ప్రభుత్వాన్ని తప్పుబట్టే పరిస్థితి తెచ్చారు. పెట్టుబడులైతే తీసుకురాగలను కానీ ప్రభుత్వ బ్రాండ్ పోతే ఏపీ నష్టపోతుందని సింగపూర్ ప్రభుత్వానికి చెప్పా. గతంలో జరిగిన తప్పులు సరిదిద్దాలని ఇక్కడ పర్యటనకు వచ్చా. సింగపూర్ వాళ్లు తిరిగి రాష్ట్రానికి రాకపోవచ్చు. కానీ నాపై నైతిక బాధ్యత ఉంది. మీకు జరిగిన ఇబ్బందికి బాధపడుతున్నాను. దానిని సరిదిద్దడానికే వచ్చానని వారికి చెప్పాల్సిన బాధ్యత నాపై ఉంది.

> ● సంపద సృష్టిస్తేనే ప్రభుత్వానికి ఆదాయం.. ఇది జరిగితేనే సంక్షేమం చేయగలం. పీ-4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు 'నో పావర్టీ మిషన్' ప్రారంభించాను. మీమీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి.
>
> \- సీఎం చంద్రబాబు

ఏపీలో అపార అవకాశాలు..

గతంలో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. పోర్టులు ఎక్కువగా నిర్మించుకోవచ్చు. పోర్టు ఆధారిత పరిశ్రమలు పెద్ద ఎత్తున నెలకొల్పవచ్చు. దేశానికే లాజిస్టిక్స్ హబ్‌గా ఏపీ ఉంటుంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పెట్టుబడులు పెట్టేలా.. సర్వీస్ ప్రొవైడర్లుగా ఉండొచ్చు. మీరు ఏం చేయాలనుకున్నా.. పూర్తిగా సహకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుంది. ఆంధ్రలో పరిశ్రమలు స్థాపించేందుకు వీలుగా 'గ్లోబల్ ఎక్స్‌పోర్ట్-ఇంపోర్ట్ సెల్' ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం. వివిధ దేశాల్లోని పారిశ్రామికవేత్తలతో తెలుగు పారిశ్రామికవేత్తలను భాగస్వాములను చేసేందుకు ప్రయత్నిస్తాం. వారితో ఎంవోయూలు కుదుర్చుకునేలా చొరవ తీసుకుంటాం. విదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్లు పీ-4లో భాగస్వాములైతే అంతకు మించిన ఆనందం మరొకటి ఉండదు. ప్రవాసాంధ్రులు ఏటా రాష్ట్రానికి రూ.30 వేల కోట్ల వరకు పంపుతున్నారు. రాబోయే రోజుల్లో ఈ మొత్తం మరింత పెరుగుతుందని ఆశిస్తున్నాను.

వారి మేలు మరువను..

విదేశాల్లో ఉన్న తెలుగువారు 2024 ఎన్నికల్లో మా కోసం పనిచేశారు. చేయని తప్పునకు 53 రోజులు జైల్లో ఉన్నాను. దేశవిదేశాల్లో స్థిరపడిన తెలుగువారు నా కోసం పనులు వదిలిపెట్టి ఆందోళనలు చేశారు. నా గురించి వాళ్లు పడిన ఆందోళన, తపన ఎన్నటికీ మరచిపోలేను. ఎన్నికల్లో స్వచ్ఛందంగా వచ్చి పార్టీ కోసం పనిచేశారు. వారి రుణం తీర్చుకోలేను. దేశానికి సరైన నాయకుడిగా ప్రధాని మోదీ నాయకత్వం వహిస్తున్నారు. రైట్ టైం.. రైట్ ప్లేస్.. రైట్ లీడర్ మోదీ. ఆయన మనకు పెద్ద వరం. అమెరికాకు చెందిన ఓ సంస్థ చేసిన సర్వేలో ఆయన ప్రపంచంలోనే పాపులర్ లీడర్‌గా నంబర్ 1 స్థానంలో నిలిచారు. ప్రధానికి 75 శాతం అప్రూవల్ రేటింగ్ ఉంది. దేశానికి గుర్తింపు, సుస్థిరత ఆయన వల్లే వచ్చింది. ఇలాంటి సమయంలో ఆకాశమే హద్దుగా దూసుకెళ్లాలి.

నేడు సింగపూర్ ప్రతినిధులతో చంద్రబాబు భేటీ

సీఎం చంద్రబాబు రెండో రోజు సోమవారం సింగపూర్ ప్రభుత్వ ప్రతినిధులతో పాటు పలు ప్రైవేటు సంస్థల అధిపతులతోనూ సమావేశం కానున్నారు. నగరాల అభివృద్ధి, క్రీడలు, పోర్టు ఆధారిత పరిశ్రమలపై చర్చిస్తారు.

- ఉదయం 7 గంటలకు ట్రెజరీ బిల్డింగ్‌లో సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ టాన్ సీలెంగ్‌తో భేటీ. విద్యుత్, సైన్స్-టెక్నాలజీ, పారిశ్రామిక సహకారంపై చర్చలు.
- 8.30 గంటలకు ఎయిర్‌బస్ సంస్థ ప్రతినిధులు కృతీవాస్, వెంకట్‌తో భేటీ
- 9 గంటలకు హనీవెల్ సంస్థ ప్రతినిధులతో సమావేశం. తర్వాత బిజినెస్ రౌండ్ టేబుల్ భేటీలో పాల్గొంటారు. నైపుణ్యాల నుంచి సామర్థ్యాల వైపు మళ్లడం.. కార్మిక శక్తిని వేగవంతం చేయడం' అనే అంశంపై చర్చ.
- 11 గంటలకు ఎవర్వోల్ట్ ఛైర్మన్ సైమన్‌తో భేటీ. 11.30కి సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ సందర్శన.
- మధ్యాహ్నం ఒంటిగంటకు టుయాస్ పోర్టులో పర్యటన. ఏపీలో పోర్టు ఆధారిత స్మార్ట్ లాజిస్టిక్స్, భారీగా తయారీ, ఎగుమతి మౌలిక సదుపాయాలపై ఓడరేవులకు చెందిన ప్రముఖ సంస్థ పీఎస్ఏ సీఈవో విన్సెంట్‌తో చర్చలు.
- సాయంత్రం 4.30కి ఏపీ-సింగపూర్ బిజినెస్ ఫోరం నిర్వహించే రోడ్‌షోకు హాజరు. సింగపూర్, అంతర్జాతీయ పెట్టుబడిదారుల సమక్షంలో రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలపై సీఎం ప్రసంగం
- సాయంత్రం 6 గంటలకు అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీతో సమావేశం.

ఏపీకి వస్తాం!

రాష్ట్రంలో గృహనిర్మాణంపై సుర్బానా జురాంగ్ ఆసక్తి

సీఎంతో సంస్థ సీఈవో చెర్ ఎక్లో భేటీ

- సింగపూర్ మోడల్ హౌసింగ్ విధానంపై చర్చ
- అమరావతి మాస్టర్‌ప్లాన్ మెరుగుదలపైనా
- ఏపీ లాజిస్టిక్ హబ్‌గా తయారవుతోంది
- 20 రేవులు, 15 విమానాశ్రయాలు వస్తున్నాయ్
- పారిశ్రామిక టౌన్‌షిప్పులుగా అభివృద్ధి: సీఎం
- ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎవర్సెండాయ్ ప్రతిపాదన
- విశాఖ లేదా కృష్ణపట్నంలో పెట్టేందుకు ఆసక్తి
- ఐఐటీతో కలిసి ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ సెంటర్‌కు రెడీ

అమరావతి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా నిర్మాణ రంగంలో పేరెన్నికగన్న రెండు సంస్థలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు సంసిద్ధత తెలిపాయి. సింగపూర్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు తన తొలి రోజు భేటీల్లో భాగంగా నిర్మాణ రంగంలో పేరొందిన సుర్బానా జురాంగ్, ఎవర్సెండాయ్ సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆదివారం ఉదయం సుర్బానా సంస్థ గ్లోబల్ టౌన్‌షిప్ సీఈవో చెర్ ఎక్లో ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెద్దఎత్తున గృహనిర్మాణం చేపట్టేందుకు ముందుకు రావాలని సీఎం ఆయన్ను ఆహ్వానించారు. ఏపీలో 'హౌసింగ్ ఫర్ ఆల్' ప్రాజెక్టులో భాగం కావాలని సూచించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో సింగపూర్ మోడల్ హౌసింగ్ విధానం అమలుపై ఇరువురి నడుమ చర్చ జరిగింది. ఏపీలో.. ముఖ్యంగా అమరావతిలో ప్రభుత్వ హౌసింగ్ కార్యక్రమాలపై సుర్బానాతో భాగస్వామ్యం, సహకారంపైనా చర్చించారు. సింగపూర్‌లో 83 శాతం గృహనిర్మాణాన్ని అక్కడి ప్రభుత్వమే చేపట్టిందని చెర్ ఎక్లో చెప్పారు. రాష్ట్రంలో మొత్తం 20 రేవులు, 15 విమానాశ్రయాలు అందుబాటులోకి వస్తున్నాయని.. ఏపీ లాజిస్టిక్ హబ్‌గా తయారవుతోందని సీఎం తెలిపారు. ఈ ప్రాంతాలను పారిశ్రామిక టౌన్‌షిప్పులుగా అభివృద్ధి చేయాలనే ప్రభుత్వ ఆలోచనలను సుర్బానా ముందు ఉంచారు. ఏపీలో మౌలిక వసతుల ప్రాజెక్టులపై దృష్టి సారించామని, ప్రధానంగా గృహ నిర్మాణ రంగంపై ఆసక్తిగా ఉన్నట్లు చెర్ ఎక్లో సీఎంకు తెలిపారు. తప్పకుండా పెట్టుబడులు పెడతామని హామీ ఇచ్చారు. గతంలో రాజధాని అమరావతి కోసం సిద్ధం చేసిన మాస్టర్ ప్లాన్‌ను మరింత మెరుగుపరిచే అంశంపైనా ఎక్లోతో సీఎం ఆయనతో చర్చించారు. అమరావతిని భవిష్యత్ నగరంగా మార్చే క్రమంలో ప్రోగ్రాం మేనేజ్‌మెం ట్ కన్సల్టెన్సీగా సుర్బానా జురాంగ్ పనిచేయనుంది.

ఎవర్సెండాయ్ ఎండీతో సమావేశం..

మలేషియాకు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ఎవర్సెండాయ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ తన్‌శ్రీ డాటో నాథన్ కూడా సీఎంను కలిశారు. రాష్ట్రంలో అత్యాధునిక ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీతో పాటు ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుపై చర్చ జరిగింది. ఏపీలో ఫ్యాబ్రికేషన్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామని, విశాఖపట్నం లేదా కృష్ణపట్నంలో నెలకొల్పే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు నాథన్ తెలిపారు. సుమారు 2 లక్షల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫ్యాబ్రికేషన్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త ఫ్యాక్టరీని వ్యూహాత్మకంగా ముఖ్యమైన ప్రాంతంలో ఏర్పాటు చేసి దేశమంతటా ఫ్యాబ్రికేషన్ ఉపకరణాలను రవాణా చేయాలన్న ఆలోచనతో ఉన్నట్లు వివరించారు. ప్రతిపాదిత ఫ్యాక్టరీ ద్వారా పెద్దఎత్తున ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. అటు రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లోనూ భాగస్వామ్యం అవుతామని చెప్పారు. రాష్ట్రంలోని ఐఐటీ-తిరుపతి, ఐఐఐటీ-శ్రీసిటీ వంటి సంస్థలతో కలిసి స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ ట్రైనింగ్ సెంటర్ స్థాపనకూ ఆసక్తి వ్యక్తం చేశారు.



సీఎం చంద్రబాబుతో ఎవర్సెండాయ్ కార్పొరేషన్ ఎండీ తన్‌శ్రీ డాటో నాథన్

ఈ సంస్థల ప్రత్యేకత ఇదీ..?

● ఎవర్సెండాయ్..

మలేషియా కేంద్రంగా పనిచేసే ఈ సంస్థను తన్‌శ్రీ డాటో నాథన్ స్థాపించారు. అంచెలంచెలుగా ఎదిగిన ఈ సంస్థ ప్రస్తుతం ప్రపంచంలోనే అత్యంత డిమాండ్ ఉన్న ఇంటిగ్రేటెడ్ స్ట్రక్చరల్ స్టీల్ టర్న్‌కీ కాంట్రాక్టు సంస్థగా ఎదిగింది. అత్యంత ఎత్తయిన భవనాల స్టీల్ ఫ్యాబ్రికేషన్‌లో దీనికి మంచి పేరుంది. బుర్జ్ ఖలీఫా, పెట్రోనాస్ టవర్-2, చెన్నైలోని డీఎల్ఎఫ్ డౌన్‌టౌన్ తారామణి ప్రాజెక్టు, గుజరాత్‌లోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ఫ్యాబ్రికేషన్ పనుల్లో ఈ సంస్థ భాగస్వామిగా ఉంది. ఇది ఇప్పటికే తమిళనాడులోని తిరుచ్చిలో 30 వేల టన్నుల సామర్థ్యంతో ఫ్యాబ్రికేషన్ యూనిట్ నిర్వహిస్తోంది.

● సుర్బానా జురాంగ్..

సింగపూర్ కేంద్రంగా పనిచేసే ఈ సంస్థ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగంలో పేరొందింది. ఆస్ట్రేలియాలోని స్నోవీ పర్వతాల్లో ఈ సంస్థ నిర్మించిన హైడ్రో ఎలక్ట్రిక్ స్కీంను ప్రపంచంలోని ఏడు ఇంజనీరింగ్ వింతల్లో ఒకటిగా చెబుతారు. భారత్‌లోనూ పలు ప్రాజెక్టులకు పని చేసింది. ప్రపంచంలోనే పొడవైన టన్నెల్‌గా పేరొందిన అటల్ టన్నెల్ డిజైన్ రూపకల్పనలో సుర్బానా భాగస్వామిగా ఉంది. అలా ప్రపంచంలోనే అతిపెద్ద డీశాలినేషన్ ప్లాంట్లలో ఒకటైన తమిళనాడులోని పేరూరులో డీశాలినేషన్ ప్లాంట్ నిర్మాణంలోనూ ఈ సంస్థకు భాగస్వామ్యం ఉంది.

పెట్టుబడులే లక్ష్యం

ఏపీ అత్యంత అనుకూలం

- డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్, ఏరో స్పేస్‌లో విస్తృత అవకాశాలు
- సింగపూర్ నుంచి భారత్‌కు పెట్టుబడులు రావాలి
- వాటికి ఏపీ గేట్‌వేగా ఉండాలి
- భారత్ హైకమిషనర్‌తో చంద్రబాబు
- సింగపూర్‌లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న అంబులే



సింగపూర్‌లో భారత హైకమిషనర్ అంబులేను సత్కరిస్తున్న సీఎం చంద్రబాబు

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): పోర్టులు, గ్రీన్ ఎనర్జీ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్‌లో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సింగపూర్ పర్యటనలో భాగంగా ఆదివారం అక్కడి భారత హైకమిషనర్ డాక్టర్ శిల్పక్ అంబులేతో సమావేశమయ్యారు. సీఎంతో పాటు మంత్రులు నారాయణ, లోకేశ్, టీజీ భరత్, అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో సింగపూర్ ప్రగతి, వృద్ధిరేటు, ప్రభుత్వ పాలసీలు, సింగపూర్‌లో భారతీయుల కార్యకలాపాల గురించి చంద్రబాబుకు అంబులే వివరించారు. ఆరోగ్య రంగం, గ్రీన్ హైడ్రోజన్, ఏవియేషన్, సెమీ కండక్టర్లు, పోర్టులు, పారిశ్రామిక రంగాల్లో సింగపూర్ అనుసరిస్తున్న విధానాలను వివరించారు. భారత్‌తో సింగపూర్ ప్రభుత్వం మంచి సంబంధాలను కలిగి ఉందని అంబులే తెలిపారు. సింగపూర్ ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల్లో సీబీఎన్ బ్రాండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎంకు తెలిపారు. భారత్‌లో ప్రత్యేకించి ఏపీలో పెట్టుబడులకు సింగపూర్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని చెప్పారు. సీఎం చంద్రబాబు స్పందిస్తూ.. గతంలో సింగపూర్‌తో కలిసి అమరావతి ప్రాజెక్టును చేపట్టామని, కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్టు నుంచి సింగపూర్ బయటకు వెళ్లిందని అన్నారు. సింగపూర్‌తో రాజధాని నిర్మాణ భాగస్వామ్యం విషయంలో అలా జరిగి ఉండకూడదని, తన పర్యటన ద్వారా గతంలో ఉన్న మంచి వాతావరణాన్ని పునరుద్ధరించే ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వీలుగా ప్రగతిశీల విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పాలసీలు, పెట్టుబడులకు గల అవకాశాలను సింగపూర్ పారిశ్రామికవేత్తలకు వివరించి, పెట్టుబడులను ఆకర్షించడమే తన పర్యటన లక్ష్యమని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ రంగంలో 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామన్న సీఎం.. గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు ఏపీలో ఇప్పటికే పట్టాలెక్కాయని వివరించారు. ఇండియా క్వాంటమ్ మిషన్‌లో భాగంగా క్వాంటమ్ వ్యాలీని అమరావతిలో ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని, డిఫెన్స్, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సంస్థలకు రాయలసీమ ప్రాంతంలో అనువైన పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. 'ఇండియాకు సింగపూర్ నుంచి పెట్టుబడులు రావాలి.. వాటికి ఏపీ గేట్‌వేగా ఉండాలి' అని అన్నారు. ఏపీలో పెట్టుబడులకు అవసరమైన సహకారాన్ని అందించాలని అంబులేను సీఎం కోరారు. విద్యా రంగంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, తమ ఆలోచనలను మంత్రి లోకేశ్ వివరించారు. ఏపీలో ఇప్పటికే ఏర్పాటవుతున్న ప్రముఖ విద్యాసంస్థల గురించి చెబుతూ, ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఏపీలో చేపడుతున్న ప్రాజెక్టుల గురించి మంత్రి నారాయణ వివరించారు.

సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ పార్టీ

- ఎంజాయ్ కోసం ఏపీ నుంచి నగరానికి
- 9 మంది అరెస్టు.. డ్రగ్స్ సీజ్



ఎక్సైజ్ సిబ్బంది అదుపులో నిందితులు

హైదరాబాద్ సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఐటీ కారిడార్‌లోని కొండాపూర్‌లో.. ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌లో డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్న ముఠా ఆటను ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం కట్టించింది. నిందితులంతా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారే..! పోలీసుల కథనం ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన అశోక్ నాయుడు కొండాపూర్ ప్రాంతంలో డ్రగ్స్ పార్టీలు నిర్వహిస్తుంటారు. ఏపీకి చెందిన కెంగర్ రాహుల్, ఉన్నాటి ఇమాన్యుయేల్ అలియాస్ అనీల్ అలియాస్ ప్రవీణ్ కుమార్ అలియాస్ మన్నేల నుంచి ఇతను డ్రగ్స్(ఓజీకుష్, మ్యాజిక్ మష్రూమ్, చరస్, ఎల్ఎస్‌డీ బ్లాట్స్, గంజాయి) కొనుగోలు చేస్తూ, సర్వీస్ అపార్ట్‌మెంట్లలో డ్రగ్స్, రేవ్ పార్టీలు ఏర్పాటు చేస్తుంటారు. ఈ క్రమంలో కొండాపూర్ జేవీజీ హిల్స్‌లోని ఓ సర్వీస్ అపార్ట్‌మెంట్‌ను బుక్ చేశారు. విజయవాడ, మంగళగిరి, కాకినాడ, రాజమండ్రికి చెందిన సమ్మెల సాయికృష్ణ, నాగెళ్ల లీలామణికంఠ, హిల్టన్ జోసఫ్ రోల్ఫ్, అడప యశ్వంత్ శ్రీదత్త, తోట కుమారస్వామి, నందం సుమంత్ తేజలను పార్టీకి ఆహ్వానించారు. వీరంతా పార్టీలో ఉండగా.. ఉప్పందుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ బృందం దాడి చేసి, అశోక్‌నాయుడు, అతని కస్టమర్లను అరెస్టు చేసింది. వారికి డ్రగ్స్ పరీక్ష నిర్వహించగా.. పాజిటివ్‌గా తేలింది. నిందితుల నుంచి 2.08 కిలోల గంజాయి, 50 గ్రాముల ఓజీకుష్, 11.57 గ్రాముల మ్యాజిక్ మష్రూమ్, 1.91 గ్రాముల చరస్, 4 ఎల్ఎస్‌డీ బ్లాట్లు, రెండు ఫోర్డ్ కార్లు(ఏపీ07సీయూ-7154, ఏపీ39ఎస్ఆర్-0001), రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు శ్రీనివాస్ చౌదరి అలియాస్ వాసు, అఖిల్ పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. సీజ్ చేసిన కార్లలో ఒకదానిపై ఎంపీ స్టిక్కర్ ఉండడంతో.. ఈ కేసులో బడాబాబుల పిల్లల పాత్ర ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.



'ఉపాధి'లో దోచేశారు!

(మొదటి పేజీ తరువాయి)

దుర్వినియోగమయ్యాయని, ఉపాధి పథకంలో అనుమతి లేకపోయినా ఊరి అవతల, కొండల్లో, చెరువుల్లో మట్టి తోలి నిధులు దుర్వినియోగం చేసిన విషయాన్ని చెప్పింది. అదే ఇప్పుడు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల తనిఖీల్లోనూ వెల్లడైంది. జగనన్న కాలనీల చదును పనులు, పంచాయతీ భవనాలు, రోడ్లకు సంబంధించి రాష్ట్రస్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరముందని పేర్కొన్నారు. రూ.కోటికి పైగా అంచనాతో చేపట్టిన పనుల్లో జరిగిన అవినీతికి సంబంధించి రికవరీలు చేపట్టాలన్నారు.

నిబంధనలను తుంగలో తొక్కి మరీ..

ఏపీలో గతంలో ఉపాధి హామీ పథకం పనులు ఎలా నిర్వహించారన్న దానిపై జాతీయ స్థాయి మానిటరింగ్ బృందాలు ఇటీవల తనిఖీలు చేపట్టాయి. శ్రీకాకుళం, తిరుపతి, కాకినాడ, అనంతపురం జిల్లాల్లో పనుల తీరును పరిశీలించింది. గత వైసీపీ ప్రభుత్వం 'ఉపాధి' నిధులను దోచుకున్నట్లు వెల్లడైంది. అనుమతి లేకపోయినా ఇష్టారీతిన జగనన్న కాలనీల చదును పనులు చేపట్టారని అధికారులు తేల్చారు. పట్టు పరిశ్రమల షెడ్‌లు, పరిమితికి మించి పంచాయతీల భవనాల నిర్మాణాలతో నిబంధనను తుంగలో తొక్కారని పేర్కొన్నారు. గతంలో గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించిన చోటనే సచివాలయాల భవనాల కోసం పంచాయతీ భవనాల పేరిట మళ్లీ మంజూరు చేశారని పేర్కొన్నారు. పూల తోటల పెంపకం లాంటి కార్యక్రమాలు ఉపాధి పథకంలో లేకపోయినా చేపట్టి నిధులు దుర్వినియోగం చేశారని తెలిపారు. పంచాయతీ ప్రణాళికలు, గ్రామసభ తీర్మానాలు లేకుండానే అడ్డగోలుగా పనులు ఎంపిక చేశారని పేర్కొన్నారు. గ్రామసభ ప్రాధాన్యతలు, ప్రాజెక్టు నివేదికలు లేకపోవడం, పనుల జియోట్యాగింగ్‌లో తప్పులు, వర్క్‌ఫైల్స్ నిర్వహణ లోపభూయిష్టం, ప్రొక్యూర్‌మెంట్ రికార్డులు లేమి ఈ తనిఖీల్లో బయటపడ్డాయి. జీఎస్టీ ఇన్‌వాయిస్ లేకుండానే బిల్లులు చెల్లించడం, కొన్ని గ్రామ పంచాయతీలు నిర్వహించినట్లు చూపించినా.. అకౌంట్ల నిర్వహణ చేయకపోవడం కనిపించింది. మెటీరియల్ ప్రొక్యూర్‌మెంట్‌కు టెండర్లు చేపట్టలేదని పేర్కొన్నారు. వాస్తవంగా పనులు జరిగిన దానిపై ప్రజల అభిప్రాయానికి, సోషల్ ఆడిట్ నివేదికకు సంబంధం లేకపోవడం, వర్క్‌సైట్ బోర్డులు ఎక్కడా కనిపించలేదని పేర్కొన్నారు.

తప్పుల లిస్టు చాలా పెద్దది!

వైసీపీ హయాంలో శ్రామికులతో కుంటలు, చెరువులు తవ్వినట్లు మస్టర్లు నమోదు చేసినప్పటికీ ఎక్కడా పూడికలు తీసినట్లు కనపడలేదు. కొన్నిచోట్ల సిమెంట్‌రోడ్లు ఒకచోట మంజూరు కాగా.. మరోచోట పనులు చేపట్టారు.

ఉపాధి పథకంలో పట్టుపురుగుల షెడ్‌ల నిర్మాణం అనుమతి లేదు. పొలంలో సెరికల్చర్ మొక్కలు లేకపోయినా భవనాలను నిర్మించి నిధుల దుర్వినియోగం చేశారు. లేబర్-మెటీరియల్ నిష్పత్తి నిర్వహణలో, పేదలకు ఉపయోగపడే పనులు చేపట్టడంలో విఫలమయ్యారు. పలుచోట్ల ఎన్ఎంఎంఎస్ యాప్‌ను దుర్వినియోగం చేశారు. సోషల్ ఆడిట్ అసలే చేపట్టకపోవడం, చేపట్టినా లోపభూయిష్టంగా చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించి గ్రామ పంచాయతీ భవనాలకు రూ.20 లక్షల కంటే ఎక్కువ నిధులు వినియోగించారు. ఉపాధి పథకంలో హెల్త్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలకు అనుమతులు లేకపోయినా నిర్మించారు. పూర్తి మెటీరియల్ నిధులు గ్రామ పంచాయతీకి బదిలీ చేశారు. ఆ నిధుల విడుదలకు లెక్కలు లేవు. వ్యవసాయానికి యోగ్యత లేని భూములను సాగుకు ఉపయోగపడేలా మాత్రమే భూమి అభివృద్ధి పనులు చేపట్టాలి. అయితే గత ప్రభుత్వంలో సాగులో ఉన్న భూమికి కూడా పనులు చేపట్టారు. కొన్నిచోట్ల ఉపాధి పథకంలో చేపట్టాల్సిన పనులను పంచాయతీరాజ్‌శాఖ ద్వారా నిర్వహించారు. స్వయం సహాయక బృందాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాల సేకరణ కేంద్రాలను ఉపాధి నిధులతో నిర్మించినప్పటికీ.. వాటిని అమూల్‌కు అప్పగించారు.

తనిఖీల్లో జిల్లాల వారీగా వెల్లడైన అంశాలు..

శ్రీకాకుళం జిల్లాలో పనులు నిబంధనల ప్రకారం జరగలేదని తనిఖీ బృందం నివేదిక ఇచ్చింది. తిరుపతి జిల్లాలో నిధుల దుర్వినియోగం జరిగింది. తప్పుడు మస్టర్లు నమోదు చేశారని పేర్కొన్నారు. కాకినాడ జిల్లాలో వేతనాల కంటే మెటీరియల్ పనుల నిష్పత్తి ఎక్కువగా ఉంది. అనుమతి లేని మౌలిక వసతుల పనులు చేపట్టారు. అప్రాధాన్యత పనులు చేపట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీరాజ్ కన్వర్జెన్స్ ద్వారా పనులు చేపట్టారని వెల్లడించారు. అనంతలో సిమెంట్‌రోడ్లు, డ్రైన్లు ప్రణాళిక లేకుండా నిర్మించారని, సోషల్ ఆడిట్ ఈ పనుల తనిఖీల్లో విఫలమైందని పేర్కొన్నారు.

'కరోనా' సొమ్మూ పక్కదారి!

వైసీపీ పాపాలు

(మొదటి పేజీ తరువాయి)

నిధులిచ్చినా 60శాతమే ఇస్తుంది. మిగిలిన 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద కేటాయించి.. నిర్దేశిత కార్యక్రమాల కోసం ఖర్చు చేయాలి. కొవిడ్ రెండో దశలో కేంద్రం టెస్టింగ్ కిట్స్, రోగులకు అవసరమైన మందులు, ఇతర అవసరాల నిమిత్తం రూ.300కోట్లకుపైగా కేటాయించింది. దీనిలో కేంద్ర వాటా రూ.208 కోట్లు. ఈ మొత్తాన్ని 2022-23 సంవత్సరంలోనే విడుదల చేసింది. దీనికి మ్యాచింగ్ గ్రాంట్ కింద రాష్ట్రప్రభుత్వం మరో రూ.139 కోట్లను కేటాయించాల్సి ఉంది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ వాటాను ఇవ్వడంలో అప్పటి జగన్ ప్రభుత్వం విఫలమైంది. కేంద్రం నుంచి నిధులు వస్తే కొవిడ్ అవసరాలకు ఖర్చు చేయడం, లేదంటే లేదు.. అన్నట్టుగా వ్యవహరించింది. కేంద్రం తన వాటా కింద నిధులు ఇచ్చినా.. రాష్ట్ర వాటా కింద నిధులు కేటాయించి కొవిడ్‌ను కంట్రోల్ చేద్దామన్న ఆలోచనే చేయలేదు. ఈ నిర్లక్ష్యమే రోగుల ప్రాణాలు పోయేలా చేసింది.

ఎందుకు ఇవ్వలేదు?



2022-23లో కేంద్రం ఇచ్చిన రూ.208 కోట్లకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో కేంద్రం సీరియస్ అయింది. తాము కొవిడ్ కోసం నిధులిచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించింది. తమ నిధులకు వెంటనే మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయాలని అల్టిమేటం జారీ చేసింది. లేదంటే రూ.208 కోట్లకు రెండేళ్ల పాటు వడ్డీతో సహా వెనక్కి ఇవ్వాలని ఘాటు లేఖ రాసింది. ఈ మేరకు గత శుక్రవారం ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు కేంద్రం నుంచి లేఖ అందింది. కేంద్రం నుంచి వచ్చిన లేఖను చూసి ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు షాకయ్యారు. తమ నిధులను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని కోరుతూ రాష్ట్రానికి కేంద్రం లేఖ రాయడం ఇదే తొలిసారి. గత ప్రభుత్వ తప్పులకు ఇప్పుడు కూటమి సర్కారు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా వుంటే, కేంద్రం మ్యాచింగ్ గ్రాంట్ నిధులపై గతంలోనే రాష్ట్రానికి పలుమార్లు లేఖలు రాసింది. వాటికి రాష్ట్రం స్పందించలేదు. ఈ క్రమంలోనే కేంద్రం తమ నిధులు వెనక్కిచ్చేయాలని హెచ్చరించింది.

నష్టపోయిన సరఫరా దారులు


కొవిడ్ సమయంలో ప్రభుత్వానికి మందులు, సర్జికల్ ఐటమ్స్, టెస్టింగ్ కిట్స్ సరఫరా చేసిన సప్లయర్స్ గుల్ల అయిపోయారు. కరోనా సమయంలో అప్పటి జగన్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా మందులు, కిట్స్, మాస్కులు, పీపీఈ కిట్లు కొనుగోలుచేసింది. సప్లయర్స్ కూడా కొవిడ్ సమయంలో కష్టమైనా ప్రభుత్వం అడిగిన మందులు, కిట్స్ సరఫరా చేశారు. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన నిధులను ఇతర పథకాలకు మళ్లించుకోవడమే కాకుండా రూపాయి కూడా విడుదల చేయలేదు. ఇప్పటికే రెండేళ్లు గడుస్తున్నా చాలా మందికి బిల్లులు చెల్లించలేదు. దీంతో వారు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితికి వచ్చారు.

తగ్గిన వాన.. పెరిగిన ఎండ

- కావలిలో 37.1 డిగ్రీల ఉష్ణోగ్రత
- శ్రీశైలం ఒక్కగేటు ద్వారా నీటి విడుదల
- గోదావరిలో పెరుగుతున్న వరద ప్రవాహం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో ఆదివారం ఎండతీవ్రత పెరిగింది. మూడు, నాలుగు రోజులపాటు వర్షాలు, జల్లులు, మేఘాలతో చల్లబడిన వాతావరణం మళ్లీ వేడెక్కింది. పగటి ఉష్ణోగ్రతలు శనివారం కంటే మూడు, నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో 37.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురు వర్షాలు కురుస్తాయని, ఎండ తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవన కరెంట్ బలంగా ఉండడంతో కోస్తాలో తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. రానున్న 48 గంటలు ఉత్తరకోస్తాలో మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని వాతావరణ



శ్రీశైలం డ్యాం ఒక గేటు ద్వారా దిగువకు ప్రవహిస్తున్న కృష్ణమ్మ

నిపుణుడొకరు హెచ్చరించారు. ఆగస్టు తొలి వారంలో రుతుపవనద్రోణి తూర్పుభాగం దక్షిణాదివైపునకు వచ్చే అవకాశం ఉన్నందున కోస్తాలో వర్షాలు పెరుగుతాయన్నారు. కాగా, కృష్ణా, గోదావరి, తుంగభద్ర నదుల్లో వరద ప్రవాహం పూర్తి స్థాయిలో తగ్గే వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది. శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం తగ్గింది. శనివారం రెండు గేట్లు ఎత్తిన అధికారులు ఆదివారం ఒక గేటును మూసివేశారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి శ్రీశైలానికి 1,18,274 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో ఒక్క గేటు ఎత్తి 66,417 క్యూసెక్కుల నీటిని దిగువనున్న నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 882 అడుగులకు చేరుకుంది. గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 198.81 టీఎంసీల నీరు ఉంది. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 93,115 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్‌లో నీటిమట్టం 584అడుగులకు చేరింది. ఇది 291.37 టీఎంసీలకు సమానం. పులిచింతల ప్రాజెక్టులో 20.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 26,430 క్యూసెక్కుల నీరు పులిచింతల ప్రాజెక్టుకు చేరుతోంది. ఇక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఉప నదులు శబరి, సీలేరు, మంజీర, ప్రవర, పర్ణ, ఇంద్రావతి నుంచి అదనంగా వస్తున్న 6,89,258 క్యూసెక్కుల వరదను పోలవరం స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 35.00 అడుగులకు చేరింది. ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజ్ 175 గేట్లను 1.5 మీటర్లు ఎత్తి 6,18,044 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

గనుల ఆదాయం పెంచాలి

(మొదటి పేజీ తరువాయి)

923 కోట్లే ఉంది. మరో రెండేళ్లలో ఈ ఆదాయం ఎంతలేదన్నా కనీసం 2 వేల కోట్లకు చేరుకోవాల్సి ఉంటుందని, అప్పుడే బాండ్లకు చెల్లింపులు సజావుగా సాగుతాయని ఆ నివేదికలో ఉంది. ఆదాయం పెరిగే విషయంలో సాధ్యాసాధ్యాలపై గనుల శాఖ అధికారులు తర్జనభర్జనపడుతున్నారు. ఇందుకోసం ప్రభుత్వం ముందు కొన్ని ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు ఉంచారు. అయితే అందులో కొన్ని వర్కవుట్ అయ్యే అవకాశాలే కనిపించడం లేదు.

ఎండీసీకి కోట్ల బకాయిలు

ఏపీఎండీసీకి ప్రభుత్వం నుంచి రూ.1,444 కోట్లు రావాల్సి ఉంది. అందులో ఇసుక బకాయిలు 55 కోట్లు. జగన్ ప్రభుత్వంలో సర్వే రాళ్ల కోసం నాటి గనుల శాఖ అధికారి వెంకటరెడ్డి అత్యుత్సాహంతో చెల్లించిన 525 కోట్లు రెవెన్యూ శాఖ నుంచి రాలేదు. ఈ బకాయిలు ఇప్పించాలని గనుల శాఖ సర్కారును కోరుతోంది. మరో 555 కోట్లు ఆంధ్రప్రదేశ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కార్పొరేషన్ వద్ద డిపాజిట్ రూపంలో ఉన్నాయి. వీటిని తిరిగి ఇప్పించాలని గనుల శాఖ ప్రభుత్వాన్ని కోరుతోంది. ప్రైవేటు బకాయిలు కూడా భారీగా ఉన్నాయి. జగన్ ప్రభుత్వం చివరి రోజుల్లో సర్కారుకు తెలియకుండా నాటి ఇసుక కాంట్రాక్ట్ సంస్థ జేపీ వెంచర్స్‌కు బ్యాంక్ గ్యారెంటీలు వెనక్కి ఇప్పించారు. కానీ ఆ సంస్థ ఎండీసీకి 167 కోట్లు చెల్లించాలి. ఆ సంస్థ బకాయిలున్నా వెంకటరెడ్డి ప్రభుత్వానికి, ఆర్థిక శాఖకు తెలియకుండా బ్యాంక్ గ్యారెంటీలు ఇప్పించారు. పైగా ఆ సంస్థ ఎండీసీకి ఎలాంటి బకాయిలు లేదంటూ సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పుడు ఈ బకాయిల వసూలుకు ప్రభుత్వ స్థాయిలో చర్యలు తీసుకోవాలని గనుల శాఖ కోరుతోంది. బెరైటీస్‌కు సంబంధించి ఆరు కంపెనీల నుంచి ఎండీసీకి నికరంగా 242 కోట్లు రావాల్సి ఉంది. ట్రైమెక్స్ కంపెనీ 37 కోట్లు, ఐబీసీ 29 కోట్లు, కిషన్ ఎంటర్‌ప్రైజెస్ 5.2 కోట్ల మేర బకాయిలు ఉన్నాయని గనుల శాఖ చెబుతోంది. ఇందులో ఓ వైసీపీ ప్రముఖుడి కంపెనీ కూడా ఉంది.

తెరపైకి బాక్సైట్

బాగా ఆదాయం తీసుకొచ్చే ఖనిజాల తవ్వకాల ప్రతిపాదనల్లో గనుల శాఖ బాక్సైట్ బ్లాక్‌లను చూపించింది. విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఉన్న బాక్సైట్‌ను ఏటా 5లక్షల టన్నుల మేర తవ్వి తీయడం ద్వారా 1,400 కోట్లు రావొచ్చని పేర్కొంది. అయితే ఇదంతా షెడ్యూల్డ్ ఏరియా, అటవీ ప్రాంతంలో ఉంది. గతంలోనే బాక్సైట్ తవ్వకాలపై గిరిజనులు, ప్రజాసంఘాల నుంచి ఆందోళన వ్యక్తమైంది. దీంతో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేశారు. దీని ఫలితంగా రస్అల్ ఖైమా నష్టపరిహారం కోరుతూ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టులో కేసు వేసింది. మరో ప్రత్యామ్నాయంగా అనంతపురం జిల్లా ఓబుళాపురంలోని ఐరన్‌ఓర్ మైనింగ్‌ను ప్రతిపాదించారు. ఇందులోనూ అనేక న్యాయ చిక్కులున్నాయి. అవి తేలేవరకు కొలిక్కి వచ్చే అవకాశమే లేదు. నిర్దేశిత విధానంలో ఏపీఎండీసీ 2026-27 నాటికి రెట్టింపు ఆదాయం పొందాలంటే కోట్ల వర్షం కురిపించే కొత్త ప్రాజెక్టులు రావాల్సిందే.

గనుల శాఖ ప్రత్యామ్నాయాలివీ..

- మంగంపేటలోని సీ, డీ, బ్ల్యూ గ్రేడ్‌ల బెరైటీస్‌ను అమ్మేయడం వల్ల కనీసం 120 కోట్లు వస్తుందని అంచనా.
- మధ్యప్రదేశ్‌లోని సులియారీ కోల్‌బ్లాక్‌లో బొగ్గు తవ్వకాలను మరింతగా పెంచాలనుకుంటోంది. దీనివల్ల అదనంగా మరో 150 కోట్లు వస్తుందని అంచనా వేసింది. ఇందులో బీచ్‌శాండ్ మినరల్స్‌ను కూడా కలిపింది. నిజానికి ఈ టెండర్ వ్యవహారాన్ని హైకోర్టు నిలిపివేసింది. అదానీ గ్రూప్ బీచ్‌శాండ్ టెండర్ కోసం అనేక ప్రయత్నాలు చేస్తోంది. కోర్టు కేసు వల్ల టెండర్ నిలిచిపోయింది.
- ప్రకాశం జిల్లా కొణిజేడు-మర్లపాడు ఐరన్‌ఓర్ ప్రాజెక్టు టెండర్లు జగన్ ప్రభుత్వ హయాంలో జరిగాయి. కానీ టెండర్ దక్కించుకున్న జేఎస్‌డబ్ల్యూ సంస్థ ఇప్పటి వరకు ఒప్పందం చేసుకోలేదు. ఇది ముందుకు సాగుతుందా? అన్న సందేహాలు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 300 కోట్ల ఆదాయం వస్తుందన్న అంచనాలు ప్రశ్నార్థకమే.

'మార్గదర్శకులు'గా టీచర్లా?

(మొదటి పేజీ తరువాయి)

మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు లేదా స్కూల్ అసిస్టెంట్లను మార్గదర్శులుగా నమోదు చేయాలని అది కూడా శనివారం సాయంత్రానికి పూర్తిచేయాలని స్పష్టంచేశారు. దీనిపై ఉపాధ్యాయ వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. వాస్తవానికి పీ-4 పథకం అనేది స్వచ్ఛందంగా అమలుచేయాలి. ఏదైనా కుటుంబాన్ని దత్తత తీసుకునేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుకొస్తే వారిని మార్గదర్శులుగా నమోదుచేయాలి. అప్పటి నుంచి ఆ కుటుంబ ఆర్థిక స్థితి మెరుగుపడే వరకు మార్గదర్శి బాధ్యత తీసుకుంటారు. కానీ, ప్రభుత్వ ఉద్యోగులైన టీచర్లను బలవంతంగా మార్గదర్శులను చేయాలని ప్రయత్నించడాన్ని ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించే ఉపాధ్యాయులు కూడా దీనిని తప్పుబడుతున్నారు. బాగా డబ్బున్నవారు కుటుంబాలను దత్తత తీసుకుంటారుగానీ తమలాంటి చిన్నపాటి ప్రభుత్వ ఉద్యోగులకు అంతస్థాయి ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. పీఆర్‌సీ, ఇతర ఆర్థిక ప్రయోజనాల కోసం ఎదురు చూస్తున్నామని తమనే ఎవరైనా దత్తత తీసుకోవాలంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానిస్తున్నారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి ఈ ఉత్తర్వులను ఖండించారు. పలు జిల్లాల్లో అధికారులు టీచర్లను మార్గదర్శులుగా నమోదుచేయాలని ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. బలవంతంగా నమోదు చేయించే విధానాన్ని విరమించుకోవాలన్నారు.

నేటి నుంచి అమరవీరుల వారోత్సవాలు



చింతూరు, జూలై 27(ఆంధ్రజ్యోతి): సోమవారం నుంచి మావోయిస్టుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పేరిట లేఖ విడుదలైంది. ప్రతిఏటా మాదిరిగా జూలై 28 నుంచి ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను నిర్వహించ తలపెట్టినట్లు వివరించారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, పార్టీని విప్లవోద్యమాన్ని కాపాడుకుందామని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు. దీంతో ఏపీలోని అల్లూరి జిల్లా చింతూరు డివిజను పోలీసులు అప్రమత్తమయ్యారు. అనుమానిత ప్రదేశాల్లో నిఘా పెంచారు. వాహనాలను నిలువరించి తనిఖీలు చేస్తున్నారు. రాత్రి వేళలో చింతూరు వైపు నుంచి భద్రాచలం వైపు సాగే రాకపోకలను వయా కూనవరం మీదుగా మళ్లిస్తున్నారు. ఇందులోభాగంగా విజయవాడ జగదల్‌పూర్ జాతీయ రహదారిపై పోలీసులు గట్టి పహారా కాస్తున్నారు.

అనకాపల్లి ఆస్పత్రిలో
22 మందిపై విచారణ!

- ఏసీబీ నివేదిక ఆధారంగా సత్యకుమార్ ఆదేశం

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆస్పత్రిలో గతంలో పలు అక్రమాలకు పాల్పడిన 22 మందిపై త్వరితగతిన విచారణ చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. 2020 ఫిబ్రవరిలో ఈ ఆస్పత్రిలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గుర్తించిన పలు అక్రమాలపై ఏసీబీ సమర్పించిన నివేదిక ఆధారంగా విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టేందుకు అనుమతిచ్చినట్లు మంత్రి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. అప్పటి డీసీహెచ్‌యస్‌తోపాటు తొమ్మిది మంది వైద్యులు, 12 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సుల అక్రమాలపై శీఘ్రంగా విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఆ ఆస్పతిలో లైసెన్స్ లేకుండా క్యాంటీన్ నిర్వహణ, భోజనం అందించాల్సిన రోగుల వివరాల్ని తెలపకపోవడం, ఆహార సరఫరా నాణ్యత పట్ల నిర్లక్ష్యంతోపాటు విధి నిర్వహణలో పూర్తిగా విఫలం కావడంతో వీరిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని ఏసీబీ సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రుల్లో మార్పు తెచ్చేందుకు మరింత పటిష్టమైన చర్యల్ని చేపట్టాలని ఆయన ఆదేశించారు.

గ్రంథాలయ పరిషత్‌కు సభ్యుల నియామకం

అమరావతి, జూలై 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు నలుగురు సభ్యులను నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.సోమశేఖరరావు, విజయనగరానికి చెందిన రిటైర్డ్ సూపరింటెండెంట్ రౌతు రామమూర్తి, గుంటూరుకు చెందిన మగతాల పద్మజ, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ వీఆర్ రాసని సభ్యులుగా నియమితులయ్యారు.

సంతాన సాఫల్యం
ముసుగులో శిశు విక్రయం!

- సరగసీ విధానంలో సంతాన భాగ్యం కల్పిస్తానంటూ.. పిల్లలు లేని దంపతుల నుంచి రూ.35 లక్షలు వసూలు
- వేరే జంటకు పుట్టిన పిల్లాణ్ని కొని.. వీరికి అమ్మిన వైనం
- సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ అక్రమాలను వివరించిన డీసీపీ రష్మి

హైదరాబాద్‌సిటీ/అడ్డగుట్ట, జూలై 27(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్' కేసులో విస్తుపోయే విషయం వెలుగులోకి వచ్చింది! సరగసీ (అద్దె గర్భం) లేదు.. దాతల నుంచి వీర్యం సేకరించీ కాదు.. ఆ సెంటర్ నిర్వాహకులు శిశువిక్రయానికి పాల్పడుతున్నారని పోలీసు దర్యాప్తులో తేలింది. సరగసీ విధానంలో సంతాన భాగ్యం కల్పిస్తానంటూ నమ్మబలికిన 'సృష్టి' నిర్వాహకురాలు నమ్రత (64).. వారి నుంచి వీర్యం, అండం సేకరించి హడావుడి చేసి, చివరకు వేరెవరికో పుట్టిన బిడ్డను కొని వారికి అమ్మినట్టు వెల్లడైంది. మోసపోయిన ఆ దంపతుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు నమ్రత, ఆమె అక్రమాలకు సహకరిస్తున్న ఆమె కుమారుడు సహా 8మందిని అరెస్ట్ చేశారు. సికింద్రాబాద్‌లోని నార్త్‌జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రష్మిక పెరుమాళ్.. విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. కొన్నాళ్లుగా సికింద్రాబాద్‌లో నివాసం ఉంటున్న దంపతులకు పెళ్లై ఏళ్లు గడుస్తున్నా పిల్లలు పుట్టకపోవడంతో.. గత ఏడాది ఆగస్టులో సికింద్రాబాద్‌లో ఉన్న యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు వెళ్లి అక్కడ డాక్టర్ నమ్రతను కలిశారు. రూ.66 వేల విలువైన పరీక్షలు చేయించిన ఆమె.. ఐవీఎఫ్ ద్వారా పిల్లలు పుట్టరని, సరగసీ (అంటే వీరిద్దరి వీర్యం, అండం కలయికతో ఏర్పడిన పిండాన్ని వేరే మహిళ గర్భంలో ఉంచి.. ప్రసవానంతరం పుట్టిన బిడ్డను వీరికి అప్పగించే ప్రక్రియ) ద్వారా అయితే సంతాన భాగ్యం కలుగుతుందని వారిని నమ్మించింది. అందుకు రూ.30లక్షలు అవుతుందని తెలిపింది. అంగీకరించిన ఈ దంపతులు.. పుట్టిన బిడ్డకు డీఎన్ఏ పరీక్ష చేసి, తమ బిడ్డేనని నిరూపించి అప్పగించాలని షరతు పెట్టారు. దానికి ఆమె సరేనని రూ.15 లక్షలు అడ్వాన్స్‌గా తీసుకుంది. ఒప్పందం మేరకు ఈ దంపతులు నిరుడు సెప్టెంబరులో విశాఖ వెళ్లి, అక్కడున్న సృష్టి బ్రాంచ్‌లో వీర్యం, అండం ఇచ్చివచ్చారు. తర్వాత కొద్ది రోజులకు వారికి సృష్టి సెంటర్‌వారు ఫోన్ చేసి.. "అద్దెగర్భానికి ఒక మహిళ ఒప్పుకొంది. పిండాన్ని ఆమె గర్భంలో ప్రవేశపెట్టడం కూడా పూర్తయింది" అని చెప్పారు. తర్వాత ఎప్పటికప్పుడు ఫోన్ చేసి.. అద్దెగర్భంలోని శిశువు ఆరోగ్యంగా ఉన్నట్టు చెబుతూ వచ్చారు. దశలవారీగా డబ్బు వసూలు చేశారు. గత నెలలో ఫోన్ చేసి.. 'సిజేరియన్ ద్వారా ప్రసవమైంది. మీరొచ్చి మీ బిడ్డను తీసుకోండి' అని చెప్పారు. వీరు విశాఖకు వెళ్లగా.. ఆపరేషన్ ఖర్చుల పేరుతో మరికొంత డబ్బు వసూలు చేసి ఒక బాబును అప్పగించారు. మొత్తంగా వారి నుంచి రూ.35 లక్షలు వసూలు చేశారు. ఇంతా చేస్తే.. ఆ బాబు పోలికలు తమతో సరిపోలకపోవడంతో ఆ దంపతులకు అనుమానం వచ్చి డీఎన్ఏ పరీక్షకు డిమాండ్ చేశారు. నమ్రత పట్టించుకోకపోవడంతో వారే ఢిల్లీలో డీఎన్ఏ పరీక్ష చేయించుకున్నారు. ఆ శిశువు తమ బిడ్డ కాదని తేలింది. దీనిపై వారు సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా సరిగా సమాధానం ఇవ్వకపోగా.. చట్టపరంగా చర్యలు తీసుకుంటామంటూ డాక్టర్ నమ్రత కుమారుడు జయంత్‌కృష్ణ బెదిరించాడు. దీంతో ఆ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా.. ఆ శిశువు అసోంకు చెందిన ఒక జంట బిడ్డ అని తేలింది. హైదరాబాద్‌లో ఉంటున్న ఆ జంటను విశాఖకు తరలించి అక్కడే ఉంచి, పిల్లాడు పుట్టగానే వారికి రూ.80-90 వేలు చేతిలో పెట్టి, ఆ శిశువునే సికింద్రాబాద్ దంపతులకు అమ్మేసినట్టు వెల్లడైంది. సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌పై 2 తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే 10కి పైగా కేసులు నమోదయ్యాయని.. ఆ కేసుల వివరాలు కూడా తెలుసుకుని దర్యాప్తు కొనసాగిస్తామని డీసీపీ వెల్లడించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.